Prajalakshyam Telugu Daily
# ప్రజాలక్ష్యం
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 16 | సంచిక: 327 | కరీంనగర్ | గురువారం 16 ఏప్రిల్, 2026 | పేజీలు: 12 | వెల: 2.00

## నిజామాబాద్ మార్కెట్లో పసుపు రైతుల దాడి

### ధరలు తగ్గించి కొనడంపై ఆందోళన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిజామాబాద్,ఏప్రిల్15 :నిజామాబాద్ మార్కెట్ యార్డుపై పసుపు రైతులు దాడికి దిగారు. బహిరంగ వేలం ద్వారా కొనుగోలు చేస్తూ పసుపు ధర తగ్గిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆన్ లైన్ లో ఒక ధర ఉంటే.. ఆఫ్ లైన్ ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. మార్కెట్ అధికారుల తీరుపై మండిపడ్డ రైతులు.. ఆఫీస్ పై దాడి చేశారు. మార్కెట్ అధికారులను ఘెరావ్ చేశారు. కుర్చీలు,

11లో

## తెలంగాణాలో భగ్గుమంటున్న భానుడు

### - పలు ప్రాంతాల్లో 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్15 : తెలంగాణ రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. మధ్యాహ్నామైతే చాలు భానుడు భగ్గుమంటున్నాడు. దాంతో వాతావరణ కేంద్రం హైదరాబాద్ సహా పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారిచేసింది. ఆరెంజ్ అలర్ట్ జారీచేయబడిన జిల్లాల్లో ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్ నగర్, నిజామాబాద్, ఖమ్మం, మెదక్, మేడ్చల్ మల్కాజ్‌గిరి ఉన్నాయి. రాష్ట్రంలోని పలు

11లో

# వారసత్వ కట్టడాలను పరిరక్షించాలి



### - పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలి
### - కుతుబ్‌షాహి టూంబ్స్ తదితర కట్టడాలను పరిశీలించిన జూపల్లి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 15 : కుతుబ్ షాహీ టూంబ్స్ లోని ఇంటర్ప్రిటేషన్ సెంటర్ లో జరుగుతున్న పనులను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలించారు. సెవెన్ టూంబ్స్ కటోరా హౌస్, కేబీ మ్యూజియంను ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వక్ఫ్ ట్రిబ్యునల్ లో కేసు పెండింగ్ గురించి చర్చించారు. కేసు పూర్వాపరాలను గురించి వివరించారు. ట్రిబ్యునల్ పరిధిలో పెండింగ్ లో ఉన్న పనులను మినహాయించి, మిగిలిన పనులను వారంలోగా ప్రారంభించి, వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కుతుబ్ షాహి టూంబ్స్ నుంచి గోల్కొండ కోట వరకు 1.3 కిలోమీటర్ల రోప్ వే నిర్మాణానికి

11లో

# మహిళా బిల్లుకు ఓకే



### - డీలిమిటేషన్ బిల్లుకు నో
### - వ్యతిరేకంగా ఓటేస్తామన్న ఖర్గే

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 : పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్ల బిల్లు, డీలిమిటేషన్ బిల్లుపై కాంగ్రెస్ సంచలన నిర్ణయం తీసుకుంది. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు తెలిపిన కాంగ్రెస్.. డీలిమిటేషన్ బిల్లును మాత్రం వ్యతిరేకిస్తామని ప్రకటించింది. కాగా, దేశవ్యాప్తంగా నియోజక వర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులకు రంగం సిద్ధమైంది. ఈ రెండు బిల్లులను ఏప్రిల్ 16 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం రెడీ అయింది. ఈ క్రమంలో పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలు, బిల్లులకు మద్దతు ఇవ్వాలా వద్దా అనే అంశంపై చర్చించేందుకు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి బుధవారంఢిల్లీలోని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే నివాసంలో భేటీ అయ్యింది. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో కూటమి నేతలు వివిధ అంశాలపై చర్చించారు. ఈ భేటీ అనంతరం ఖర్గే మీడియాతో మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ మద్దతు ఇస్తుందని తెలిపారు. మహిళా రిజర్వేషన్లపై అనాడైనా ఇనాడైనా కాంగ్రెస్‌ది ఒకటే స్టాండ్ అని పేర్కొన్నారు. డీలిమిటేషన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం చేస్తోన్న ట్రిక్కులకు వ్యతిరేకమని.. మహిళా రిజర్వేషన్లు అంటూ దొంగ దారిలో డీలిమిటేషన్ అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. డీలిమిటేషన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని.. పార్లమెంట్‌లో ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేస్తామని కాంగ్రెస్ పార్టీ వైఖరిని తెలియజేశారు. డీలిమిటేషన్‌పై ఇండియా కూటమి పార్టీలు ఏకతాటిపై ఉన్నాయని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసమే హడావుడిగా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లులను ప్రవేశ పెడుతోందని

11లో

# పరిగిలో ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో భూసేకరణ

### - ఆందోళనకు దిగిన జాగృతి అధ్యక్షురాలు కవిత





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వికారాబాద్, ఏప్రిల్ 15 : వికారాబాద్‌లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అరెస్టు చేశారు. పరిగిలో ఇండస్ట్రియల్ కారిడార్ కోసం రైతుల భూములను బలవంతంగా సేకరిస్తున్నారని ఆరోపిస్తూ ఉదయం నుంచి కవిత ఆందోళన చేశారు. ఈ క్రమంలోనే రైతులతో కలిసి వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ప్రభుత్వం పారిశ్రామికీకరణ ముసుగులో రైతుల పొట్ట కొడుతోందని ఆమె ఆరోపించారు. భూసేకరణ ఆపకపోతే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామన్నారు. తక్షణమే భూసేకరణ నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్

11లో

### రాహుల్ కేరళ నుంచి
# ఎందుకు పోటీ చేశారు

### - యూపి నుంచి రాజ్యసభ దక్కడం గౌరవమే
### - డబ్బుల మూటలతో రేవంత్ రాజకీయం
### - మహిళా రిజర్వేషన్లపై విమర్శలు తగవు
### - రేవంత్ వ్యాఖ్యలపై బిజెపి ఎంపి లక్ష్మణ్ ఆగ్రహం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ,ఏప్రిల్15 : తెలంగాణ రాష్ట్ర హక్కుల కోసం తన గొంతు వినిపిస్తున్నానని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ తెలిపారు. తెలంగాణ కోసం సీఎం రేవంత్ రెడ్డి ఏమైనా చేశారా? అని ఆయన ప్రశ్నించారు. తుపాకీ పట్టుకొని ఆయన ఎవరి పక్కన నిలుచున్నారో అందరికీ తెలుసునన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ కేరళ నుంచి ఎందుకు పోటీ చేశారంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నిలదీశారు. ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎన్నిక కావ్వడం తెలుగు వాడిగా తనకు గౌరవంగా ఉందన్నారు. తనపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో బుధవారం న్యూఢిల్లీలో ఎంపీ కె. లక్ష్మణ్ స్పందించారు. నీతులు చెబుతున్నా రంటూ సీఎం రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. మహిళల అవకాశాలను దెబ్బ తీయడానికి కుట్ర పన్నుతున్నారంటూ

11లో

# పునర్విభజన జనాభా ప్రకారమే

### - రాజ్యాంగం నిర్దేశించింది కూడా ఇదే
### - సిఎం రేవంత్ గందరగోళ వ్యాఖ్యలు తగవు
### - బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వరంగల్, ఏప్రిల్ 15: నియోజకవర్గాల పునర్విభజన అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కావాలనే అసత్య ప్రచారానికి తెరలేపారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు విమర్శించారు. బుధవారం వరంగల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. నియోజకవర్గాల పునర్విభజన అనేది రాజ్యాంగబద్ధమైన పక్రియ అని రాంచందర్‌రావు

11లో

# మహిళాబిల్లు, పునర్విభజన చట్టం

### - రెంటికీ లింకుపై విపక్షాల ఆందోళన
### - పార్లమెంట్‌లో జరిగే చర్చతో తేలనున్న విషయం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 : చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించ దానికి, నియోజకవర్గాల పునర్విభజనకు లింకు పెట్టడం ఎందుకని ప్రభుత్వాన్ని విపక్ష రాజకీయ పార్టీలు నిలదీస్తున్నాయి. ఇందులో కుట్ర కోణం దాగివుందని అంటున్నాయి. నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో ఇప్పటికే దీనిపై అనేక కోణాల్లో విమర్శలు వస్తున్నాయి. దక్షిణాదికి అన్యాయం జరగబోతోం దని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, తమిళనాడు సిఎం స్టాలిన్ తదితరులు ఆరోపిస్తున్నారు. ఈ రెంటిని కలపడంపైనా మండిపడు తున్నారు. అలాగే

11లో

### డీలిమిటేషన్ కేవలం
# రాజకీయ సవరణగా మిగలొద్దు

### - దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గితే ప్రజా ఉద్యమం తప్పదు
### - బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటిఆర్ హెచ్చరిక



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 15 : నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కేంద్ర ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక జారీ చేశారు. దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గేలా డీలిమిటేషన్ జరిగితే అది కేవలం ఒక రాజకీయ పక్రియగానో లేక చట్ట సవరణ గానో మిగిలిపోదని అన్నారు. మొత్తం దక్షిణ భారతదేశం అంతటా ఒక బలమైన ప్రజా ఉద్యమానికి దారితీస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని తేల్చి చెప్పారు. మూడేళ్ల క్రితం తాము తీసుకున్న దృఢమైన నిర్ణయానికే కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటిం చారు. తామంతా గర్వించదగ్గ భారతీయులమని, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న అత్యుత్తమ రాష్ట్రాల ప్రతినిధులమని కేటీఆర్ పేర్కొన్నారు. జనాభా నియంత్రణతో పాటు వివిధ రంగాల్లో అద్భుత ప్రగతి సాధిస్తున్న దక్షిణ రాష్ట్రాలకు,

11లో

### సిఎం రేవంత్ తీరుపై
# బిజెపి మండిపాటు

### - అనుమానాలతో గందరగోళం సృషించవద్దు
### - రేవంత్ ప్రధానికి లేఖ రాయడంపై పార్టీ నేతల విమర్శలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 15 : మహిళా రిజర్వేషన్లు, నియోజక వర్గాల పునర్విభజనపై సిఎం రేవంత్ రెడ్డి అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ రెంటినీ కలప డాన్ని కుట్ర కోణంగా అభిప్రాయ పడ్డారు. దీనిపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధానికి లేఖ రాశారు. అయితే రేవంత్ అభిప్రాయాలను బిజెపి నేతలు తోసిపుచ్చారు. పార్లమెంట్ అత్యున్నత వేదిక అని, అక్కడే జరగబోతోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. రేవంత్‌కు అవగాహన లేదని బండి సంజయ్ కూడా వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీకి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రాసిన లేఖపై భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు కూడా స్పందించారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. భయాన్ని వ్యాప్తి చేయడం

11లో

స్కాలర్స్
జూనియర్ కళాశాల
NEET / JEE ACADEMY
నందిహిల్స్ & నాగవరం, వనపర్తి జిల్లా
Cell: 9949251256, 9491484296

IPE. March - 2026 ఇంటర్ ఫలితాలలో రాష్ట్ర స్థాయి మార్కులతో విజయ పరంపర కొనసాగించిన స్కాలర్స్

ALWAYS No.1

BiPC-II 993 /1000 B. MAHALAXMI
MPC-II 992 /1000 K. NARMADA
BiPC-I 437 /440 D. PALLAVI / NIMRAH AFSHEEN
MPC-I 463 /470 A. BUNNY

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| BiPC | 993 B. MAHALAXMI | 992 ALISHA SHAJI | 991 SUSMITHA | 990 BANDHAVI | | |
| MPC | 992 K. NARMADA | 991 K. SHIRISHA | | | | |
| BiPC | 437 D. PALLAVI | 437 NIMRAH AFSHEEN | 436 B. AKSHAYA LAXMI | 434 BHAVYASRI | 434 K. YAMINI | 434 SATHWIKA |
| | 434 K. RAJESH | 432 R. INDU | 432 AKHILANDESHWARI | 432 GEYASRI | 432 AKHILA | 431 YUSRA FATHIMA |
| MPC | 463 A. BUNNY | 462 G. HARSHITHA | 462 SRI VARSHINI | 460 DIVYA SRI | | |
| CEC | 406 MUSKAN | | | | | |

990 పైగా మార్కులు సాధించిన మా విద్యార్థులు 6 900 పైగా మార్కులు సాధించిన మా విద్యార్థులు 98 400 పైగా మార్కులు సాధించిన మా విద్యార్థులు 96

హైదరాబాద్ కార్పోరేట్ కళాశాలలో సుదీర్ఘ అనుభవం పొందిన అధ్యాపకులచే NEET / JEE LONG TERM కోచింగ్ నిర్వహించబడును మరియు Regular Inter + NEET, Regular Inter + JEE Regular Inter + EAPCET కోచింగ్ ఇవ్వబడును.







# రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యం

**- రైతులు సీడ్స్ కార్పొరేషన్ విత్తనాలనే వాడాలి - విత్తన నాణ్యతే ప్రామాణికంగా తీసుకోవాలి**
**- ప్రకటనలు చూసి మోసపోవద్దు - విత్తనాల కొనుగోలులో రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలి**
**- తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి - గ్రామాల్లో ప్రభుత్వ విత్తనాల విక్రయానికి ప్రత్యేక కృషి చేస్తాం - స్వశక్తి సంఘాల మహిళలు, వ్యవసాయ అధికారులు కలిసి విక్రయించేలా ప్రణాళిక**
**- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, ఏప్రిల్ 15 : జిల్లాలో రాబోయే వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు విత్తన కొరత లేకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని, దీంతోపాటు నాణ్యమైన విత్తనాలను తమ సంస్థ ద్వారా అందిస్తామని తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి పేర్కొన్నారు. వానా కాలం సీజన్లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించే అంశంపై బుధవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో విత్తన డీలర్లు, సహకార సంఘాల సీఈఓలు, ఎఫ్‌పీఓలు, ఏఆర్ఎస్కే ప్రతినిధులతో చైర్మన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తో పాటు పలువురు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ అన్వేష్ రెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో విత్తన సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. సీడ్స్ కార్పొరేషన్ కరీంనగర్ యూనిట్ రంగపేట నుంచి నాణ్యమైన విత్తనాలను ఉమ్మడి జిల్లా రైతులకు సరఫరా చేస్తామని తెలిపారు. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ పనితీరును చైర్మన్ అన్వేష్ రెడ్డి వివరించారు. మన రైతులు పండించిన విత్తనాలనే సేకరించి, వాటిని అధునాతన ల్యాబ్‌లలో పరీక్షించి, నాణ్యత నిర్ధారణ అయిన తర్వాతే తిరిగి రైతులకు సాగు కోసం అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రైవేట్ కంపెనీలకు దీటుగా ప్రభుత్వ విత్తనాల నాణ్యత ఉంటుందని అన్వేష్ రెడ్డి భరోసా ఇచ్చారు. రైతుల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా సంస్థ పనిచేస్తుందన్నారు. ప్రస్తుత సీజన్‌కు అవసరమైన వరి విత్తనాలు సమృద్ధిగా ఉన్నాయని వెల్లడించారు. ప్రస్తుతం మార్కెట్లో డిమాండ్ ఉన్న సన్న రకాల్లో ప్రధానంగా బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, కెఎన్ఎం 1638, జేజిఎల్ 27356 రకాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. దొడ్డు రకాల విషయానికి వస్తే కెఎన్ఎం 118, ఎమ్‌టియు 1010 రకాలను నిల్వ ఉంచినట్లు తెలిపారు. వీటితో పాటు భూసారాన్ని పెంచే పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, పిల్లిపెసర రైతులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. డీలర్లు ఎట్టి పరిస్థితులోనూ సంస్థ విత్తనాలు అమ్మాల్సిందేనని

సూచించారు. కేవలం రాయితీపై ఇచ్చే విత్తనాల విక్రయానికే పరిమితం కాకుండా, ప్రభుత్వం సేకరించిన అన్ని రకాల విత్తనాలను విక్రయించాలని ఆదేశించారు. లైసెన్స్ ఉన్న ప్రతి డీలర్ తప్పనిసరిగా ప్రభుత్వ విత్తనాభివృద్ధి సంస్థ విత్తనాలను తమ తమ దుకాణాల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వాటిపై విస్తృతంగా అవగాహన కల్పిస్తూ రైతులకు విక్రయించాలని సూచించారు. జిల్లాలో వరి సాగు విస్తీర్ణం సుమారు 2.8 లక్షల ఎకరాలుగా వ్యవసాయ అధికారులు అంచనా వేశారని తెలిపారు. సుమారు 60వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతాయని పేర్కొన్నారు. కనీసం 25 వేల క్వింటాళ్ల నాణ్యమైన విత్తనాలను సంస్థ ద్వారా సరఫరా చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. గ్రామాల్లో మహిళా సంఘాలు ప్రభుత్వ విత్తనాలను విక్రయించేందుకు పెద్ద ఎత్తున సహకరించాలని కోరారు. రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా రక్షణ కల్పించడంతో పాటు, నిజాయితీగా వ్యాపారం చేసే డీలర్ల హక్కులను నూతన విత్తన చట్టం కాపాడుతుందని ఆయన పేర్కొన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి అటు రైతులు సంస్థ అభివృద్ధికి దోహదపడాలని కోరారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ గ్రామ గ్రామానా ప్రభుత్వ విత్తనాలను రైతులు పెద్ద ఎత్తున కొనుగోలు చేసేలా ప్రత్యేక ప్రణాళిక రచిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం స్వశక్తి మహిళా సంఘాలు, వ్యవసాయ అధికారులు, పంచాయతీ కార్యదర్శుల సహకారంతో ముందుకు వెళ్తామన్నారు. ప్రభుత్వ విత్తనాల విక్రయంపై గ్రామ గ్రామానా విస్తృతంగా మార్కెటింగ్ నిర్వహించి పెద్ద ఎత్తున కొనుగోలు చేసేలా రైతులను అప్రమత్తం చేస్తామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ విత్తనాలను రైతులు కొనుగోలు చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు. త్వరలో జిల్లా స్థాయిలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి ప్రభుత్వ విత్తనాల విక్రయంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. రైతులు విత్తనాల కొనుగోలు సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మోసపూరిత ప్రకటనల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. ఇంకా ఈ సమావేశంలో ఆర్డిఓ కే.మహేశ్వర్, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీధర్, సహకార అధికారి, సీడ్ కార్పొరేషన్ మేనేజర్ రాజీవ్ కుమార్, కరీంనగర్ ప్రాంతీయ మేనేజర్ విష్ణు వర్ధన్ రెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సబిత, ఏడీఏలు, మండల వ్యవసాయ అధికారులు, విత్తన అధికారులు శ్రీకాంత్, మౌనిక, డీలర్లు, ఎఫ్‌పీఓ మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క - పులిగుండాల ఎకో టూరిజం ప్రాజెక్ట్ ను ప్రారంభించిన మంత్రులు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, ఏప్రిల్ 15 : పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలోని పెనుబల్లి మండలం బ్రాహ్మళ్లకుంట పరిధిలోని పులిగుండాల ఎకో టూరిజం ప్రాజెక్ట్‌ను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బుధవారం సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జంగిల్ సఫారీ, బోటింగ్ వంటి పర్యాటక ఆకర్షణలను ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. తదనంతరం కనకగిరి గుట్టల్లోని అద్భుతమైన ప్రకృతి సోయగాలను వీక్షించిన మంత్రులు, ఈ ప్రాంతాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వ లక్ష్యాన్ని వెల్లడించారు. తెలంగాణలోని అపూర్వమైన ప్రకృతి సంపదను ప్రపంచానికి పరిచయం చేయడం లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, పులిగుండాల ప్రాంతాన్ని అన్ని సదుపాయాలతో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే అగ్రగామి పర్యాటక కేంద్రాలలో ఒకటిగా తీర్చిదిద్దుతామని తెలిపారు. పర్యాటకుల రాకపోకలకు అనుకూలంగా రహదారులను డబుల్ రోడ్డులుగా విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని, మిగిలిన అభివృద్ధి పనులకు అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుందని స్పష్టం చేశారు. కనకగిరి హిల్స్ అభివృద్ధికి తక్షణమే కార్యాచరణ ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ప్రతిష్టాత్మక సీతా రామ ప్రాజెక్ట్ ద్వారా పులిగుండాల ప్రాంతానికి నీటిని మళ్లించే అవకాశాలను



పరిశీలిస్తామని తెలిపారు. దీంతో వేసవిలో కూడా ఈ ప్రాంతం సస్యశ్యామలంగా ఉండి పర్యాటకులను ఆకర్షిస్తుందని పేర్కొన్నారు. పర్యాటక రంగ అభివృద్ధితో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుందని మంత్రులు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మట్టా రాగమయి దయానంద్, రాందాస్ నాయక్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై అవగాహన-ట్రాఫిక్ నియమాల పాటనతోనే ప్రమాదాల నివారణ



**- అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు - అశ్వారావుపేటలో "అరైవ్ ఎలైవ్" కార్యక్రమం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 15 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు బుధవారం నిర్వహించిన "అరైవ్ ఎలైవ్" కార్యక్రమం ఘనంగా జరిగింది. ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తేనే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని ప్రజాప్రతినిధులు, పోలీసులు పిలుపునిచ్చారు. జిల్లాలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో అశ్వారావుపేట పట్టణంలోని శ్రీశ్రీ ఫంక్షన్ హాల్‌లో "అరైవ్ ఎలైవ్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో పాటు మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, అధికారులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్నందున ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రాణాంతకమని హెచ్చరిస్తూ, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని అన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ఉపయోగించాలని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ, "అరైవ్ ఎలైవ్" కార్యక్రమం ద్వారా ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా యువత ట్రాఫిక్ నియమాలను పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. చిన్న నిర్లక్ష్యాలే పెద్ద ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించి, ప్రతి ఒక్కరూ బాధ్యతతో డ్రైవింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా కళాకారులచే రోడ్డు భద్రతపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు వక్తృత్వ పోటీలు నిర్వహించగా, ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఎస్పీ రోహిత్ రాజు, మున్సిపల్ చైర్మన్ జూపల్లి శశికళ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేసి, వాటి ప్రాముఖ్యతను వివరించారు. అధికారులు, ప్రజలు కలిసి రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జూపల్లి శశికళ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, సీఐ నాగరాజు రెడ్డి, ఎస్సై యాయాతి రాజు, అదనపు ఎస్సై అఖిల, ఎంపీడీవో అప్పారావు, మున్సిపల్ సభ్యులు, సర్పంచులు, అంగన్వాడీ కార్యకర్తలు, వీవోఏ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెంలో ఉద్యమ్ రిజిస్ట్రేషన్ శిక్షణ కార్యక్రమం విజయవంతం

**- గ్రామీణ వ్యాపారులకు కొత్త అవకాశాలు**
**- హాజరైన జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎం.విద్యాచందన**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 15 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమం బుధవారం విజయవంతంగా జరిగింది. డీఆర్డీఏ-సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎం.విద్యాచందన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యాచందన మాట్లాడుతూ, ప్రతి మండలంలో వీఓఏలు, గ్రామ సంఘాల పాలకవర్గ సభ్యులకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై సమగ్ర అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈమేరకు ఈ నెల 16, 17 తేదీల్లో మండల స్థాయిలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలైన పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ వంటి పథకాల కింద వ్యాపారులకు సబ్సిడీ ఆధారిత ఆర్థిక సహాయం పొందే అవకాశం ఉంటుందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నతరహా వ్యాపారాలు, స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు ఈ రిజిస్ట్రేషన్ ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. మండల స్థాయిలో ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేసి, గ్రామీణ వ్యాపారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులు నిర్ణయించారు. ఈ ప్రక్రియ ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని,యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయడానికి ఇది దోహదం చేస్తుందని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఏడీఆర్డీఓ-సెర్ప్ బి.నీలేష్, జీఎం డీఐసీ మధుసూదన్ రెడ్డి, ఈడీసీ మేనేజర్ వసంత, డీపీఎంలు, జిల్లా సమాఖ్య అధ్యక్షులు, ఏపీఎంలు, సీసీలు, మండల అకౌంటెంట్లు, నాన్-ఫార్మ్ సీఆర్పీలు పాల్గొన్నారు.



# ఆరోగ్యం, విద్యుత్ రంగాల అభివృద్ధికి ప్రాధాన్యం

**- రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**
**- డిప్యూటీ సీఎం భట్టితో కలిసి కల్లూరు మండలంలో పర్యటన**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఏప్రిల్ 15 : రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని,అందులో భాగంగానే విద్యుత్, ఆరోగ్య రంగాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని తెలంగాణ రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. బుధవారం కల్లూరు మండలంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ఆయన పర్యటించారు. కల్లూరులో రూ.10.50 కోట్లతో నిర్మించిన 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించడంతో పాటు, నారాయణపురంలో రూ.2.75 కోట్లతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజలకు సమీపంలోనే మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఈ ఆసుపత్రి కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అలాగే కొత్తగా నిర్మించనున్న విద్యుత్ ఉపకేంద్రం ద్వారా పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తోందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, ఎన్.పి.డి.సి.ఎల్ సీఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసాచారి, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# అక్రిడిటేషన్ కమిటీలో అనర్హుల తొలగించాలి

**- టీడబ్ల్యూజేఎఫ్ వనపర్తి జిల్లా కమిటీ డిమాండ్**
**- జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, ఏప్రిల్ 15 : వనపర్తి జిల్లా అక్రిడిటేషన్ కమిటీలో అనర్హులను చేర్చిన అంశంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ బుధవారం టి.డబ్ల్యూ.జే.ఎఫ్ వనపర్తి జిల్లా కమిటీ తరపున జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా కొంతమంది అనర్హులను కమిటీలో చేర్చినట్లు వారు పేర్కొన్నారు. ఒక వైపు న్యాయవాద వృత్తి లోకొనసాగుతూ మరో వైపు జర్నలిస్టులుగా వ్యవహరిస్తున్న వ్యక్తులకు కమిటీలో స్థానం కల్పించడం తగదని వారు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అలాగే ప్రభుత్వ దూరదర్శిని సంస్థలో వేతనం పొందుతూ పనిచేస్తున్న వ్యక్తులను కూడా సభ్యులుగా చేర్చడం న్యాయసమ్మతం కాదని వారు అభిప్రాయపడ్డారు. ఇంకా కొంతమంది జర్నలిస్టు సంఘ నాయకులు తమ అనుచరులకు ప్రాధాన్యత కల్పించేందుకు రాజకీయ ఒత్తిడులు తెస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని, జర్నలిజం గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొన్నారు. గతంలో జర్నలిస్టుల ప్లాట్ల విషయంలో జరిగిన అవకతవకలను కూడా గుర్తుచేస్తూ, అర్హులైన వారికి న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు అంబటి స్వామి, కార్యదర్శి గంగవరం రామకృష్ణారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నిరంజన్ పాషా ఎర్రమన్ను బాలరాజ్ సిటిజన్ రవి, పట్టణ అధ్యక్షులు కడమంచి శేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు బంకల రవి, బాలరాజ్, విష్ణు సాగర్, బాలరాజు, సాయిరాం, జిల్లా బృందం పాల్గొని వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు.




# కరీంనగర్ రోల్ మోడల్ గా నిలవాలి

**- ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక సమావేశాలు పకడ్బందీగా నిర్వహించాలి**
**- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలి**
**- కలెక్టర్ చిత్రా మిశ్రా**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, ఏప్రిల్ 15 : జిల్లాలో నిర్వహించనున్న ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక సమావేశాలను అత్యంత పకడ్బందీగా, ప్రజా పాలన ప్రతిబింబించేలా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. ఈ సమావేశాలు చారిత్రాత్మకంగా నిలిచేలా సమర్థవంతంగా నిర్వహించాలని ఆమె సూచించారు. గురువారం మండల స్థాయిలో జరిగే సమావేశాల నేపథ్యంలో బుధవారం సాయంత్రం జిల్లా స్థాయి అధికారులతో పాటు ఎంపీడీవోలు, ఎంఈఓలు, ఎంపీవోలతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల స్థాయి సమావేశాలను విజయవంతం చేయడానికి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల వారీగా లబ్ధిదారుల వివరాలను వెల్లడించాలని సూచించారు. రైతు భరోసా, రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, మహిళలకు రుణాలు, కార్పొరేషన్ల ద్వారా అందించిన రుణాలు, మహాలక్ష్మి పథకం, సన్నబియ్యం పంపిణీ వంటి అంశాలపై ప్రత్యేకంగా వివరించాలన్నారు. మండలాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. విద్య, వైద్యం, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమం, రైతు సంక్షేమం వంటి రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, అందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని తెలిపారు. రోడ్డు భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'అరైవ్-అలైవ్' కార్యక్రమంలో ప్రజలను భాగస్వాములు చేయాలని, ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించాలని సూచించారు. జిల్లాను రాష్ట్రంలో ఆదర్శంగా నిలబెట్టే విధంగా సమావేశాలను నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీపీఓ జగదీశ్వర్, ఇన్‌చార్జి సీపీఓ రామ్ దత్తారెడ్డి, డీఎంహెచ్వో వెంకటరమణ, జెడ్పీ సీఈఓ శ్రీనివాస్, డీఎస్ఓ నర్సింగరావు, డీఆర్డీఓ శ్రీధర్, సంక్షేమ అధికారి సరస్వతి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్ తదితర అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# రోడ్డు, గనుల ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

**- గోల్డెన్ అవర్‌లో చికిత్స అందిస్తే ప్రాణాలను కాపాడే అవకాశం**

**- కరీంనగర్ మెడికవర్ వైద్యుల వెల్లడి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 15 : రోడ్డు ప్రమాదాలు, బొగ్గుగనుల్లో జరిగే ప్రమాదాల పట్ల ప్రజలు, కార్మికులు అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ మెడికవర్ వైద్యులు సూచించారు. ప్రమాదం జరిగిన తర్వాత మొదటి గంటను 'గోల్డెన్ అవర్'గా పరిగణిస్తారని, ఈ సమయంలో సరైన వైద్య సదుపాయాలు ఉన్న ఆసుపత్రికి రోగిని తరలిస్తే ప్రాణాలను కాపాడే అవకాశం పదింతలు పెరుగుతుందని తెలిపారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో న్యూరోసర్జన్ డాక్టర్ రాజీవ్ రెడ్డి, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రాకేశ్, ఎమర్జెన్సీ మెడిసిన్ డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ సింగరేణి ప్రాంతంలో జరుగుతున్న గని ప్రమాదాలలో వేగవంతమైన వైద్య చికిత్స అత్యంత కీలకమని పేర్కొన్నారు. తలకు తగిలే గాయాలు మృతికి ప్రధాన కారణమవుతున్నాయని, ప్రయాణంలో హెల్మెట్ ధరించకపోవడంవల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే సిటీ స్కాన్ వంటి పరీక్షలు చేయగలిగితే అంతర్గత గాయాలను త్వరగా గుర్తించి చికిత్స అందించవచ్చని చెప్పారు. ట్రామా కేర్ విషయంలో తాము అగ్రస్థానంలో ఉన్నామని తెలిపారు. ప్రమాదంలో శరీరంలోని అనేక అవయవాలు దెబ్బతినే పాలీట్రామా కేసుల్లో న్యూరోసర్జన్, ఆర్థోపెడిక్ సర్జన్, ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యులు కలిసి సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుందని వివరించారు. అన్ని రకాల నిపుణులు అందుబాటులో ఉండే ఆసుపత్రిలోనే ఇలాంటి క్లిష్ట కేసులకు సమర్థవంతమైన చికిత్స సాధ్యమవుతుందని చెప్పారు. ఇంటి వద్ద జరిగే సాధారణ గాయాల విషయంలో కూడా నిర్లక్ష్యం చేయకూడదని, వీలైనంత త్వరగా వైద్య చికిత్స పొందాలని సూచించారు. ప్రతి గాయం చిన్నదే అనుకుని వదిలేస్తే అది పెద్ద సమస్యగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రమాద ఘటనల్లో రోగి స్పృహలో లేని పరిస్థితుల్లో న్యూరోసర్జన్‌తో పాటు ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యుల పాత్ర కీలకమని, రోగిని సమగ్రంగా చూసుకోవడంలో ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ మీడియా సమావేశంలో మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, బొంగోని హరీష్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ సభకు భారీ జన సమీకరణ చేయాలి



**సన్నాహక సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, ఏప్రిల్ 15 : ఈనెల 20వ తేదీన జగిత్యాలలో జరగబోయే కెసిఆర్ సభకు భారీ జన సమీకరణ చేయాలని బిఆర్ఎస్ జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. బిఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో జగిత్యాల జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ దావా వసంత సురేష్, మాజీ మార్క్ ఫెడ్ చైర్మన్ లోక బాబు రెడ్డిలు కెసిఆర్ బహిరంగ సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కేసీఆర్ సభను ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజల్లో మరింత నమ్మకం పెంపొందించే వేదికగా మార్చాలని తెలిపారు. ఈ సభలో మాజీ మంత్రి జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, వాటి ప్రయోజనాలను గ్రామస్థాయిలోకి తీసుకెళ్లాలని సూచించారు. అలాగే, ప్రతి గ్రామంలో సమావేశాలు నిర్వహిస్తూ విస్తృత ప్రచారం చేయాలని, యువతను పెద్ద ఎత్తున సభకు తీసుకురావాలని నాయకులు కోరారు. సభ విజయవంతం కోసం మండల, గ్రామ స్థాయి నాయకులు సమన్వయంతో పని చేయాలని, ప్రతి ఒక్కరు తమ బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలని తెలిపారు. కార్యకర్తలంతా ఐక్యతతో కృషి చేసి సభను ఘన విజయంగా నిలపాలని, కార్యక్రమం నిర్వహణలో క్రమశిక్షణ పాటిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని నాయకులు సూచించారు. సభను చారిత్రాత్మక విజయంగా నిలిపి పార్టీకి మరింత బలం చేకూర్చాలని ఆకాంక్షించారు.

# రైజింగ్ రామగుండం కోసం మేము సైతం అంటు ఖని నగర పౌరులు కదలి రావాలి

**రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్**







(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటీ (గోదావరిఖని), ఏప్రిల్ 15 : రైజింగ్ రామగుండంగా పేరు తీసుకువచ్చేందుకు మేము సైతం అంటూ ప్రతి ఒక పౌరుడు కదలి రావాలని రామగుండం శాసన సభ్యులు ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగశీగా 9వ డివిజన్‌లో రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామితో కలిసి బుధవారం వార్డు సందర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం నగరాన్ని ఒక స్వచ్ఛమైన అద్భుత నగరంగా తీర్చిదిద్దడం పౌరుల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని అన్నారు.నగరంలోని నాలాల పూడిక తీత ఒక దశాబ్ద కాలంగా చేపట్టడం జరగలేదని అన్నారు. ప్రస్తుతం రామగుండం నగర పాలక సంస్థకు సమర్థత ,అనుభవం కలిగిన పాలక వర్గం ఏర్పడిన క్రమంలో శానిటేషన్ తో పాటు అన్ని సమస్యలు తీరిపోతాయని అన్నారు. వర్షాకాలంలో వరద ముప్పు తో పాటు దుర్గంధం నుండి ప్రజలు పడుతున్న ఇబ్బందులు నివారించడానికి పూర్తి స్థాయిలో కాంక్రీట్ కాలువ నిర్మాణం త్వరలో చేపడతామని అన్నారు. ఊరంటే రామగుండంలా ఉండాలి అనే విధంగా ఈ నగరాన్ని రూపుదిద్దుకుందామని అన్నారు. రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ కాలువ లో చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలని కోరారు. మునిసిపల్ సిబ్బందికి చెత్త ఇవ్వాలని అన్నారు. వర్షాకాలం లోపు నగరంలోని అన్ని నాళాల్లో పూడిక తొలగించే కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నామని అన్నారు.ఇళ్లతో పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వినోభానగర్, రెల్లివాడలో ప్రవహిస్తున్న మురుగు నీటి కాలువలో యంత్రాలు, సిబ్బంది సహాయంతో పూడిక తొలగించి సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు. ఎంఎల్ఎ, మేయర్ అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తూ దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. ప్రెస్ క్లబ్ నుండి ప్రారంభించి గల్లీ గల్లీలో తిరుగుతూ మునిసిపల్ సిబ్బందికి సూచనలు ఇస్తూ పిచ్చి చెట్లు, కొమ్మలు, పొదలు తొలగించేలా చర్యలు తీసుకున్నారు. డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, స్థానిక కార్పొరేటర్ తిప్పారపు శ్రీనివాస్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ డిప్యూటీ కమీషనర్ నాయిని వెంకట స్వామి, ఇఇ పివి రామన్, టిపిఎస్ నవీన్, ఎఇ జమీల్, సానిటరీ ఇన్స్పెక్టర్ రంగు నాగ భూషణం, సూపర్ వైజర్ రవి కుమార్, ఎలక్ట్రికల్ ఎఇ రాంజీ, వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# వేసవిలో జాగ్రత్తలపై కార్మికులకు అవగాహన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, ఏప్రిల్ 15 : సింగరేణి ఆర్జీ-1 ఏరియా ఓసి-5 ప్రాంగణంలో వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. జీఎం లలిత్ కుమార్ సూచన మేరకు ఏరియా హాస్పిటల్ నుండి డాక్టర్ కారమ్ పద్మ హాజరై తీవ్రమైన ఎండల దృష్ట్యా గని కార్మికులు ఆరోగ్య విషయంలో పాటించాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. వేసవిలో శరీర ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల వచ్చే వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పని సమయంలో తగినంత నీరు తాగడం, ఎలక్ట్రోలైట్స్ తీసుకోవడం, ఆహార నియమాలను పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎస్ఓఎం అనిల్ గబాలే, సేఫ్టీ ఆఫీసర్ పొనుగోటి శ్రీనివాస్, పిట్ సెక్రటరీ గుర్రం ప్రభుదాస్, సీఎంఓఏఐ ఏరియా వైస్ ప్రెసిడెంట్ పెరుమాళ్ల శ్రీనివాస్, ఆఫ్ లోడింగ్ ఇంచార్జ్ గంధం రాములు, కార్మిక సంఘాల ప్రతినిధులు, అధికారులతో పాటు సూపర్‌వైజర్లు, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై అవగాహనతోనే ప్రమాదాల నివారణ

**- విద్యార్థులు మార్గదర్శకులుగా నిలవాలి**

**- "అరైవ్-అలైవ్" ర్యాలీ ప్రారంభోత్సవంలో జిల్లా కలెక్టర్ అంకిత్**




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 15 : ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న "అరైవ్-అలైవ్" కార్యక్రమంలో భాగంగా భద్రాద్రి జిల్లా కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాత కొత్తగూడెం హనుమాన్ బస్తీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ప్రారంభించారు. "రహదారుల భద్రత మన అందరి బాధ్యత" అనే నినాదంతో నిర్వహించిన ఈ ర్యాలీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో కలిసి రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రజల్లో, ముఖ్యంగా విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమన్నారు. చిన్న వయస్సులోనే ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెరిగితే భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతారని తెలిపారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, కార్లలో ప్రయాణించే సమయంలో సీట్ బెల్ట్ ధరించడం తప్పనిసరిగా పాటించాలని విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు తెలియజేయాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రా క్రాసింగ్ వినియోగం వంటి నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. పాఠశాలల్లో రోడ్డు భద్రతపై పోస్టర్లు ఏర్పాటు చేయడం, ప్రత్యేక అవగాహనా తరగతులు నిర్వహించడం వంటి చర్యలను చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో ర్యాలీలు, అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో చైతన్యం పెంచాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల వల్ల అనేక కుటుంబాలు నష్టపోతున్నాయని, వాటి నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. "అరైవ్--అలైవ్" కార్యక్రమం ద్వారా రహదారి భద్రతపై విస్తృత అవగాహన కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మధురవాణి, ప్రధానోపాధ్యాయులు లక్ష్మి, విద్యాశాఖ జిల్లా కోఆర్డినేటర్ నాగరాజశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పెద్దపల్లిలో భారీ ఉద్యోగ మేళా

**వివరాలు వెల్లడించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పెద్దపల్లి, ఏప్రిల్ 15 : నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ నెల 17న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ప్రత్యేక జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టాస్క్ రీజినల్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించబడే ఈ డ్రైవ్‌లో ప్రముఖ కంపెనీలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయని,? ఈ నెల 17న శుక్రవారం ఉదయం 10గంటల నుంచి పెద్దపల్లి బస్టాండ్ సమీపంలో గల టాస్క్ సెంటర్‌లో డిప్లొమా, ఐటీఐ, ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులు ఉద్యోగాలకు అర్హులని, ఈ డ్రైవ్‌లో ఏజే సొల్యూషన్, వార్కస్ ఈవీ మోటార్స్, మెగా ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల ప్రతినిధులు పాల్గొని, ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారని కలెక్టర్ తెలిపారు. ?ఆసక్తి గల అభ్యర్థులు తమ వెంట రెండు సెట్ల లేటెస్ట్ రెజ్యూమ్ తో తప్పనిసరిగా ఫార్మల్ డ్రస్‌లో ఇంటర్వ్యూకు హాజరు కావాలని, నిర్ణీత సమయం కంటే ముందుగానే వేదికకు చేరుకోవాలని, జిల్లాలోని అర్హత కలిగిన యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తమ కంపెనీలలో ఉద్యోగాలు పొందాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం పెద్దపల్లిలోని టాస్క్ రీజినల్ సెంటర్‌లో సంప్రదించాలని జిల్లా కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

# గడువు లోగా పనులు పూర్తి చేయాలి

**- జూన్ నాటికి తహసీల్దార్ కార్యాలయాలు సిద్ధం చేయాలి**

**- మే 15లోగా అంగన్వాడీ మరమ్మత్తులు పూర్తి**

**- విద్యా సంవత్సరం ముందే స్కూల్ పనులు పూర్తి**

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి, ఏప్రిల్ 15 : జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఇంజనీరింగ్ అధికారులతో అభివృద్ధి పనుల పురోగతి పై కలెక్టర్ శ్రీహర్ష సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని విద్యా సంస్థల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, నూతన తరగతి గదుల నిర్మాణం, మౌలిక వసతుల ఏర్పాటును వేగవంతం చేసి వచ్చే విద్యా సంవత్సరం ప్రారం భానికి ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయాల పనులను జూన్ నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని, ప్రారంభోత్సవాలకు సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు. పనుల వేగవంతం కోసం అవసరమైతే అదనపు షిఫ్ట్‌లు ఏర్పాటు చేయాలని, రాత్రివేళల్లో కూడా లైటింగ్ సదుపాయాలతో పనులు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే జిల్లాలో చేపట్టిన అంగన్వాడీ కేంద్రాల మరమ్మత్తు పనులను మే 15లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇంకా ఈ సమావేశంలో ఈఈ పీఆర్ శంకరయ్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# ఉచిత పాలిటెక్నిక్, టీజీ ఆర్జెసి కోచింగ్ అడ్మిషన్లు పూర్తి

**- తరగతులు 16 నుంచి ప్రారంభం**

**- ఆస్క్ అధ్యక్షురాలు బల్గూరి స్నేహ దుర్గయ్య**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోదాడ, ఏప్రిల్ 15: కోదాడలో అంబేద్కర్ ఆశయ సాధన కేంద్రం (ఆస్క్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పాలిటెక్నిక్, టీజీ ఆర్జెసి కోచింగ్ సెంటర్‌లో విద్యార్థులకు అడ్మిషన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆస్క్ అధ్యక్షురాలు బల్గూరి స్నేహ దుర్గయ్య పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ 16 నుండి కోచింగ్ తరగతులు ప్రారంభమవుతాయని, ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించబడతాయని తెలిపారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా తరగతులకు క్రమం తప్పకుండా హాజరు కావాలని సూచించారు. పాలిటెక్నిక్, టీజీ ఆర్జెసి కోచింగ్‌కు పెద్ద సంఖ్యలో విద్యార్థులు అడ్మిషన్లు తీసుకోవడం పట్ల ఆస్క్ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్క్ ప్రధాన కార్యదర్శి మాతంగి ప్రభాకర్ రావు, కోర్స్ డైరెక్టర్ యలమర్తి శౌరి, పర్యవేక్షకులు బొడ్డు హుస్సేన్, నందిపాటి సైదులు, కోర్స్ కోఆర్డినేటర్ గంధం బుచ్చారావు, మాతంగి సురేష్, కనుకు శ్రీకాంత్, విద్యార్థి ఎం గగన్ తేజ్ తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి విడుదలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**- 8వ విడతగా ఏప్రిల్ 15 నుండి 5 రోజుల పాటు నీటి సరఫరా**

**- జిల్లా నీటిపారుదల శాఖ అధికారి శ్రీనివాస్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



పెద్దపల్లి, ఏప్రిల్ 15 : తెలంగాణ ప్రభుత్వ నీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు, పెద్దపల్లి జిల్లా పరిధిలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కాకతీయ కాలువ ద్వారా డి-83, డి-86 కాలువలకు సాగునీటిని విడుదల చేసినట్లు జిల్లా నీటిపారు దల శాఖ అధికారి శ్రీనివాస్ బుధవారం తెలిపారు.?యాసంగి సీజన్‌కు సంబంధించి ఇది చివరి విడతని, 8వ విడత నీటి విడుదల ఏప్రిల్ 15 నుండి వరుసగా 5 రోజుల పాటు సాగునీరు అందిస్తామని, వివిధ మండలాల రైతుల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని ముఖ్యంగా మొక్కజొన్న , ఆలస్యంగా వేసిన వరి పంటలను కాపాడేందుకు ఈ తడిని విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, చీఫ్ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణరావు, రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష రైతుల అవసరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, నీటి విడుదల కోసం ప్రత్యేక కృషి చేశారని పేర్కొన్నారు. ?సాగునీరు కాలువల చివరి ఆయకట్టు వరకు చేరేలా ఇరిగేషన్ శాఖ సిబ్బంది నిరంతరం విధుల్లో ఉంటారని, నీటి పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షక ఇంజనీర్ ఇరిగేషన్ సర్కిల్, పెద్దపల్లి జిల్లా ఇరిగేషన్ అధికారి సమన్వయం చేసుకుంటూ ?కాలువల ద్వారా విడుదల చేసిన నీటిని రైతులు పొదుపుగా, క్రమ పద్ధతిలో తమ పొలాలకు ఉపయోగించు కోవాలన్నారు. నీటి విడుదల సమయంలో క్షేత్రస్థాయి సిబ్బందికి రైతులు పూర్తిస్థాయిలో సహకరించి, పంటలను సమృద్ధిగా పండించుకోవాలని శ్రీనివాస్ పేర్కొన్నారు.

ప్రజాలక్ష్యం

సంపాదకీయం

# దేశానికి దిశ చూపేలా బిల్లులపై చర్చించాలి !

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై పలు విమర్శలు వస్తున్నాయి. పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రాజకీయ పార్టీలతో పాటు, పౌరసమాజం లోనూ అనుమానాలు ఉన్నాయి. ఈ నెల 16 నుంచి పార్లమెంట్ మూడు రోజుల పాటు ప్రత్యేకంగా సమావేశం కాబోతున్నది. అందువల్ల ఈ విషయంలో అనుమానాలు నివృత్తి చేయాల్సి ఉంది. అనుమానాలు వ్యక్తం చేస్తున్న వారు, ఆందోళనలు చేస్తున్న వారు, విమర్శలు చేస్తున్న వారి అభిప్రాయాలకు విలువనివ్వాలి. పార్లమెంట్ వేదికగా సుదీర్ఘంగా చర్చించాలి. విపక్ష, స్వపక్ష నేతలు కూడా పరస్పర వివాదాల జోలికి పోకుండా ప్రజలకు అర్థమయ్యేలా సమగ్రంగా చర్చించాలి. అఖిలపక్ష సమావేశం కన్నా పార్లమెంటులో చర్చించడమే మేలు. ఎందుకంటే ఈ చర్చకు చట్టబద్దత ఉంటుంది. అలాగే సభ్యుల సూచనలు, సలహాలకు విలువ ఉంటుంది. ఎఐ వినియోగం, సాంకేతికత పెరిగిన ప్రస్తుత కాలంలో ఈ విషయాలపై వాటి సాయం కూడా పొందితే మంచిది. పార్లమెంటులో సుదీర్ఘ ఉపన్యాసాలకు తావులేకుండా, పరస్పర విమర్శలకు చోటు లేకుండా ఈ రెండు అంశాలపై సమగ్రంగా చర్చించాలి. దీనివల్ల ప్రజలకు కూడా అవగాహ కలిగేలా ఉండాలి. రాజకీయపార్టీలు స్వార్థ రాజకీయాలను పక్కన పెట్టి, ఈ అంశాలపై ఓ ఏకాభిప్రాయం వచ్చేలా చూడాలి. ఎందుకంటే మహిళా రిజర్వేషన్ బిల్లు ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉంది. నిజానికి మొన్నటి సార్వత్రిక ఎన్నికలకు ముందే పార్లమెంట్ ముందుకు వచ్చింది. అప్పుడే ఇది చట్టంగా మారివుంటే బాగుండేది. కొత్తగా జనాభా లెక్కల తరవాత దీనిని అమలు చేస్తామని గతంలో బిల్లు ప్రవేశ పెట్టినప్పుడు ప్రభుత్వం చెప్పింది. ఇప్పుడు 2011 జనాభా లెక్కల ప్రకారం అమలు చేస్తే అన్యాయం చేసినట్లు అవుతుంది. 2029లో సార్వత్రిక ఎన్నికలు జరిగితే ప్రజాస్వామ్యం మరింతగా వికసిస్తుందని, బలోపేతం అవుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. విధాన నిర్ణయాల్లో మహిళలు ఎప్పుడైతే క్రియాశీలంగా వ్యవహరిస్తారో అప్పుడు వికసిత్ భారత్ దిశగా ప్రయాణం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 ఎన్నికల నుంచి అమలు చేసేందుకు 16వ తేదీ నుంచి 3 రోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో సవరణలను చేపట్టనున్న నేపథ్యంలో దేశంలోని మహిళలకు ప్రధాని ప్రత్యేకంగా లేఖ రాశారు. నిజానికి ఇప్పటికే మహిళల రిజర్వేషన్లు అమలు జరిగివుండాల్సింది. అనేక రంగాల్లో మహిళలు రాణిస్తున్నందున చట్టసభల్లోనూ వారి భాగస్వామ్యం పెరగాల్సిందే. చట్టసభల్లో వారి వాణి బలంగా వినిపిస్తే ప్రజాసామ్యం మరింత బలోపేతం అవుతుంది. అయితే లోక్‌సభ సీట్లు పెరిగితేనే మహిళల రిజర్వేషన్లు అమలు సులువవుతందని ప్రభుత్వ వాదనగా ఉం ది. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలుగా ఇప్పుడున్న లోక్‌సభ స్థానాల గరిష్ఠ సంఖ్య 550ని గరిష్ఠంగా 850 వరకూ పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 2027 జనాభా లెక్కల నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ అందుకు సంబంధించి లెక్కలు వెలువడటానికి ఆలస్యమవుతుందన్న ఉద్దేశంతోనే ముందస్తు గా ఈ రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకొస్తున్నట్లు కేంద ప్రభుత్వం పేర్కొంది. దాని ప్రకారం వెళ్తే ప్రజాస్వామ్య పక్రియలో మహిళా భాగస్వామ్యం పెంచడంలో జాప్యం జరుగుతుందని అభిప్రాయపడింది. కేంద్ర ప్రభుత్వం ఏ జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోనేదీ ఈ బిల్లులో చెప్పలేదు. అయితే డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కోసం ప్రతిపాదించిన బిల్లులో ఆ కమిషన్ ఏర్పాటయ్యే నాటికి అందుబాటు లో ఉన్న తాజా జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాలను పునర్విభజించను న్నట్లు పేర్కొంది. అంటే దాని ప్రకారం ప్రస్తుతం అందుబాటు లో ఉన్న తాజా జనాభా లెక్కలు 2011వే కాబట్టి వాటి ప్రాతిపదికనే నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశముంది. 850 సీట్లను ఏ ప్రాతిపదికన పెంచబోయేదీ ఈ బిల్లులో స్పష్టత ఇవ్వకున్నా పార్లమెంటులో చర్చ సందర్భంగా ప్రభుత్వం చెప్పే అవకాశం ఉంది. అప్పుడు అన్ని రాష్ట్రాల్లో స్థానాలను 50శాతం పెంచుతామని చెబితే ఏయే రాష్ట్రాల్లో అసెంబ్లీ, పార్లమెంటు సీట్లు ఎన్ని పెరుగుతాయన్న దానిపై స్పష్టత వస్తుంది. ఆ రాష్ట్రాలకు వచ్చిన సీట్లను అంతర్గతంగా పునర్విభజించుకోవడానికి 2011 జనాభా లెక్కలు పనికొస్తాయి. అలా కాకుండా దేశం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకొని 2011 జనాభా లెక్కల ఆధారంగానే పునర్విభజన చేపట్టాలని నిర్ణయిస్తే డీలిమిటేషన్ కమిషన్ అంతిమంగా నివేదిక ఇచ్చేంత వరకూ ఏ రాష్ట్రం లో ఎన్ని సీట్లు పెరుగుతాయన్న దానిపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కమిషన్‌కు సహాయ పడటానికి ప్రతి రాష్ట్రం నుంచి 10 మందిని నియమిస్తారు. ఇందులో ఐదుగురు ఎంపీలు, ఐదుగురు ఎమ్మెల్యే లుంటారు. లోక్‌సభ సభ్యులను లోక్‌సభ స్పీకర్, ఎమ్మెల్యేలను అసెంబ్లీ స్పీకర్ నామినేట్ చేస్తారు. నియోజకవర్గాల పునర్విభజన కోసం రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్, సర్వేయర్ జనరల్ ఆఫ్ ఇండియా, వారి నామినీలను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులను, భౌగోళిక పరిస్థితులపై అవగాహన ఉన్న నిపుణులను, ఇతరత్రా అవసరమైన వారిని పిలిచి మాట్లాడే అధికారం ఈ కమిషన్‌కు ఉంటుంది. కమిషన్ సభ్యుల్లో భిన్నాభిప్రాయాలు ఏర్పడితే మెజారిటీ సభ్యుల అభిప్రాయం చెల్లుబాటవుతుంది. డీలిమిటేషన్ బిల్లులో ఈ కమిషన్ ఏర్పాటు కావడానికి ముందు అందుబాటులో ఉన్న తాజా జనాభా లెక్కల ప్రకారం నియోజక వర్గాల పునర్విభజన జరుగుతుందని చెప్పింది తప్పితే స్పష్టంగా ఫలానా జనాభా లెక్కల ప్రాతిపదికన అని చెప్పలేదు. 2027 జనాభా లెక్కల సేకరణ జరుగుతున్న తరుణంలో 2011 జనాభా లెక్కలను ఎలా ప్రాతిపదికగా తీసుకుంటారని ప్రతిపక్షాలు ప్రశ్నించే వీలుండటంతో ఆ దాడి నుంచి తప్పించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం తెలివిగా కమిషన్ ఏర్పాటయ్యే నాటికి ముందున్న జనాభా లెక్కల ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పినట్లు కనిపిస్తోంది. అయితే ఇవన్నీ ఒక పజిల్‌లలాగా కనిపిస్తున్నాయి. అందువల్ల పార్లమెంట్ చర్చకు విలువ ఉంటుంది. అఖిలపక్షం కన్నా పార్లమెంటులో చేస చర్చలకే ప్రాధాన్యం ఉంటుంది. విపక్షాలకు ఉన్న అనుమానాలను తీర్చాల్సిన బాధ్యత అధికార పక్షానిది. అనుమానాలను సహేతుకంగా ప్రస్తావించడం ద్వారా విపక్షాలు తమవంతుగా కృషి చేయాలి. అప్పుడే ఈ రెండు బిల్లులపై సమగ్ర చర్చకు అవకాశం ఉంటుంది.

# 'తెలంగాణ అస్తిత్వ వేదిక' ఎందుకు ...!?

ఒక జాతిని భౌతికంగా లొంగదీసుకోవడం కంటే, ఆ జాతి సంస్కృతిని, భాషను హీనపరిచి మానసికంగా బలహీనపరచడం వలసవాద శక్తుల ప్రాథమిక లక్షణం. తెలంగాణ చరిత్రలో గత ఎనిమిది దశాబ్దాలుగా సాగుతున్న పోరాటం కేవలం భూమి కోసం, నీటి కోసం మాత్రమే కాదు; అది ప్రధానంగా మన 'అస్తిత్వం' కోసం. "తెలంగాణలో కవులే లేరు" అన్న ముదుంబై రాఘవాచార్యుల వ్యాఖ్య నుండి, నేటికీ కొనసాగు తున్న "హైదరాబాద్‌ను నేనే నిర్మించాను" అనే అహంకారపూరిత ప్రేలాపనల వరకు... ప్రతి మాట వెనుక ఒకే ఒక కుత్సితమైన 'సాంస్కృతిక అహం భావం' దాగి ఉంది. ఈ నేపథ్యంలో, తెలంగాణ అస్తిత్వ మూలాలను వెతుకుతూ, పొంచి ఉన్న వలసవాద ముప్పును హెచ్చరిస్తూ 'తెలంగాణ అస్తిత్వ వేదిక' ఏప్రిల్ 19నాడు తన ఆవిర్భావాన్నిరాజధాని నగరం నడిబొడ్డులోని రవీంద్ర భారతి వేదిక నుండి సగర్వంగా ప్రకటిస్తున్నది. కమలాపూర్ మారుమూల ప్రాంతంలో పుట్టిన మన మట్టిబిడ్డ తనకలం బలంతో అంతర్జా తీయస్థాయికి ఎదిగి గడచిన ఆరు దశాబ్దా లుగా దేశరాజధాని ఢిల్లీ కేంద్రంగా పదునైన తన కలాన్ని ఝులిపిస్తున్న ఎస్. వెంకట నారాయణకు జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేయడంతో పాటుగా, గడచిన మూడు మాసాలుగా అస్తిత్వ వేదిక ఏర్పాటుకు సంబంధించిన అంతర్గత తర్జనబర్జనల్లో భాగంగా నిర్వహించు కున్న మేథో మథనాల సారాంశంగా 'తెలంగాణ అస్తిత్వం' శీర్షికతో ఒక వ్యాససంకలనాన్ని కూడా ఈ సందర్భంగా వెలువరిస్తున్నది.

### సాంస్కృతిక సామ్రాజ్యవాదం : భాషా విద్వేషం

ఉమ్మడి రాష్ట్రం ఏర్పడక ముందు నుంచే తెలంగాణ భాషపై వివక్ష మొదలైంది. ఇక్కడి భాషను 'తౌరక్యాంధ్రం' అని హేళన చేయడం వెనుక, ఒక ప్రాంత భాషను కేవలం 'యాస'గా ముద్రవేసి, తమ ప్రాంత భాషనే 'ప్రామాణికం'గా రుద్దే ప్రయత్నం జరిగింది. తెలంగాణ గడ్డపై పండిన వరిని, ఇక్కడి విద్యా వ్యవస్థను, చివరికి ఇక్కడి మనుషుల జీవన శైలిని కూడా తమ ఉద్ధరణ వల్లే జరిగిందని నమ్మించే 'రక్షక సిండ్రోమ్' (Savior Syndrome) వలస పాలకుల్లో కనిపిస్తుంది. 2026 సంక్రాంతి సమయంలో వెలువడిన "మేము వెళ్ళిపోతే తెలంగాణ వాళ్ళు ఎలా బతుకుతారో" అనే వ్యాఖ్యలు, తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పుష్కర కాలం గడిచినా వలసవాద ఆలోచనా ధోరణి ఎంత బలంగా ఉందో నిరూపిస్తున్నాయి.

### భౌగోళిక అస్తిత్వం: దక్కన్ పీఠభూమి చైతన్యం

తెలంగాణ భౌగోళికత దాని అస్తిత్వానికి మూలం. దక్కన్ పీఠభూమిలోని ఎత్తైన గడ్డ, రాతి నేల ఇక్కడి ప్రజలకు పోరాట పటిమను, మొండితనాన్ని ఇచ్చింది. "నీరు పల్లమెరుగు.. మీకు నీళ్లు రావు" అని ఎద్దేవా చేసిన మైదాన ప్రాంత పాలకులకు తెలియని విషయం ఏమిటంటే... తెలంగాణ చెరువుల నాగరికత. కాకతీయుల నుండి ఆసఫ్‌జాహీల వరకు నిర్మించిన గొలుసుకట్టు చెరువులు కేవలం నీటి వనరులు మాత్రమే కాదు, అవి బతుకమ్మ వంటి అద్భుతమైన సాంస్కృతిక పండుగలకు పురిటిగడ్డలు. మెట్ట వ్యవసాయం, చిరుధాన్యాల సాగు ఇక్కడి ప్రజల దృఢత్వానికి, వారి విభిన్నమైన ఆహారపు అలవాట్లకు (జొన్న రొట్టె, గటక) కారణమయ్యాయి. ఈ భౌగోళిక భిన్నత్వమే ఆంధ్రు లకు, తెలంగాణ ప్రజలకు మధ్య ఉన్న స్పష్టమైన రేఖ.

### అంతర్గత వలసీకరణ: వనరుల దోపిడీ

బ్రిటిష్ వారి హయాంలో కృష్ణా, గోదావరి డెల్టా ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధి వల్ల వచ్చిన అదనపు సంపద, ఆంధ్ర ప్రాంతంలో ఒక ఆధిపత్య వర్గాన్ని తయారు చేసింది. ఆ సంపదతో వారు పత్రికలు, సినిమాలు, విద్యాసంస్థలను చేజిక్కించుకుని తెలంగాణను ఒక 'అంతర్గత వలస' (Internal Colony)గా మార్చుకున్నారు. నోబెల్ విజేత డెస్మండ్ టుటు చెప్పినట్టు... వారు ఒక చేతిలో 'అభివృద్ధి' అనే బైబిల్ పట్టుకొని వచ్చారు, మనం కళ్లు తెరిచి చూసేసరికి మన నీళు, మన బొగ్గు, మన భూములు వారు వశపరు చుకున్నారు. విభజన చట్టంలోని క్లాజుల ద్వారా నేటికీ మన ప్రాజెక్టులను అడ్డుకోవడం, ఉమ్మడి పాలన పేరిట తమ పెత్తనాన్ని కొనసాగించడం ఈ వలసవాద కొనసాగింపులో భాగమే.

### ప్రస్తుత ముప్పు: పొంచి ఉన్న పులి

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అస్తిత్వ పోరాటం ముగిసిందని భావించడం చారిత్రక తప్పిదం అవుతుంది. నేడు వలసవాదం మళ్లీ జూలు విదిలిస్తోంది. దీనికి 'జాతీయ మతతత్వ శక్తులు' తోడవ్వడం అత్యంత ప్రమా దకరం. తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకలైన రవీంద్ర భారతి వంటి చోట్ల తెలంగాణ వ్యతి రేక విగ్రహాలను ప్రతిష్ఠించడం, హైదరాబాద్ నగరాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చే కుట్రలు చేయడం వంటివి మన కళ్లముందే జరుగుతున్నాయి. తెలంగాణ తల్లి చేతిలోని బతుకమ్మను మాయం చేయడం వంటి చర్యలు మన సాంస్కృతిక చిహ్నాలను చెరిపివేసే ప్రయత్నమే.

### మన అప్రమత్తతే మన రక్షణ

తెలంగాణ నేల కేవలం మట్టి కాదు, అది పోరాటాల పురిటిగడ్డ. కఠినమైన రాతి నేలను తవ్వి చెరువులు నిర్మించుకున్న ఓర్పు మనది. గడీల అణచివేతను ఎదిరించి, తుపాకి పట్టిన తెగువ మనది. మన భాషను 'యాస' అని హేళన చేసినా, మన సంస్కృతిని చిన్నచూపు చూసినా... ఆత్మగౌరవాన్ని గుండెల్లో దాచుకుని మలిదశ ఉద్యమంలో ప్రపంచాన్నే తలవంచేలా చేసిన ధీరత్వం మనది.

కానీ, నేడు మళ్ళీ మన అస్తిత్వం ప్రమాదంలో పడింది. వలసవాద శక్తులు మారురూపాల్లో చొరబడుతున్నాయి. శతాబ్దాల మత సామరస్యాన్ని విచ్ఛిన్నం చేసే ప్రతీప శక్తులు పడగ విప్పుతున్నాయి. మన వనరులు, మన సంస్కృతి, మన మేధో సంపదపై మళ్ళీ కొత్త రూపంలో దాడులు జరుగుతున్నాయి. ఈ చారిత్రక సందర్భంలో అప్రమత్తంగా ఉండటం మన బాధ్యత.

### అస్తిత్వ వేదిక ఆవశ్యకత

వలసవాదం ఎప్పుడూ దళారీ వర్గాల ద్వారానే పనిచేస్తుంది. మెకాలే చెప్పినట్టు, శరీరంతో భారతీయులుగా ఉంటూ మనసుతో బ్రిటీషర్లుగా ఉండే వర్గంలాగే... నేడు తెలం గాణలో ఉంటూ ఆంధ్ర వలసవాద ప్రయోజ నాలను కాపాడే దళారీలు పెరిగిపోయారు. ఈ తరుణంలో 'తెలంగాణ అస్తిత్వ వేదిక' (TAV) ఏర్పాటు ఒక చారిత్రక అవసరం.

జెన్–జీ (Gen-Z) తరానికి మన పోరాట మూలాలను అందించడం, మన అస్తిత్వాన్ని కాపాడుకోవడం ప్రతి తెలంగాణ బిడ్డ బాధ్యత. "చింత చచ్చినా పులుపు చావదు" అన్నట్టుగా వలస వాద అహంకారం ఇంకా సజీవంగానే ఉంది. అందుకే, మన అప్రమత్తతే మనకు రక్ష. తెలంగాణ అస్తిత్వ పరిరక్షణలో మనమంతా ఏకమై, స్వీయ రాజకీయ, సాంస్కృతిక సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలని ఈ వేదిక పిలుపునిస్తోంది.ఏ జాతి అయితే తన చరిత్రను మర్చిపోతుందో, ఆ జాతి తన భవిష్యత్తును కోల్పోతుంది; మన మూలాలను వెతుక్కుం టూ సాగే ఈ ప్రయాణం కేవలం గతాన్ని స్మరించుకోవడం కాదు, మన ఆత్మగౌరవాన్ని పునర్నిర్మించుకోవడం.అణచివేతకు గురైన అస్తిత్వం ఆత్మరక్షణ కోసం చేసే గర్జన ఇది; వలసవాద నీడల నుండి మన మట్టిని, మన భాషను, మన సంస్కృతిని కాపాడుకోవ డమే మన తక్షణ చారిత్రక బాధ్యత.మన మూలాలను వెతుక్కుం టూ... మన అస్తిత్వాన్ని కాపాడుకుంటూ...తెలంగాణ అస్తిత్వ వేదిక (TAV)తన ప్రస్థానాన్ని ప్రారంభిస్తోంది.కలిసి నడిచేవారందరికీ సాదరంగా ఆహ్వానం పలుకుతున్నది.

–వీరమల్ల ప్రకాశ్, పిట్టల రవీందర్, శ్రీధర్ రావు దేశ్ పాండే




**"మట్టి మనిషి మౌనం వెనుక ఒక మహా విస్ఫోటనం ఉంటుంది... ఆ మౌనం చేతకానితనం కాదు... అది అదును చూసి అన్యాయంపై విరుచుకుపడే నివురు గప్పిన నిప్పు!"**

తెలంగాణ నేల కేవలం ఒక భౌగోళిక పటం కాదు, అది శతాబ్దాల వీరగాథలకు సజీవ సాక్ష్యం. దక్కన్ పీఠభూమిలోని కఠినమైన రాతి నేలలు ఇక్కడి ప్రజలకు ఓర్పును మాత్రమే కాదు, ఎంతటి కష్టాన్నైనా ఎదిరించే మొండితనాన్ని నూరిపోశాయి. ఆకాశం నుండి రాలే వాన చినుకు కోసం ఎదురుచూస్తూనే, గట్టి నేలను తవ్వి చెరువులు నిర్మించుకున్న మన పూర్వీకుల శ్రమ సంస్కృతి మన రక్తంలోనే ఉంది. ఈభౌగోళిక గర్వమేమనల్ని ఎవరికీ లొంగని ధీరులుగా తీర్చిదిద్దింది.మన అస్తిత్వానికి తాత్విక పునాదులు నేటివి కావు. జైన, బౌద్ధ మతాలు బోధించిన సమానత్వం, వీరశైవ ఉద్యమం చాటిన 'కాయకమే కైలాసం' అనే సామాజిక స్పృహ మనల్ని ప్రశ్నించే తత్వానికి వారసులుగా మార్చాయి. అందుకే ఈ గడ్డపై పాలకుడు ఎవరైనా, ప్రజల గొంతుక మాత్రం ఎప్పుడూ స్వతంత్రమే. సమ్మక్క–సారలమ్మల వీరోచిత తిరుగుబాటు నుండి, నిజాం గడీలను గడగడలాడించిన సాయుధ పోరాటం వరకు... జల్–జంగల్–జమీన్ కోసం కొమరం భీం రగిల్చిన నిప్పు కణిక నుండి, మలిదశ ఉద్యమ ఆఖరి శ్వాస వరకు... తెలంగాణ ఎప్పుడూ తలవంచలేదు

కానీ, నేడు ఒక కొత్త రూపంలో వలసవాదం మన ముంగిట నిలబడింది. మన భాషను 'యాస' అని వెక్కిరించిన అహంకారం, మన పండుగలను చిన్నచూపు చూసిన అనాగరికత, మన వనరులను కొల్లగొట్టిన కుతంత్రం మళ్ళీ కొత్త ముసుగులతో మనపై దాడి చేస్తున్నాయి. సాంస్కృతిక అహంకారంతో మన చరిత్రను చెరిపివేయాలని చూస్తున్న ప్రతీప శక్తులు, మతతత్వ రాజకీయాలతో మన సమ్మిళిత సహజీవనాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్న సామ్రాజ్యవాద శక్తులు తెలంగాణను మళ్ళీ తమ గుప్పిట్లోకి తీసుకోవాలని కుట్ర పన్నుతున్నాయి. ఇది కేవలం ఒక సమావేశం కాదు; ఇది తెలంగాణ అస్తిత్వ పునరుద్ధరణ యజ్ఞం. మన వనరులపై మనకే సార్వభౌమత్వం ఉండాలని, మన భాష మన ఆత్మగౌరవ పతాకం కావాలని, మన తెలంగాణ మన అస్తిత్వానికి అసలైన చిరునామా కావాలని కోరుకునే ప్రతి గుండె ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైంది. పాత బంధిఖానాల నుంచి స్వేచ్ఛా వాయువుల్లోకి వచ్చిన మన గడ్డ, మళ్లీ ఏ శక్తుల చేతుల్లోనూ బందీ కాకూడదు. వచ్చేయండి... ఈ మేధో మథనంలో భాగస్వామ్యం పంచుకోండి. మన మట్టి సిద్ధాంతాన్ని, మన నీటి తిరుగుబాటును, మన భాషా గర్వాన్ని కలిసికట్టుగా ప్రపంచానికి చాటుదాం!

వనరులు మనవి – సార్వభౌమత్వం మనది!

తెలంగాణ మనది – అస్తిత్వం మనది!

జై తెలంగాణ ... జై జై తెలంగాణ

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత, వేగం పై కలెక్టర్ ప్రత్యేక దృష్టి

- ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మాణాలు-గడువులోపు పూర్తి చేయాలని ఆదేశాలు.
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై సమీక్షలో భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్.

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 15 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతానగర్ మండలం మర్రి తండ గ్రామంలో అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం సమగ్రంగా పరిశీలించారు. గ్రామంలో మొత్తం 99 ఇళ్లకు అనుమతులు మంజూరు కాగా, అందులో 65 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మిగిలిన ఇళ్ల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నట్లు సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ పలువురు లబ్ధిదారుల ఇళ్లను ప్రత్యక్షంగా సందర్శించి నిర్మాణ నాణ్యత, పనుల పురోగతిని పరిశీలించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి ఇప్పటివరకు జరిగిన ఖర్చు, ప్రభుత్వం విడుదల చేసిన నిధులు, లేబర్ చార్జీలు తదితర అంశాలపై వివరాలు సేకరించారు. మూడ్ మౌనిక, హాథిరాం, భూక్య అమల, భూక్య సునీత, భూక్య పంతులీ ఇళ్లను పరిశీలించారు. గ్రామంలో సుమారు 650 మంది జనాభా ఉండగా, వారిలో అధిక సంఖ్యలో తాపీ మేస్త్రీలు ఉన్నారని గమనించిన కలెక్టర్, ప్రభుత్వం అందిస్తున్న రూ.5 లక్షల ఆర్థిక సహాయానికి అదనంగా లబ్ధిదారులు స్వంతంగా పెట్టుబడి పెట్టి, తావే నిర్మాణ పనుల్లో పాల్గొని లేబర్ ఖర్చులను తగ్గించుకుంటున్నారని తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణం ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలు, నిబంధనల ప్రకారం జరుగుతోందో లేదో



అధికారులను ప్రశ్నించి, ఇళ్ల విస్తీర్ణం, నిర్మాణ పరిమాణాన్ని టేప్‌తో కొలిపించి నిర్ధారించారు. నాణ్యతలో ఎలాంటి లోపాలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, పనుల పురోగతిపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేపట్టి, మిగిలిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపీడీవో భారతి, గృహ నిర్మాణ శాఖ ఏఈ లాల్ సాబ్, పంచాయతీ సెక్రటరీ విజయలక్ష్మి, లబ్ధిదారులు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.




# విద్యార్థులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి

## ఏఐవైఎఫ్ నిర్మాణ బాధ్యులు కొండపర్తి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, ఏప్రిల్ 15 : పాలకులు అవలంభిస్తున్న విధానాలపై యువత, విద్యార్థులు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ నిర్మాణ బాధ్యులు కొండపర్తి గోవిందరావు పిలుపునిచ్చారు. బుధవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్లో జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కొండపర్తి గోవిందరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయన్నారు. నిరుద్యోగులను ఎన్నికల సమయంలో రాజకీయ లబ్ది కోసం వాడుకుంటూ హామీలు గుప్పిస్తున్నారని ఆ తర్వాత వాటిని విస్మరిస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతిని వెంటనే అమలు చేయాలన్నారు. యువత, విద్యార్థులు పాలకుల విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శులు దండి సురేష్, జమ్ముల జితేందర్రెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నానబాల రామకృష్ణ, జిల్లా ఆఫీస్ బేరర్స్ మామిళ్ల శ్రీనాథ్ రెడ్డి, శ్రావణ్ కుమార్, గనపారపు ఉపేందర్, చింతల రమేష్, కొల్లు రవి, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రజలలో అవగాహన కల్పించాలి...

## - రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి, నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నల్గొండ, ఏప్రిల్ 15 : రోడ్డు ప్రమాదాలు జరగకుండా పెద్ద ఎత్తున ప్రజలలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి, నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 13 నుండి 18 వరకు అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బుధవారం నల్గొండ జిల్లా, నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో జిల్లా పోలీస్, రవాణాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అరైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా మోటార్ సైకిల్ పై వెళ్లే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని, అలాగే కార్లలో వెళ్లేవారు సీటు బెల్టు ధరించాలని చెప్పారు. వాహనాలపై వెనుక ఉన్నవారు సైతం హెల్మెట్లు ధరించాలని అన్నారు. పోలీసు అధికారులు రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి జాతీయ రహదారులు ,ఇతర రహదారులపై అతివేగంతో వెళ్లే వాహనాలను నియంత్రించేందుకు పెట్రోలింగ్ పెంచాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ రహదారి భద్రతపై దృష్టి సారించాలని, ఈ విషయంపై అందరికీ అవగాహన కల్పిస్తే రహదారి ప్రమాదాలు తగ్గుతాయని అన్నారు. నల్గొండ జిల్లాలో అండర్ పాస్ రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తే రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానని, అలాగే నకిరేకల్ లో స్థలం చూపిస్తే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనానికి నిధులు మంజూరు చేస్తామని మంత్రి తెలిపారు.

రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో హత్యలతో పోలిస్తే రోడ్డు ప్రమాదాలలో చనిపోయేవారి సంఖ్య ఎక్కువగా ఉందని, రోడ్డు ప్రమాదాల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని కోరారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రత్యేకించి రహదారి భద్రతపై అలైవ్ అరైవ్ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతున్నదని, పోలీసు, ట్రాన్స్పోర్ట్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సంవత్సరానికి 800 మంది హత్యలకు గురై చనిపోతుండగా ,రోడ్డు ప్రమాదాలలో 7500 మంది చనిపోతున్నారన్నారు. నల్గొండ జిల్లాలో హత్యల కారణంగా 24 మంది చనిపోతే రోడ్ యాక్సిడెంట్లలో 325 మంది చనిపోతున్నారని, సూర్యాపేట జిల్లాలో హత్యల కారణంగా 25 మంది, రోడ్డు ప్రమాదాలలో 230 మంది గత సంవత్సరం చనిపోయినట్లు ఆయన గణాంకాలు వివరించారు. అన్ని శాఖల సమన్వయంతో వీటిని తగ్గించాల్సిన అవసరం ఉందని, ఈ కార్యక్రమంలో ప్రజాప్రతిని, అధికారులు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. వాహనాలు నడిపేటప్పుడు ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యంగా ఉండవద్దని, టు వీలర్ పై వెళ్లేవారు హెల్మెట్ ,ఫోర్ వీలర్ పై వెళ్లేవారు సీట్ బెల్ట్ ధరించాలని, వాహనం వెనక కూర్చున్న వారు సైతం తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని అన్నారు. రహదారుల పై చనిపోయిన వారిలో 65% కాలినడకన వెళ్లేవారు, మోటార్ సైకిల్ పై వెళ్లేవారే చనిపోతున్నారని తెలిపారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని , హెల్మెట్ ధరించాలని ఎవరు వాహనదారునికి చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం మాట్లాడుతూ జాతీయ రహదారి నిడివి జిల్లాలో ఎక్కువగా ఉన్నందున రోడ్డు మీద వెళ్లేవారు తిరిగి క్షేమంగా ఇంటికి వస్తారో లేదో అన్న ఆందోళన ఉందని , రోడ్డు ప్రమాదాల నివారణకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, అరైవ్,ఆ లైవ్ గొప్ప కార్యక్రమం అని అన్నారు. రోడ్డు ప్రమాదాల పట్ల జిల్లాలోని ప్రజలందరూ చైతన్యవంతం కావాలని, తమ నియోజకవర్గ పరిధిలో అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏప్రిల్ 13 నుండి 18 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంతటా రోడ్డు భద్రత కార్యక్రమాలు చేపట్టామని, హెల్మెట్ లేని వారు తప్పకుండా హెల్మెట్ కొనుక్కుని ధరించి వాహనాలు నడపాలని, జిల్లాలో రోడ్ సేఫ్టీ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని, జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి కృషి చేస్తామని తెలిపారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో జాతీయ రహదారి నిడివి ఎక్కువగా ఉందని, గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం జిల్లా యంత్రాంగం, పోలీసులు తీసుకున్న చర్యల వల్ల రోడ్డు ప్రమాదాలు తగ్గాయని 2024 సంవత్సరం జిల్లాలో రోడ్డు ప్రమాదాల వల్ల 390 మంది చనిపోతే, గత సంవత్సరం 347 మంది చనిపోయారని తెలిపారు. రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ చైర్మన్ గుత్తాఅమిత్ రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు , తదితరులు మాట్లాడారు. మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, డిఐజి చౌహాన్, సర్వోత్తమ్ రెడ్డి, పున్న కైలాస్ నేత, మున్సిపల్ చైర్మన్ రజిత, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రభుత్వ విప్ నకరికల్ శాసనసభ్యులు వేముల వీరేశం 2000 మందికి హెల్మెట్లను ఇవ్వాలని నిర్ణయించగా ఇన్చార్జి మంత్రి, డిజిపి ల చేతుల మీదుగా వాటిని అందజేశారు. కార్యక్రమానికి హాజరైన వారందరి చేత రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని సుమారు 40 మంది గ్రామ సర్పంచ్లు తమ గ్రామ పరిధిలో హెల్మెట్ లేకుండా వాహనాలు నడపమని తీర్మానిస్తూ తీసుకున్న నిర్ణయాలను రాతపూర్వకంగా మంత్రికి అందజేశారు. అరీవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా సమావేశ ప్రాంగణంలో కంటి చికిత్స శశిబిరాన్ని అరైవ్ అలైవు పై ఏర్పాటుచేసిన గ్రంథాలయాన్ని మంత్రి సందర్శించారు

# అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికి చేరాలి - ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

## - అశ్వరావుపేటలో రెండు విద్యుత్ ఉపకేంద్రాలకు శంకుస్థాపన
## - గండుగులపల్లిలో సోలార్ మోడల్ ప్రాజెక్ట్ ప్రారంభం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 15 : అభివృద్ధి ఫలాలు ప్రతి ఇంటికీ చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట నియోజకవర్గం దమ్మపేట మండలం జగ్గారం, మల్లారం గ్రామాల్లో నిర్మించనున్న రెండు 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, ఎన్పీడీసీఎల్ సిఎండీ వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధికి నాణ్యమైన విద్యుత్ అత్యవసరమని పేర్కొన్నారు. రైతులకు అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించేందుకు ఉపకేంద్రాల సామర్థ్యాన్ని పెంచడం కీలకమని తెలిపారు. జగ్గారం, మల్లారం ప్రాంతాల్లో సుమారు రూ.5 కోట్ల వ్యయంతో ఈ ఉపకేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామాన్ని మోడల్ సోలార్ గ్రామంగా అభివృద్ధి చేస్తూ రూ.23 కోట్లతో ప్రాజెక్ట్ అమలు చేస్తున్నామని, దీని ద్వారా 422 ఇళ్లకు సోలార్ విద్యుత్ అందుబాటులోకి వస్తుందని చెప్పారు. అలాగే నియోజకవర్గంలో విద్యుత్ లైన్లు, పోల్స్ పునరుద్ధరణకు రూ.8 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రతి వ్యక్తికి నెలకు 6 కిలోల సన్నబియ్యం అందిస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లు, గిరిజన ప్రాంతాలకు అదనంగా 1000 ఇళ్లు కేటాయించినట్లు తెలిపారు. మహిళల కోసం మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా కొనసాగుతోందని తెలిపారు. పోడు భూముల అభివృద్ధి కోసం బోర్‌వెల్లు, డ్రిప్, స్ప్రింక్లర్ సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ జీవిత బీమా పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా రక్షణ అందిస్తున్నామని, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల ద్వారా నాణ్యమైన విద్య



అందించనున్నామని తెలిపారు. అశ్వరావుపేటలో విద్యుత్ సేవల మెరుగుదల కోసం డివిజన్ కేంద్రాన్ని మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ, గ్రామాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి సమగ్ర ప్రణాళిక అమలు చేస్తున్నామని తెలిపారు. పాత విద్యుత్ లైన్లు మార్చి, కొత్త పోల్స్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. ఎన్పీడీసీఎల్ సిఎండీ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ, ఈ ఉపకేంద్రాల ద్వారా సుమారు 6 వేల మందికి నాణ్యమైన విద్యుత్ అందుతుందని తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ లోడ్ నిర్వహణకు ఇవి ఉపయోగపడతాయని చెప్పారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, ఈ ఉపకేంద్రాల వల్ల సుమారు 4 వేల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. వేసవిలో లో వోల్టేజ్, విద్యుత్ అంతరాయం సమస్యలు తగ్గుతాయని చెప్పారు. అనంతరం గండుగులపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్‌ను ఉప ముఖ్యమంత్రి ప్రారంభించారు. సోలార్ మీటర్‌ను ఆన్ చేసి గ్రామానికి విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పాల్వంచ తోగ్గూడెంలో ఘనంగా కొమరం భీమ్ విగ్రహావిష్కరణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, ఏప్రిల్ 15:భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలం తోగ్గూడెం గ్రామంలో గ్రామస్తులందరూ కలిసి ఆదివాసీ పోరాట యోధుడు కొమరం భీమ్ యొక్క విగ్రహాన్ని బుధవారం అత్యంత వైభవంగా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని విగ్రహావిష్కరణ చేసిన భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్ల వెంకటరావు పంచాయతీ ఆఫీస్ నుంచి ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలాగా ఆదివాసి కొమ్ముకోయ నృత్యం ఆదివాసి ఆర్తి బిడ్డలతోటి భారీ ర్యాలీగా వెళ్లి కొమరం భీం విగ్రహావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసినటువంటి బహిరంగ సభలో ఆదివాసి సమాజాన్ని ఉద్దేశించి భవిష్యత్తులో ఆదివాసులంతా ఐక్యంగా ముందుకు రావాలని, ఉన్నత విద్యలను అభ్యసించాలని, రాజకీయంగా అభివృద్ధి చెందాలని పిలుపు ఇచ్చారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో భాగస్వామ్యం చేసినందుకు ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఆదివాసుల యొక్క ప్రస్తుత పరిస్థితులు ఏ విధంగా అంతరించిపోతున్నాయో ఉన్న రిజర్వేషన్ ఫలాలు మొత్తం చట్టబద్ధతలేని లంబాడాలు దోచుకుంటున్నారని ఆరోపించారు. భవిష్యత్తులో బలమైన ఉద్యమాల ద్వారా మాత్రమే పోరాటం చేయాలని రాజకీయాలకు అతీతంగా జాతి కోసం అందరూ ఐక్యంగా ముందుకు రావాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంస్కృతి సాంప్రదాయాలు విగ్రహావిష్కరణ వంటి కార్యక్రమాల ద్వారా ఐకమత్యంగా ముందుకు వచ్చి మన యొక్క భాషను సంస్కృతి సాంప్రదాయాలను కాపాడాలని తెలియజేశారు. ఆధార్ సొసైటీ జాతీయ నాయకులు పోడియం బాలరాజు గారు మాట్లాడుతూ ఆదివాసి ఉద్యమాలకు ఊపిరి అయినటువంటి భద్రాద్రి గడ్డపై మారుమూల గ్రామంలో విగ్రహావిష్కరణ చేయడం చాలా సంతోషకరమైన తెలియజేశారు ఈ కార్యక్రమంలో వివిధ ఆదివాసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగినది చుట్టుప్రక్కల నుంచి అనేకమంది ఆదివాసులు ఈ కార్యక్రమంలో పాల్గొని విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం



చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు సోయం సత్యనారాయణ, వాసం రామకృష్ణ దొర, పాయం సత్యనారాయణ,పొడియం నరేంద్ర, దశరథ్, కోటేశ్వరరావు, పూనెం వీరభద్రం, అరం ప్రశాంత్, స్థానిక పంచాయతీ వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు దొర పటేల్, పూజారులు, వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేశారని గ్రామ సర్పంచ్ కీసర శోభ తెలియజేశారు. గ్రామ సర్పంచ్ శోభ మాట్లాడుతూ తాను సర్పంచ్ గా గెలిచిన తర్వాత అందరి సహాయ సహకారాలతోటి ఆదివాసి ఐక్యతను నిలిపే విధంగా గ్రామస్తులు అందరితో కలిసి ఈ యొక్క విగ్రహావిష్కరణ కార్యక్రమం చేయడం జరిగిందని సర్పంచ్ తెలియజేశారు. ముడియం పొట్టయ్య, సోయం లక్ష్మయ్య గ్రామ పెద్ద, సోయం వీరభద్రం పూజారి,సోయం శ్రీను, సోడి శ్రీరాములు, సోయం రామారావు, వార్డు మెంబర్స్ కాకా రాములమ్మ, కోర్స్ లక్ష్మి, కొమరం ప్రకాశ్, కొమరం వెంకటేష్, గ్రామ యూత్ గ్రామ కమిటీల సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయటం జరిగిందని కార్యక్రమ సమన్వయ నాయకులు జాతీయ ఆదివాసి తెగల సమన్వయకర్త సోయంకన్నా రాజు తెలియజేశారు.



# రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఆలస్యం...ఇబ్బందుల్లో ఉద్యోగులు

## - రాష్ట్రపతి, సుప్రీంకోర్టుకు రిటైర్డ్ ఉద్యోగుల సామూహిక వినతి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, ఏప్రిల్ 15 : తెలంగాణ రాష్ట్రంలో రిటైర్ అయిన ప్రభుత్వ ఉద్యోగులకు 2024 మార్చి నుంచి ఇప్పటివరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెండింగ్‌లో ఉన్న ఈ బకాయిల కారణంగా ఆర్థికంగా ఇబ్బందులు పెరిగి, వివిధ కారణాలతో సుమారు 90 మంది రిటైర్డ్ ఉద్యోగులు మృతి చెందినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రిటైర్డ్ ఉద్యోగులకు అండగా నిలుస్తున్న బక్క జడ్సన్ సూచన మేరకు బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బాధితులు సామూహికంగా చర్యలకు దిగారు. కొత్తగూడెం పోస్టాఫీసు ద్వారా భారత రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు రిజిస్టార్‌కు స్పీడ్ పోస్టు ద్వారా లేఖలు పంపించారు. ఈ లేఖల్లో తమ సమస్యలను, ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను, వెంటనే రిటైర్మెంట్ బెనిఫిట్స్ విడుదల చేయాలనే డిమాండును వివరంగా తెలియజేశారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వారు కోరారు.



# శ్రీ వేంకటేశ్వర స్వామి గుట్టపై రహదారి నిర్మాణం కోసం ప్రజాసదస్సు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, ఏప్రిల్ 15 : భద్రాద్రి జిల్లా పాల్వంచ పట్టణంలోని శ్రీనివాస కాలనీలో ఉన్న శ్రీనివాసగిరి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం గుట్టపైకి వెళ్లేందుకు భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రహదారి నిర్మాణం కోసం ప్రజాసదస్సు నిర్వహించారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 8వ డివిజన్‌లో బుధవారం జరిగిన ఈ సమావేశానికి డిప్యూటీ మేయర్, 8వ డివిజన్ కార్పొరేటర్ సిరివరపు లలిత కుమారి అధ్యక్షత వహించారు. సమావేశంలో డివిజన్‌కు చెందిన ప్రముఖులు, స్థానిక నాయకులు, వివిధ కాలనీల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జమ్ముల సీతారామరెడ్డి మాట్లాడుతూ, అటవీ హక్కుల చట్టం 2006 (ఎఫ్ఆర్ఏ) సెక్షన్ 3(2)(1) ప్రకారం ప్రజా అవసరాల దృష్ట్యా అటవీ భూమిని మార్పిడి చేసి గుట్టపైకి రహదారి నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ ప్రతిపాదనకు కాంపెల్లి కనకేష్, చల్లగుండ్ల వీరభద్రం తదితరులు మద్దతు తెలిపారు. తదనంతరం ఈ తీర్మానాన్ని సభాధ్యక్షురాలు సిరివరపు లలిత కుమారి సభ ఆమోదానికి పెట్టగా, సమావేశానికి హాజరైన వారందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. భక్తుల సౌకర్యార్థం వెంటనే రహదారి నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అటవీ శాఖ అధికారులు సహకరించాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. భక్తులు గుట్టపైకి వెళ్లేందుకు సౌకర్యవంతమైన మార్గం కల్పించాలనే ఉద్దేశంతో అన్ని వర్గాల ప్రజలు, నాయకులు ఏకమై ఈ సమస్య పరిష్కారానికి ముందుకు రావడం అభినందనీయమని డిప్యూటీ మేయర్ సిరివరపు లలిత కుమారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఆమె ధన్యవాదాలు తెలిపారు.

# రామగుండం తాసిల్దారుగా జే సునీత నియామకం

## జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



రామగుండం, ఏప్రిల్ 15 : రామగుండం తాసిల్దార్‌గా జే.సునీతను నియమిస్తూ బుధవారం పెద్దపెల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారిక ఉత్తర్వులను జారీ చేశారు. దీంతో రామగుండం తహసిల్ కార్యాలయంలో రెవిన్యూ పరమైన అన్ని సమస్యలు పరి ష్కారం కావడంతో పాటు ప్రజలకు ఎదురైన ఆటంకాలు తొలగిపోయాయి. ప్రజలు ప్రజాసంఘాలు పలు పార్టీలు తహసిల్ కార్యాలయంలో స్తంభించిన విషయాన్ని రామగుం డం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ దృష్టికి తీసుకుపోవడంతో స్పందించి రామగుండం కార్యాలయంలో నూతన తాసిల్దార్ జె సునీతతో పాటు లాంగ్‌లీవ్‌లో ఉన్న ఇతర ఉద్యో గులను సైతం రప్పించి రెవెన్యూ పరిపాలన సేవలను అందించడం పట్ల ప్రజలు అభినంది స్తున్నారు.

# అందరి సౌకర్యం కోసం కూరగాయల మార్కెట్

## సద్వినియోగం చేసుకోవాలి : సర్పంచ్ రవికుమార్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



రామగుండం, ఏప్రిల్ 15 : నిత్యం నిత్యావసర సరుకులు కూరగాయల కోసం ఇబ్బంది పడుతున్న ప్రజలకు అన్ని అందుబాటులో తేవాలనే లక్ష్యంతోనే మన గ్రామంలో ప్రతి బుధవారం కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేస్తున్నామని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అంతర్గాం టీఎస్ సర్పంచ్ అంగోత్ రవికుమార్ కోరారు. బుధవారం అంతర్గాం మండల కేంద్రంలో రామాలయం గ్రౌండ్‌లో వారసంతను ప్రారంభించి మాట్లాడారు. నిత్యం అవసరమే కాకుండా ఏదైనా శుభకార్యాలు ఇతర కార్యక్రమాలు జరిపేందుకు కూరగాయలు నిత్యవసర సరుకులు కావాలంటే గోదావరిఖని మంచిర్యాల లాంటి ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకోవడం ఆర్థిక భారంగా మారిందని, అందుకే మన ఊరిలోనే ప్రతి వార వారం అన్ని అందుబాటులో ఉండేందుకు ఈ మార్కెట్ను ఏర్పాటు చేసుకున్నామని అందరూ సహకరించి ఉపయోగించుకోవాలని సర్పంచ్ రవికుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ తిరుపతి, ఉప సర్పంచ్ ఉష, పంచాయితీ పాలకవర్గం వ్యాపారులు పాల్గొన్నారు.

# హిందూ సమ్మేళనం విజయవంతం చేయాలి

## - ఉత్సవ సమితి అధ్యక్షుడు కుమార్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ములుగు, ఏప్రిల్ 15 : ములుగు జిల్లా కేంద్రంలో ఈనెల 18న నిర్వహించనున్న హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని హిందూ బంధువులందరూ తరలిరావాలని ఉత్సవ సమితి అధ్యక్షుడు గంద్రకోట కుమార్ పిలుపునిచ్చారు. ఈమేరకు బుధవారం ములుగులో హనుమాన్ జెండాలతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సుమారు 550 బైకులతో డీఎల్ఆర్ గార్డెన్ నుంచి మొదలుకొని 20వార్డుల్లో శోభాయాత్ర నిర్వహించగా అందులో 200లమంది హనుమాన్ మాలధారణ భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ 18న జరిగే హిందూ సమేళనంలో ములుగు ప్రాంతానికి చెందిన ప్రతీ ఒక్కరూ విధిగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి శ్రీశ్రీశ్రీ కమలానంద భారతీ స్వామీజీ, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఆలె శ్యాంజీలు హాజరు కానున్నారన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.



# ఇంటర్ ఫలితాల్లో ఖని విద్యార్థుల ప్రతిభ

## అభినందించిన ప్రిన్సిపాల్ దాసరి కల్పన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని) ఏప్రిల్ 15 : 2026 సంవత్సరం మార్చిలో నిర్వహించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కుల సాధించిన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులను పెద్దపల్లి జిల్లా నోడల్ అధికారి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ దాసరి కల్పన బుధవారం సత్కరించి, అభినందలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే విద్యా సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న మధ్యాహ్న భోజన పథకం అల్పాహారానికి సంబంధించి విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, బాగా చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని, చదువు చెప్పిన అధ్యాపకులకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు., బాణాసంచా కాల్చి సంబరాలు కాలేజీలో చేసుకున్నారు ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినిలు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. నూకల చంద్రమౌళి, సోతుకు ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



# పాల్వంచ అయ్యప్ప స్వామి దేవాలయంలో పూజలు, అన్నదానం

## - అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన కొత్వాల

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, ఏప్రిల్ 15 : కేరళ రాష్ట్రంలో ఉగాదిగా జరుపుకొనే విషు పర్వదినం సందర్భంగా భద్రాద్రి జిల్లా పాల్వంచ అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు, భక్తులకు అన్నదానం చేశారు. దేవాలయం పూజారి బృందావనం నర్సింహ మూర్తి ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు జరిపారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. అన్నదానం కార్యక్రమాన్ని పూజల్లో పాల్గొన్న దేవస్థానం కమిటీ చైర్మన్, రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కనగాల రాంబాబు, కాల్వ భాస్కరరావు, బేతంశెట్టి వెంకట్, మారుతి నాగేశ్వరరావు, మారెడ్డి రామారావు, రామాచారి, రాజశేఖర్, చారి, తదితరులు పాల్గొన్నారు.



# నారిశక్తి అభియాన్ లో సంధ్యారాణి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, ఏప్రిల్ 15 : హైదరాబాదులో 'నారి శక్తి అభియాన్-కార్యక్రమంలో బుధవారం రామగుండం బిజెపి ఇంచార్జి మాజీ జెడ్పిటిసి కందుల సంధ్యారాణి పోచం పాల్గొన్నారు. బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి ఆధ్వర్యంలో కేశవ్ మెమోరియల్ కాలేజీ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించగా బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు జండా ఊపి ప్రారంభించారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి మహిళా సోదరీమణు లను మోసం చేసే కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నారని రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ఎండ కట్టారని రామగుండం బిజెపి ఇన్చార్జి కందులసంధ్యారాణి పోచం పేర్కొన్నారు. ఇలాంటి నీతి మాలిన రాజకీయాలను మానుకొని మహిళల అభివృద్ధి సంక్షేమానికి తోడ్పడాలని సూచించారని అన్నారు. ఈ కార్యక్రమంలో సంధ్యరాణి పోచం తో పాటు అంతర్గాం మండల బిజెపి అధ్యక్షుడు బోడకుంట సుభాష్, మెరుగు నరేష్, గుండెబోయిన భూమయ్య, శిలారపు కళ్యాణ్, బూడిద హర్ష తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రీ గ్రాడ్యుయేషన్ డే అండ్ ఫేర్వెల్ పార్టీ వేడుకలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, ఏప్రిల్ 15 : ఎంపీపీఎస్ పోరుమల్ల మండలం మేడిపల్లిలో యూకేజీ పూర్తి చేసిన విద్యార్థులకు బుధవారం ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం జరిగింది. అనంతరం ఐదవ తరగతి పూర్తి చేసిన వారికి నాలుగో తరగతి విద్యార్థులచే ఫేర్వెల్ పార్టీ ఆటపాటలతో ఆనందోత్సవాల మధ్య జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.సురేందర్ తో పాటు గ్రామ సర్పంచ్ గుయ్య అంజన్న, మండల సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీధర్ రెడ్డి, మండల విద్యాధికారి లక్ష్మీనరసయ్య, మేడిపల్లి మండల కాంప్లెక్స్ హెడ్మాస్టర్ హమీద్, భూమ రెడ్డి, తోటి తిరుపతి రెడ్డి, డాక్టర్ మురళి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, పోషకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు సురేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు పిల్లల్ని చేర్పించాలని తెలిపారు. సర్పంచ్ గుయ్య అంజన్న మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఎప్పుడు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మండల విద్యాధికారి, ఎస్సై చేతుల మీదుగా బడిబాట పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఎస్సై శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతిని ఉపాధ్యాయుల కృషిని కొనియాడారు. అదేవిధంగా పేరెంట్స్ అందరు కూడా తమ పిల్లల నడవడికపై ఒక కన్నేసి ఉంచాలని వారిని సక్రమమైన మార్గంలో నడిపే బాధ్యత తీసుకోవాలని కోరారు. చివరగా పాఠశాల విద్యార్థులతో అధికారు లు అందరూ కలిసి సహపంక్తి భోజనం చేసి కార్యక్రమాన్ని ఘనంగా ముగించారు.

# వేసవి తీవ్రతలో వృద్ధులు అప్రమత్తంగా ఉండాలి

## ఆళవందార్ వేణు మాధవ్ పిలుపు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 15 : వేసవి తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని డెమొక్రటిక్ సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ విజ్ఞప్తి చేశారు. అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో వృద్ధుల్లో వడదెబ్బ, డీహైడ్రేషన్ వంటి సమస్యలు ఎక్కువగా ఎదురయ్యే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఆయన ఒక ప్రకటన తెలిపారు. వృద్ధుల శరీరానికి తాపాన్ని తట్టుకునే సామర్థ్యం తక్కువగా ఉండటం వల్ల వేడి కాలంలో వారు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య బయటకు వెళ్లడం తగ్గించాలని, అత్యవసరమైతే తప్ప ఆ సమయాల్లో ఇంటి బయటకు రావద్దని సూచించారు. బయటకు వెళ్లాల్సి వస్తే తలకు టోపీ లేదా గుడ్డ కప్పుకోవడం, తగినంత నీరు వెంట తీసుకెళ్లడం అవసరమని తెలిపారు. రోజుకు కనీసం 3 నుంచి 4 లీటర్ల వరకు నీరు తీసుకోవడం ద్వారా శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవాలని, తరచూ మజ్జిగ, కొబ్బరి నీరు, నిమ్మరసం, పండ్లరసాలు వంటి ద్రవాలను తీసుకోవాలని సూచించారు. ఇవి శరీర ఉష్ణోగ్రతను తగ్గించడంలో సహాయపడతాయని చెప్పారు. వేపుడు పదార్థాలు,మసాలాఅధికంగా ఉండే ఆహారాన్ని తగ్గించి, తేలికపాటి, సులభంగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవడం మంచిదని పేర్కొన్నారు. అలాగే తేలికపాటి కాటన్ దుస్తులు ధరించడం, గాలి సరిగా ఆడే ప్రదేశాల్లో ఉండడం, ఇంట్లో చల్లని వాతావరణం కల్పించడం వంటి జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. వృద్ధులు




ఎక్కువసేపు ఎండలో ఉండకుండా, అలసటకు లోనుకాకుండా విశ్రాంతి తీసుకో వడం అవసరమని అన్నారు. బీపీ, షుగర్, గుండె సంబంధిత వ్యాధులు వంటి దీర్ఘకాలిక సమస్యల తో బాధపడుతున్న వృద్ధులు తమ మందులను సమయానికి తీసుకోవడం అత్యంత కీలకమని, వైద్యుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. తల తిరగడం, ఎక్కువగా చెమటలు పడటం, వాంతులు, బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప వైద్యుడిని సంప్రదించాలని హెచ్చరించారు. కుటుంబ సభ్యులు వృద్ధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారికి తగిన ఆహారం, నీరు, విశ్రాంతి లభిస్తున్నాయా అనే విషయాన్ని నిరంతరం గమనించాలని కోరారు. వృద్ధులు ఒంటరిగా ఉంటే వారిని తరచూ పరామర్శించడం, అవసరమైన సహాయం అందించడం కుటుంబ సభ్యుల బాధ్యత అని తెలిపారు. అదేవిధంగా, ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు కూడా వృద్ధుల సంక్షేమం కోసం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, గ్రామాలు, పట్టణాల్లో చల్లని తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. "వృద్ధుల ఆరోగ్యం కాపాడటం మన అందరి సామాజిక బాధ్యత. చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తే పెద్ద ప్రమాదాలను నివారించవచ్చు" అని ఆళవందార్ వేణు మాధవ్ తెలిపారు.

# ప్రవేశ పరిక్షల ఉచిత కోచింగ్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ హరిత



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాగజ్‌నగర్, ఏప్రిల్ 15 : కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 10 వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు పాలిసెట్, గురుకులాల ప్రవేశ పరిక్ష కొరకు ఇస్తున్న కోచింగ్ ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హరిత అన్నారు. బుదవారం కాగజ్ నగర్ పట్టణంలోని డివిజన్ లో విద్యా వనరుల కేంద్రంలో పాఠశాల విద్యా శాఖ, ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోచింగ్ కేంద్రాన్ని కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ద శుక్లా, జిల్లా విద్యా శాఖ అధికారి లలిత, తో కలిసి కలెక్టర్ హరిత సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాల విద్యా శాఖ,ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 10 వ తరగతి పూర్తీ చేసిన విద్యార్థులకు పాలిటెక్నిక్ కళాశాలలో, ప్రభుత్వ గురుకుల కళాశాలలో ప్రవేశాల కొరకు విద్యార్థులకు ప్రవేశ పరిక్షల కొరకు శిక్షణ యివ్వడం అభినంద నియమని కలెక్టర్ అన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివి శిక్షణ పొంది పాలిటెక్నిక్, ప్రభుత్వ గురుకులా కళాశాలలో సీటు పొంది తమ భవిస్యత్తును బంగారు భవిష్యత్తుగా మలుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమములో విద్యాశాఖ అధికారులు,శిక్షకులు,విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని జిల్లా ప్రజ పరిషత్ బాలుర పాఠశాలను జిల్లా విద్యా శాఖ అధికారి లలిత తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఈ పాఠశాలలో మాడల్ పాఠశాల ఏర్పాటుకు గల సాధ్య సాద్యాలను అధికారులతో కలిసి పరిశీలించారు. త్వరగా నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమములో విద్యాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాది కూలీలు ,పని ప్రదేశంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి :జిల్లా కలెక్టర్ హరిత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, ఏప్రిల్ 15: జిల్లాలోని జాతీయ గ్రామీణ ఉపాది హామీ పథకంలో పని చేసే కూలీలు పని ప్రదేశం లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ హరిత అన్నారు. బుదవారం ఆసిఫాబాద్ మండలంలోని ఎల్లారం గ్రామ పంచాయతి పరిదిలోని కంచర్ గూడా గ్రామములో నిర్వహిస్తున్న ఉపాది హామీ పని ప్రదేశాన్ని జిల్లా గ్రామీణాభివృద్ది అధికారి దత్తారావు తో కలిసి కలెక్టర్ హరిత సందర్శించి ఉపాది హామీ కూలీలకు అంబలి, ఓ ఆర్ ఎస్, ప్యాకెట్లను పంపిణి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాది హామీ పథకంలో పని చేసే కూలీలు ఎండ తీవ్రత పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తలకు తప్పని సరిగా వేడి గాలులు చెవులలో రాకుండా రుమాలు తలకు చుట్టుకోవాలన్నారు. పని ప్రదేశంలో



త్రాగు నీరు, నీడ, ఓ ఆర్ ఎస్, ప్యాకెట్లు అందుబాటులో వుండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి పనిని త్వరగా పూర్తీ చేసి ఇంటికి చేరుకోవలన్నారు. ఉదయం 10 గంటల నుండి మద్యాహ్నం 3 గంటల సమయములో బయటకు వెళ్ళకూడదన్నారు. వేడి గాలుల పట్ల రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమములో ఈ జి ఎస్ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# జోనల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై కమిషనర్ సృజన సమీక్ష



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

శేరిలింగంపల్లి, ఏప్రిల్ 15 : శేరిలింగంపల్లి జోన్ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారంపై సిఎంసి కమిషనర్ జి.సృజన బుధవారం జోనల్ కార్యాలయంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, యూబీడీ, యూసీడీ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం కొనసాగుతున్న పనులన్నింటినీ '99 రోజుల ప్రోగ్రాం'లో భాగంగా జూన్ 2అ, 2026 లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. కనీసం 190 పనులను ఈ గడువులోగా పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించామని తెలిపారు. జోన్‌లోని అన్ని రోడ్లకు ఎండ్-టు-ఎండ్ కార్పెటింగ్ చేయాలని, ఎక్కడా గుంతలు లేకుండా జూన్ 2 లోపు మరమ్మతులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అలాగే రోడ్లపై ఉన్న ఆక్రమణలను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉం చుకుని ఏప్రిల్ చివరి నాటికి జోన్ అంతటా పూడికతీత పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వీధి దీపాల సమస్యలపై అసిస్టెంట్ ఇంజనీర్లు తక్షణమే స్పందించాలని, ప్రజల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. క్రీడా ప్రాంగణాలు, పార్కులు, కమ్యూనిటీ హాళ్లు వంటి ప్రభుత్వ ఆస్తుల పూర్తి సమాచారాన్ని సేకరించాలని, ఖాళీ స్థలాలకు 10 రోజుల్లోపు హద్దులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపు మే చివరి నాటికి పూర్తి కావాలని, దోమల నివారణకు ప్రతి 10 రోజులకు ఒకసారి ప్రతి ప్రాంతంలో ఫాగింగ్/స్ప్రేయింగ్ జరిగేలా షెడ్యూల్ రూపొందించాలని తెలిపారు. అలాగే జంక్షన్ల సుందరీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఇందుకోసం కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యత నిధులను వినియోగించుకోవాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా, విభాగాల మధ్య సమన్వయంతో పనిచేస్తూ లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రతి వారం సమీక్షా సమావేశాలు నిర్వహిస్తామని కమిషనర్ పేర్కొన్నారు.

# కేటీపీఎస్ నుంచి మున్సిపల్ కార్పొరేషన్‌కు పన్నుల చెక్కు అందజేత



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, ఏప్రిల్ 15: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచలో కేటీపీఎస్‌కు సంబంధించిన ఇంటి, స్థల పన్నుల చెక్కును బుధవారం మున్సిపల్ కమిషనర్ సుజాతకు అందజేశారు. గత సంవత్సరానికి సంబంధించిన రూ.36,54,146 పన్ను మొత్తాన్ని 4వ డివిజన్ కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి, కేటీపీఎస్ అధికారులు కలిసి కమిషనర్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో కేటీపీఎస్ సివిల్ ఏడీఈ బి. శ్రీను, ఏడీఈ దీపిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, కేటీపీఎస్ కాలనీ నుంచి పన్నులు వసూలు చేస్తున్నప్పటికీ, అక్కడ తగిన పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదని పేర్కొన్నారు. ఇకపై కాలనీలో పారిశుద్ధ్య కార్యక్రమాలు, పార్కుల నిర్వహణ, మొక్కల పెంపకం వంటి చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా కాలనీలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని సూచిస్తూ, ఇది చిన్నారులు, యువత, పెద్దవారికి ఆరోగ్యపరంగా ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ విషయంపై కమిషనర్ సుజాత సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ తెలిపారు.

# అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి

## - సీఎం మేడిగడ్డ పర్యటన ఏర్పాట్ల పరిశీలనలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్-భూపాలపల్లి, ఏప్రిల్ 15 : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడిగడ్డ పర్యటన నేపథ్యంలో ఈ నెల 20న నిర్వహించనున్న బహిరంగ సభ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ బుధవారం పరిశీలించారు. కాటారం మండలం నస్తూర్‌పల్లిలో నిర్వహించనున్న సభకు సంబంధించి వేదిక నిర్మాణం, పార్కింగ్ సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, ప్రజ లకు అవసరమైన మౌలిక సదుపాయాలను అధికారులు సమీక్షిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సభకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సమగ్ర ఏర్పాట్లు చేయాలని సూచిం చారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో బాబు, కాటారం డీఎస్పీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# చెక్కులు పంపిణి చేసిన ఎమ్మెల్యే కోవలక్ష్మి

(ప్రజాలక్ష్యం బ్యూరో)

ఆసిఫాబాద్, ఏప్రిల్ 15 : జిల్లాలోని ఆసిఫాబాద్ నియోజకవర్గ పరిధిలోని రెండు మండలాల్లో పర్యటించి లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఆసిఫాబాద్ మండలం ఎంపీడీఓ కార్యాలయంలో 132 మందికి, రెబ్బన మండలం తహసీల్దార్ కార్యాలయంలో 99 మందికి రెండు మండలాల లబ్ధిదారులకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి చెక్కులను అందజేసారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్, రెబ్బన మండలాల ప్రజాప్రతి నిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# దళిత రత్న అవార్డు అందుకున్న చిప్పకుర్తి ఐలయ్య

(ప్రజాలక్ష్యం బ్యూరో)



మంచిర్యాల ఏప్రిల్ 15 : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా మంగళవారం సాయంత్రం హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఘనంగా జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ వేడుకలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు మరియు ట్రాన్స్‌జెండర్స్ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆదేశాల మేరకు, మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ కో-చైర్మన దొమ్మడి సుదర్శన్ బాపు చేతుల మీదుగా "దళిత రత్న" అవార్డు ప్రదానం చేయబడింది. ఈ అవార్డును షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు చిప్పకుర్తి ఐలయ్య అందుకున్నారు. సమాజ సేవా కార్యక్రమాలను గుర్తించి తనపై నమ్మకం ఉంచి ఈ గౌరవాన్ని అందించిన మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ కో-చైర్మన్ మరియు షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు దొమ్మడి సుదర్శన్ బాబు కి ఐలయ్య కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



# 'మామ' అంటూ పిలిచే లింగారెడ్డి లేరు

## భావోద్వేగంతో కన్నీటి పర్యంతమైన శ్రీహరి రావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, ఏప్రిల్ 15 : మామడ మండలంలో ఏనుగు లింగారెడ్డికి అశ్రునయనాల మధ్య వీడ్కోలు పలికారు. నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్‌గా సేవలందించిన ఆయన అంతిమ యాత్ర న్యూ సాంగ్వీలో వేలాదిమంది నడుమ సాగింది. మాజీ డీసీసీ అధ్యక్షుడు, నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కూచాడి శ్రీహరిరావు పార్థివదేహానికి నివాళులర్పించి పాడె మోశారు. రాజకీయాలకు అతీతంగా నేతలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనతో ఉన్న అనుబంధాన్ని స్మరించారు.

# ఇంటర్ విద్యార్థిని సన్మానించిన జేఏసీ కన్వీనర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



లక్సెట్టిపేట, ఏప్రిల్ 15 : ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో చదివి ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించిన దండేపల్లి మండలం గూడెం గ్రామానికి చెందిన విద్యార్థిని అక్కల సాయి త్రినీత ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాలలో 470 మార్కులకు గాను 468 సాధించిం ది. ఈ సందర్భంగా లక్షెటిపేట నియోజకవర్గ సాధన సమితి జేఏసీ కన్వీనర్ చుంచు రాజ్ కిరణ్ ఆధ్వర్యంలో త్రీనితను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ భవిష్యత్ లో మరెన్నో అత్యుత్తమ ఫలితాలు సాధించి పుట్టిన గ్రామానికి, మన నియోజకవర్గానికి, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతం నుండి వచ్చి, ప్రభుత్వ విద్యా సంస్థలో చదువుతూ ఇంతటి ఉత్తమ ఫలితాలు సాధించడం పట్ల వారు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# ఆరోగ్యం



## ఓట్స్ అధికంగా తింటే అనర్థాలు.. జాగ్రత్త!

ఓట్స్... చాలామంది ప్రతిరోజూ ఓట్స్ తింటూ ఉంటారు. ఓట్స్ తో మంచి ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని భావిస్తారు. ఓట్స్ లో విటమిన్ బి2, విటమిన్ సి, పీచు పదార్థం, పిండి పదార్థాలు, మాంసకృత్తులు ఎక్కువగా ఉంటాయి. ఓట్స్ చాలా మంచి పౌష్టికాహారంగా చెప్పవచ్చు.

**అతిగా ఓట్స్ తింటే అనర్థాలు**

ఇక ఓట్స్ తింటే ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి అన్నమాట ఎంత వాస్తవమో అతిగా తింటే అనారోగ్యం కూడా వస్తుంది అనే విషయం అంతే వాస్తవం. ఇక ఓట్స్ తినడం వల్ల కలిగే అనారోగ్యాలు, మన శరీరానికి కలిగే నష్టాలు ఏమిటో ప్రస్తుతం తెలుసుకుందాం.ఓట్స్ అతిగా తినడం వల్ల అనేక అనారోగ్యాలు వస్తాయి. అధికంగా ఓట్స్ తిన్న వారిలో కొంతమందికి కడుపు ఉబ్బరం మరియు గ్యాస్ వంటి సమస్యలు వస్తాయి.

**అధికంగా ఓట్స్ తింటే ఆరోగ్య సమస్యలు**

ఓట్స్ జీర్ణ సమస్యలకు కారణమవుతుంది. అందుకే ఓట్స్ అధికంగా తినడం మంచిదికాదు. ఓట్స్ లోని ఫైటిక్ యాసిడ్ క్యాల్షియం ,ఇనుము మరియు జింక్ వంటి కొన్ని ఖనిజాల శోషణను నిరోధిస్తుంది. ఓట్స్ అధికంగా తిన్నవారు మలబద్ధకం వంటి సమస్యలతో ఇబ్బంది పడతారు. కొంతమందికి ఓట్స్ లో ఉండే ప్రోటీన్ కారణంగా అలర్జీలు వచ్చే ప్రమాదం ఉంది.

**ఓట్స్ పదేపదే తింటే ఇన్ఫెక్షన్స్**

ఓట్స్ ను సరిగ్గా శుభ్రం చేయకపోతే, అవి తిన్నవారికి బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్స్ వచ్చే ప్రమాదం లేకపోలేదు. పోషకాలు బాగా ఉంటాయని అతిగా ఓట్స్ తినడం వల్ల బరువు పెరిగే ప్రమాదం ఉంటుంది. ఓట్స్ ప్రతిరోజు తీసుకోవడం వల్ల చాలామందిలో కడుపుకు సంబంధించిన సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఓట్స్ ఎక్కువగా తినడం వల్ల వాటిలో క్యాలరీలు తక్కువగా ఉండటం కారణంగా మన శరీరంలో కూడా క్యాలరీల లోపం ఏర్పడే అవకాశం ఉంది.

మితంగా తింటే ఆరోగ్యం కాబట్టి ఓట్స్ ను తినాలి అని అనుకుంటే ఒక నియమిత పద్ధతిలో తినడం మంచిది. ప్రతిరోజు బ్రేక్ ఫాస్ట్ గా ఓట్స్ మాత్రమే తినడం మంచిది కాదు. ఆరోగ్యానికి మేలు చేకూర్చే ఓట్స్ అధికంగా తింటే కొన్ని దుష్ప్రభావాలు వస్తాయనే విషయాన్ని గుర్తుంచుకొని తదనుగుణంగా మితంగా తింటే మంచిది.

## పాలక్ కోకోనట్ రైస్..తక్కువ టైంలో ఎక్కువ రుచి..ఎలా చేసుకోవాలంటే



పాలక్ కోకోనట్ రైస్ రైస్ ఒక సుగంధభరితమైన, రుచికరమైన వంటకం. ఇది పాలకూర, కొబ్బరి పాల కలయికతో ప్రత్యేకమైన రుచిని కలిగి ఉంటుంది. ఇది లంచ్ బాక్స్ ల్లోకి, తేలికపాటి భోజనానికి లేదా ప్రత్యేక సందర్భాలలో వడ్డించడానికి కూడా చాలా బాగుంటుంది. దీనిని తయారు చేయడం చాలా సులభం, తక్కువ సమయంలోనే సిద్ధం చేసుకోవచ్చు. పాలక్ కోకోనట్ రైస్ తయారీకి కావాల్సిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి. పాలక్ కోకోనట్ రైస్ తయారీకి కావాల్సిన పదార్థాలు -బాస్మతి బియ్యం - 2 కప్పులు -పాలకూర - 2 కప్పులు -కొబ్బరి పాలు - 1.5 కప్పులు -ఉల్లిపాయ - 1 పెద్దది -పచ్చిమిర్చి - 2-3 -అల్లం వెల్లుల్లి పేస్ట్ - 1 టేబుల్ స్పూన్ -ఆవాలు - 1 టీ స్పూన్ -జీలకర్ర - 1/2 టీ స్పూన్ -మినపప్పు - 1/2 టీ స్పూన్ -శనగపప్పు - 1/2 టీ స్పూన్ -ఎండుమిర్చి - 2 -కరివేపాకు - 1 రెమ్మ -నూనె లేదా నెయ్యి - 2 టేబుల్ స్పూన్లు -పసుపు - 1/4 టీ స్పూన్ -ఉప్పు - రుచికి సరిపడా -కొత్తిమీర - గార్నిష్ కోసం -జీడిపప్పు - 1 టేబుల్ స్పూన్ -నిమ్మరసం - కొన్ని చుక్కలు.

తయారీ విధానం -ముందుగా బాస్మతి బియ్యాన్ని 2-3 సార్లు శుభ్రంగా కడిగి అరగంటసేపు నీటిలో నానబెట్టండి. -తర్వాత పాలకూరను శుభ్రంగా కడిగి సన్నగా తరిగి పక్కన పెట్టుకోండి. మీరు కావాలనుకుంటే పాలకూరను కొద్దిగా ఉడికించి లేదా ఆవిరిలో మగ్గించి కూడా ఉపయోగించవచ్చు. -ఇప్పుడు ఉల్లిపాయను సన్నగా తరుగుకోండి. పచ్చిమిర్చిని మధ్యకు చీల్చండి. అల్లం,వెల్లుల్లిని మెత్తని పేస్ట్‌లా చేసుకోవాలి. ఎండుమిర్చిని చిన్న ముక్కలుగా తుంచుకోండి. -స్టవ్ మీద ఒక మందపాటి అడుగు కలిగిన గిన్నె లేదా కుక్కర్ పెట్టి అందులో నూనె లేదా నెయ్యి వేసి వేడి చేయండి. నూనె వేడెక్కిన తర్వాత ఆవాలు వేసి చిటపటలాడనివ్వండి. తర్వాత జీలకర్ర, మినపప్పు, శనగపప్పు వేసి అవి కొద్దిగా రంగు మారే వరకు వేయించండి. ఇప్పుడు ఎండుమిర్చి,కరివేపాకు వేసి వేయించండి. తర్వాత సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు వేసి అవి బంగారు రంగులోకి వచ్చే వరకు వేయించాలి. -ఉల్లిపాయలు వేగిన తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి ఒక నిమిషం పాటు పచ్చి వాసన పోయే వరకు వేయించాలి. ఇప్పుడు ఇందులో తరిగిన పాలకూర వేసి 2-3 నిమిషాలు లేదా అది మెత్తబడే వరకు ఉడికించాలి. -పాలకూర మగ్గిన తర్వాత కొబ్బరి పాలు పోయాలి. తర్వాత నానబెట్టిన బియ్యంలోని నీటిని వడగట్టి బియ్యం వేయాలి. పసుపు, రుచికి సరిపడా ఉప్పు వేసి బాగా కలపండి. -గిన్నెకు మూత పెట్టి లేదా కుక్కర్ మూత పెట్టి మీడియం మంట మీద ఉడికించాలి. మీరు గిన్నెలో ఉడికిస్తుంటే నీరు పూర్తిగా ఇంకిపోయి అన్నం మెత్తగా ఉడికే వరకు ఉడికించాలి. ఇది సుమారు 15-20 నిమిషాలు పట్టవచ్చు. మీరు కుక్కర్ లో ఉడికిస్తుంటే 2 విజిల్స్ వచ్చే వరకు ఉడికించి తర్వాత స్టవ్ ఆఫ్ చేయండి. ప్రెజర్ పూర్తిగా తగ్గిన తర్వాత మూత తీయండి. -అన్నం ఉడికిన తర్వాత ఒకసారి మెల్లగా కలపండి. సన్నగా తరిగిన కొత్తిమీర, వేయించిన జీడిపప్పు పలుకులతో గార్నిష్ చేయండి. కావాలనుకుంటే కొద్దిగా నిమ్మరసం పిండితే మరింత రుచిగా ఉంటుంది. -పాలక్ కొబ్బరి అన్నం వేడి వేడిగా రైతా, పెరుగు లేదా ఏదైనా కూరతో కలిపి తింటే చాలా రుచిగా ఉంటుంది.

## రాగి పిండితో హెల్దీ బన్ దోశలు..

### పీకలదాకా తిన్నా ఇంకోటి కావాలంటారు..ఎలా చేయాలంటే




మన ఆరోగ్యం మొత్తం దాదాపు మనం తీసుకునే ఆహారంపైనే ఆధారపడి ఉంటుంది. కరోనా తర్వాత నుంచి అధికశాతం మంది తమ ఆరోగ్యంపై ఎక్కువ ఫోకస్ పెడుతూ హెల్దీ ఫుడ్ తీసుకుంటున్నారు. హెల్దీ ఫుడ్స్ లో రాగి పిండితో చేసే బన్ దోశలు కూడా ఒకటి. సాధారణంగా పొద్దున్నే పూరీ,బోండా,ఇడ్లీ,బియ్యం పిండితో దోశ వంటివి మనం తింటుంటాం. అయితే ఇవి కాకుండా పొద్దున్నే రాగిపిండితో చేసే హెల్దీ బన్ దోశలు ఓ సారి టేస్ట్ చేసి చూడండి..అస్సలు వదలిపెట్టరు. అంత రుచిగా ఉంటాయి..అంతేకాకుండా ఆరోగ్యానికి చాలా మేలు జరుగుతుంది. రాగి పిండిలో ఐరన్, కాల్షియం, ఫైబర్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అలాంటి రాగి పిండితో హెల్దీ బన్ దోశలు ఎలా తయారుచేసుకోవాలో ఇక్కడ చూడండి. రాగి పిండితో బన్ దోశలు తయారీకి కావాల్సిన పదార్థాలు -రాగి పిండి -బొంబాయి రవ్వ -పెరుగు -నీళ్లు -ఆవాలు -జీలకర్ర -కరివేపాకు -ఆయిల్ -ఇంగువ -పచ్చిమిర్చి. రాగి పిండితో బన్ దోశలు తయారీ విధానం -రాగి బన్ దోశలు తయారుచేయడం కోసం ముందుగా ఒక పెద్ద బౌల్ తీసుకొని అందులో అరకప్పు బొంబాయి రవ్వ, 1 కప్పు రాగి పిండి, 1 కప్పు పెరుగు వేసి మొత్తం కలిసేలా కలుపుకున్నాక ఇందులో అరకప్పు నీళ్లు పోసి బాగా కలిపి 10 నిమిషాలు పక్కనపెట్టేయాలి. -10 నిమిషాలు నానిన తర్వాత ఈ పిండిని మిక్సీ గిన్నెలో వేసి నీళ్లు ఏమీ వేయకుండానే దోశ పిండిలా గ్రైండ్ చేసుకోవాలి. ఈ పిండిని గిన్నెలోకి తీసుకొని పక్కన పెట్టుకోండి. -ఇప్పుడు స్టవ్ మీద బాండీ పెట్టి అందులో ఒకటిన్నర స్పూన్ ఆయిల్ వేడి చేసి ఇందులో కొద్దిగా ఆవాలు,జీలకర్ర వేసి అవి చిటపటలాడిన తర్వాత కొద్దిగా ఇంగువ వేసి కలిపాక 2 పచ్చిమిర్చి తరుగు,కొద్దిగా కరివేపాకు వేసి ఫ్రై అయ్యాక ఇందులో చిన్నగా కట్ చేసిన 1 టమాటో ముక్కలు వేసి అవి కొంచెం మెత్తబడేదాకా ఫ్రై చేసి స్టవ్ ఆఫ్ చేసేయండి.ఈ తాళింపుని ముందుగా రెడీ చేసుకున్న పిండిలో వేసేయాలి. ఇందులోనే సన్నగా కట్ చేసిన 2 ఉల్లియాల ముక్కలు, కొత్తిమీర తరుగు,రుచికి తగినట్లుగా ఉప్పు, కొద్దిగా వంటసోడా వేసి పిండిలో అన్నీ బాగా కలిసేలా కలుపుకోవాలి. - ఇప్పుడు స్టవ్ మీద చిన్న బాండీ పెట్టి అందులో కొంచెం ఆయిల్ వేసి దానిమీద పెద్ద గరిట పిండిని వేసుకొని ఒకవేపు కాలిన తర్వాత తిప్పుకొని దానిని రెండోవైపు కాల్చి దించేయాలి. అంతే రాగి బన్ దోశలు రెడీ. దీనిని మీకు నచ్చిన చట్నీతో కలిపి తింటే నోట్లో బ్లాస్టే.

## ఇది తినని మనిషి జన్మ ఎందుకు..

### మన పూర్వీకుల ఎనర్జీకి కారణం ఇదే..ఎలా చేసుకోవాలంటే



మీరెప్పుడైనా రాగిపిండి, సగ్గుబియ్యం కిచిడి తిన్నారా? సూపర్ టేస్ట్ ఉంటుంది. ఈ కిచిడి ఒక పోషకవైన,తేలికగా జీర్ణమయ్యే ఆహారం. రాగిలో ఐరన్, కాల్షియం,ఫైబర్ పుష్కలంగా ఉంటాయి..సగ్గు బియ్యం తక్షణ శక్తిని అందిస్తాయి. ఈ రెండింటి కలయికతో తయారైన కిచిడి రుచికరమైనది మాత్రమే కాకుండా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. రాగిపిండి సగ్గుబియ్యం కిచిడిని మీ ఇంట్లోనే సింపుల్ గా తయారుచేసుకోడానికి కావలసిన పదార్థాలు,తయారీ విధానం ఇక్కడ చూడండి.

రాగిపిండి సగ్గుబియ్యం కిచిడి తయారీకి కావలసిన పదార్థాలు -పెసరపప్పు -సగ్గుబియ్యం -రాగిపిండి -మిరియాలు -జీడిపప్పు -పచ్చిమిర్చి -నెయ్యి -అల్లం -పసుపు -క్యారెట్ -ఉల్లిపాయ -టమాటో -వెల్లుల్లి -జీలకర్ర -కరివేపాకు

రాగిపిండి సగ్గుబియ్యం కిచిడి తయారీ విధానం -ముందుగా ఓ ప్రెజర్ కుక్కర్ లో శుభ్రంగా కడిగిన అరకప్పు పెసరపప్పు, అరకప్పు సగ్గు బియ్యం, 4 పచ్చిమిర్చి ముక్కలు, 1 టమాటో పెద్ద ముక్కలు, 1 ఉల్లిపాయ పెద్ద ముక్కలు, 1 క్యారెట్ ముక్కలు,కొన్ని అల్లం ముక్కలు, పొట్టు తీసిన 2 వెల్లుల్లి రెబ్బలు, 10-15 మిరియాలు, చిటికెడు పసుపు వేయాలి. ఇందులో ముక్కలు మునిగేదాకా నీళ్లు పోసి కలిపి మూతపెట్టి స్టవ్ మీద పెట్టాలి. -రెండు విజిల్స్ వచ్చాక స్టవ్ ఆఫ్ చేసేయండి. ప్రెజర్ అంతా పోయిన తర్వాత కుక్కర్ మూత తీసి ఉడికిన పప్పుని గుత్తితో మెత్తగా మాష్ చేసుకోవాలి. -తర్వాత మళ్లీ స్టవ్ ఆన్ చేసి అది ఉడకనివ్వాలి. ఉడికే సమయంలోనే అందులో అరకప్పు రాగిపిండి ఉండల్లేకుండా బాగా కలపుతూ మంటను సిమ్ లో పెట్టి ఉడికించుకోవాలి.

10 నిమిషాలు రాగిపిండిని అందులో బాగా ఉడికించుకున్నాక రుచికి సరిపడా ఉప్పు వేసి కలిపి దగ్గరపడేదాకా ఉడికించుకోవాలి. -తర్వాత స్టవ్ మీద బాండీ పెట్టి అందులో 2-3 స్పూన్ల నెయ్యి వేడి చేశాక జీడిపప్పు,మిరియాలు వేసి ఫ్రై చేసుకోవాలి. -జీడిపప్పు వేగిన తర్వాత కరివేపాకు,జీలకర్ర వేసి వేయించుకొని తర్వాత ఈ తాళింపు మొత్తాన్ని ముందుగా ఉడికించిన కిచిడిలో వేసి కలుపుకోవాలి. ఇందులో అరచెక్క నిమ్మరసం పిండి బాగా కలుపుకోవాలి. అంతే రాగి పిండి సగ్గుబియ్యం కిచిడి రెడీ.

# సినిమా న్యూస్



## 3000 కోట్లతో ఇండియన్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర!



భారతీయ చలనచిత్ర పరిశ్రమ బాక్సాఫీస్ చరిత్రలో అద్భుతమైన మైలురాయి నమోదైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ధురంధర్( రెండు భాగాలు కలిపి) ఫ్రాంచైజీ సరికొత్త రికార్డును సృష్టించింది. ప్రపంచవ్యాప్తంగా 3,000 కోట్ల గ్రాస్ వసూళ్లను సాధించిన మొట్టమొదటి భారతీయ ఫిల్మ్ ఫ్రాంచైజీగా ధురంధర్ అవతరించింది. ఈ ఘనతతో భారతీయ సినిమా స్థాయిని అంతర్జాతీయ వేదికపై మరో మెట్టు ఎక్కించడమే కాక ఇండియన్ సినిమా మార్కెట్ పరిధిని ప్రపంచ స్థాయికి విస్తరించింది. ఇప్పటి వరకు ఇండియన్ బాక్సాఫీస్ వద్ద దంగల్, బాహుబలి, పుష్ప వంటి చిత్రాలు సృష్టించిన రికార్డులే అత్యున్నతమైనవిగా భావించేవారు. కానీ ధురంధర్ ప్రభంజనం ముందు ఆ రికార్డులన్నీ కనుమరుగయ్యాయి. రాజమౌళి బాహుబలి ఫ్రాంచైజీ సాధించిన వసూళ్లను, సుకుమార్ పుష్ప ఫ్రాంచైజీ, అమీర్ ఖాన్ దంగల్ చైనాలో సృష్టించిన సంచలనాన్ని ఈ చిత్రం అధిగమించింది. ఒకే సిరీస్ నుండి వచ్చిన చిత్రాలు ఇంతటి భారీ మొత్తాన్ని రాబట్టడం భారతీయ సినీ చరిత్రలో ఇదే తొలిసారి.ధురంధర్ ఈ స్థాయి విజయాన్ని అందుకోవడానికి కేవలం స్వదేశీ మార్కెట్ మాత్రమే కాకుండా అంతర్జాతీయ మార్కెట్ కూడా ప్రధాన కారణమైంది. ఉత్తర అమెరికా, యూరప్ తో పాటు పలు దేశాలతో పాటు ఆసియా మార్కెట్లలో ఈ చిత్రం కనీవినీ ఎరుగని రీతిలో వసూళ్లను రాబట్టింది. భారతీయ యాక్షన్ సినిమాలకు గ్లోబల్ ఆడియన్స్‌లో ఉన్న క్రేజ్‌ను ఈ ఫ్రాంచైజీ విజయవంతంగా వాడుకుంది. హాలీవుడ్ యాక్షన్ సినిమాలకు ధీటుగా రూపొందిన విజువల్స్ , కథనం ప్రేక్షకులను థియేటర్లకు పరుగులు తీయించాయి. భారీ బడ్జెట్, పక్కా ప్లానింగ్, క్వాలిటీ కంటెంట్ ఉంటే భారతీయ మార్కెట్ స్థాయి 3000 కోట్లు కూడా దాటగలదని ఈ చిత్రం నిరూపించింది. ఇది రాబోయే కాలంలో మరిన్ని భారీ ప్రాజెక్టులకు స్ఫూర్తిగా నిలవనుంది. ఈ విజయంలో యువ హీరోల పాత్ర విస్మరించలేనిది. రణవీర్ సింగ్ వంటి నటుల అంకితభావం , ఆదిత్య ధర్ దర్శకత్వ ప్రతిభ తోడవ్వడంతో ఇలాంటి అద్భుతం సాధ్యమైంది. ఖాన్ త్రయం దశాబ్దాల పాటు ఏలిన బాక్సాఫీస్ రికార్డులను యువతరం తమదైన శైలిలో తిరగరాస్తోంది. సాంకేతిక నిపుణుల కృషి, అత్యాధునిక విజువల్ ఎఫెక్ట్స్ ప్రేక్షకులను మెప్పించే కథాంశం వెరసి ధురంధర్-ను ఓ బ్రాండ్‌గా మార్చాయి. ప్రపంచ సినిమా యవనికపై భారతీయ చిత్రాలు కూడా హాలీవుడ్ స్థాయి వసూళ్లను సాధించగలవని -ధురంధర్ ఫ్రాంచైజీ నిరూపించింది. ఈ రికార్డు భవిష్యత్తులో మన దర్శకులకు, నిర్మాతలకు మరింత బాధ్యతను, ఉత్సాహాన్ని ఇస్తుందనడంలో సందేహం లేదు. ధురంధర్ సృష్టించిన ఈ బాక్సాఫీస్ హిస్టరీ మున్ముందు మరిన్ని చిత్రాలకు దిక్సూచిలా మారనుంది.

## కియారా ఆ రిస్క్ చేస్తుందా?



పాన్ ఇండియా లెవల్‌లో భారీ అంచనాల మధ్య తెరకెక్కుతున్న టాక్సిక్ సినిమా ఇప్పుడు కేవలం కంటెంట్ వల్లే కాదు, కాంట్రవర్సీ వల్ల కూడా చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా కియారా అద్వానీ చుట్టూ తిరుగుతున్న ఓ బోల్డ్ సీన్ వివాదం ఇండస్ట్రీలో పెద్ద డిబేట్‌కు దారి తీసింది. ఇప్పటివరకు గ్లామర్ పాత్రల్లో కనిపించినా, ఎప్పుడూ ఒక లిమిట్‌లోనే ఉన్న కియారా, ఈసారి కథ డిమాండ్ మేరకు ఓ సాహసోపేత సన్నివేశంలో నటించిందనే టాక్ వినిపిస్తోంది. అయితే ఫైనల్ అవుట్‌పుట్ చూసిన తర్వాత, ఆ సీన్ తన పబ్లిక్ ఇమేజ్‌పై ప్రభావం చూపుతుందేమోనని ఆమె ఆందోళన చెందుతూ, దాన్ని తొలగించాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. పెళ్లి తర్వాత హీరోయిన్‌గా తీసుకునే నిర్ణయాల్లో మార్పు వస్తుందా అనే ప్రశ్న కూడా ఈ సందర్భంలో ముందుకు వచ్చింది. పెళ్లి తర్వాత పబ్లిక్ పర్సెప్షన్‌పై ఎక్కువ శ్రద్ధ పెట్టడం సహజమనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇదే టైమ్ లో డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ తన కథకు ఆ సీన్ కీలకమని భావిస్తే, హీరోయిన్ కంఫర్ట్ కూడా అంతే ముఖ్యమని మరో వర్గం చెబుతోంది. దీంతో క్రియేటివ్ ఫ్రీడమ్, నటీనటుల వ్యక్తిగత ఇమేజ్ మధ్య ఉన్న సున్నితమైన సమతౌల్యం మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది. అయితే ఈ మొత్తం వ్యవహారంలో అసలు హైలైట్ అవుతున్నది బజ్ మరియు రిస్క్. ఒకవేళ ఆ సీన్‌ను సినిమాలో ఉంచితే, రిలీజ్‌కు ముందే భారీ పబ్లిసిటీ రావడం ఖాయం. సోషల్ మీడియాలో ట్రెండింగ్, డిబేట్లు, కాంట్రవర్సీలు.. అన్నీ కలిసి సినిమాకు ఫ్రీ హైప్ తెచ్చే అవకాశం ఉంది. కానీ అదే సమయంలో నెగిటివ్ ట్రోలింగ్, విమర్శలు, ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి వచ్చే రియాక్షన్ కూడా పెద్ద రిస్క్‌గా మారొచ్చు. ఈ హైప్ సినిమాకి ప్లస్ అవుతుందా? లేక అసలు కథను మింగేస్తుందా? అనే ప్రశ్న ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇంకా యష్ లాంటి పాన్ ఇండియా స్టార్ ఈ ప్రాజెక్ట్‌లో ఉండటం వల్ల ఈ వివాదం ప్రభావం మరింత పెరిగే అవకాశం ఉంది. దీనిపై ఫ్యాన్స్ ఎలా రియాక్ట్ అవుతారు? సినిమా మీద అంచనాలు పెరుగుతాయా? లేక ఈ కాంట్రవర్సీ నెగటివ్‌గా మారుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు, హీరోయిన్స్‌పై ఇప్పటికీ ఇమేజ్ ప్రెజర్ ఉందా? బోల్డ్ సీన్స్ విషయంలో డబుల్ స్టాండర్డ్స్ ఉన్నాయా? అనే ఫెమినిస్టు చర్చలు కూడా తెరపైకి వస్తున్నాయి. మొత్తానికి, ఈ ఒక సీన్ చుట్టూ తిరుగుతున్న చర్చ ఇప్పుడు కేవలం ఓ సినిమా విషయాన్ని దాటి, ఇండస్ట్రీలోని పెద్ద ప్రశ్నలను లేవనెత్తుతోంది. చివరికి డైరెక్టర్, హీరోయిన్ కలిసి ఏ నిర్ణయం తీసుకుంటారు? బజ్ కోసం రిస్క్ తీసుకుంటారా? లేక సేఫ్ గేమ్ ఆడతారా? అన్నది చూడాలి.

## చిరంజీవి- మోహన్ బాబు.. టైటిల్స్ విషయంలో అంత జరిగిందా?



టాలీవుడ్ సీనియర్ నటులు చిరంజీవి, మోహన్ బాబు మధ్య ఉన్న అనుబంధం ఎప్పుడూ చర్చనీయాంశమే. స్నేహితులుగా కనిపించినా, పోటీ, అభిప్రాయ భేదాలు వచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే వీరిద్దరి మధ్య జరిగిన కొన్ని సంఘటనలు ఇప్పటికీ ఇండస్ట్రీలో ఆసక్తికరంగా చెప్పుకుంటుంటారు. ఇటీవల సీనియర్ రచయిత, దర్శకుడు కానగల జయకుమార్ ఒక ఇంటర్వ్యూలో పాత జ్ఞాపకాన్ని పంచుకున్నారు. ముఖ్యంగా 1981లో విడుదలైన కిరాయి రౌడీలు సినిమా సమయంలో జరిగిన ఓ ఘటనను వివరించారు.

ఈ చిత్రానికి క్రాంతి కుమార్ నిర్మాతగా వ్యవహరించగా, ఇందులో చిరంజీవి, మోహన్ బాబు, రాధిక ప్రధాన పాత్రలు పోషించారు. సినిమా చివరి పనులు జరుగుతున్న సమయంలో ఒక ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చిందని జయకుమార్ తెలిపారు. ఒక రోజు నిర్మాత క్రాంతి కుమార్ ఆఫీస్ కు వెళ్లినప్పుడు, 'ఏంటి ఎన్ని సార్లు కాల్ చేశారు?' అని అన్నారని, అది ఎవరి గురించి అని అడిగితే మోహన్ బాబు గురించి అని చెప్పారట. అసలు విషయం ఏమిటో తెలుసుకోవాలని జయకుమార్ ను మోహన్ బాబు ఇంటికి వెళ్లమని సూచించారట. దీంతో జయకుమార్ మోహన్ బాబు ఇంటికి వెళ్లగా.. ఆయన నేరుగా టైటిల్స్ గురించి మాట్లాడారట. 'చిరంజీవి కంటే నేను సీనియర్.. కాబట్టి నా పేరు ముందుగా వేయాలి' అని మోహన్ బాబు చెప్పారని వెల్లడించారు. దీనిపై జయకుమార్ నిర్మాతతో మాట్లాడతానని చెప్పగా.. 'నువ్వే టైటిల్స్ రాస్తున్నావు కాబట్టి.. నా పేరు ముందే రాయాలి' అని మోహన్ బాబు స్పష్టం చేశారని తెలిపారు. ఈ విషయాన్ని తిరిగి నిర్మాత క్రాంతి కుమార్ కు చెప్పగా.. అప్పుడు ఆయన కొంచెం అసహనం వ్యక్తం చేశారట. 'మనమే డబ్బులు పెట్టి సినిమా తీస్తుంటే.. వాళ్ళు చెప్పినట్టు టైటిల్స్ మార్చాలా?' అని ప్రశ్నించారట. అయితే ఈ విషయంలో ఎవరినీ నొప్పించకుండా ఎలా పరిష్కరించాలనే దానిపై క్రాంతి కుమార్ చాలా ఆలోచించారని జయకుమార్ తెలిపారు.

చివరికి ఒక నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. టైటిల్స్ లో ముందుగా మోహన్ బాబు పేరు వేయగా.. చివర్లో చిరంజీవి పేరును ప్రత్యేకంగా హైలైట్ చేసేలా ప్రదర్శించారట. ఈ విధంగా ఇద్దరు నటుల గౌరవాన్ని కాపాడేలా టైటిల్స్ డిజైన్ చేసినట్లు వివరించారు. ఆ సంఘటన చూస్తే.. ఆ కాలంలో కూడా స్టార్ హీరోల మధ్య టైటిల్స్ వంటి విషయాలు ఎంత ప్రాధాన్యం కలిగి ఉన్నాయో అర్థమవుతుంది. అదే సమయంలో నిర్మాతలు, టెక్నీషియన్లు ఇలాంటి పరిస్థితులు ఎల హ్యాండిల్ చేసేవారో కూడా తెలుస్తుంది. మొత్తంగా చూస్తే.. చిరంజీవి, మోహన్ బాబు మధ్య ఉన్న అనుబంధం కేవలం స్నేహంతో మాత్రమే కాకుండా.. పోటీ, ప్రొఫెషనల్ ఎక్స్పీరియన్స్, అప్పుడప్పుడు వచ్చిన విభేదాలతో కూడుకుని ఉందని మరోసారి అర్థమవుతోంది.

## ఆ టైటిల్ పెడితే 112 కోట్లు కట్టమన్నారట



హ్యాట్రిక్ వంద కోట్ల సినిమాలతో సెన్సేషన్ క్రియేట్ చేసిన తమిళ యువ కథానాయకుడు ప్రదీప్ రంగనాథన్ నుంచి ఇటీవలే వచ్చిన లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ అంచనాలను అందుకోలేకపోయిన సంగతి తెలిసిందే. ప్రదీప్‌కు ఉన్న క్రేజ్ వల్ల ఈ చిత్రానికి ఒక మోస్తరుగా ఓపెనింగ్స్ వచ్చాయి కానీ.. వీకెండ్ తర్వాత సినిమా నిలబడలేకపోయింది. ప్రస్తుతం తమిళంలో వసూళ్లు ఒక మాదిరిగా ఉండగా.. తెలుగులో మాత్రం సినిమా పరిస్థితి ఆశాజనకంగా లేదు. ఐతే తమిళంలో సినిమాను పుష్ చేసేందుకు దర్శకుడు విఘ్నేష్ శివన్ గట్టి ప్రయత్నమే చేస్తున్నాడు. ప్రమోషన్లలో భాగంగా ఇంటర్వ్యూలు ఇస్తున్నాడు. ఒక ఇంటర్వ్యూలో అతను సినిమాకు సంబంధించి షాకింగ్ విషయాలు కొన్ని వెల్లడించాడు. ఈ సినిమాను షార్ట్‌గా ఎల్ఐకే అని టైటిల్ పెట్టాడు విఘ్నేష్. ఐతే ముందు ఈ చిత్రానికి ఎల్ఐసీ అని పేరు పెడదామని అనుకున్నాడట. కానీ ఎల్ఐసీ సంస్థను ఇందుకోసం సంప్రదిస్తే.. రూ.112 కోట్లు కట్టమని అడిగిందట. అన్ని డబ్బులు ఉంటే ఒక భారీ సినిమానే తీసుకోవచ్చనే ఉద్దేశంతో వెనక్కి తగ్గి.. కంపెనీ స్పెలింగ్ మార్చుకుని ఎల్ఐకే అనే టైటిల్ పెట్టుకున్నట్లు విఘ్నేష్ శివన్ వెల్లడించాడు. ఇక లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ చిత్రాన్ని ముందు కమల్ హాసన్ సంస్థ రాజ్ కమల్ ఇంటర్నేషనల్‌లో చేయాల్సిందని.. బడ్జెట్ కూడా రూ.210 కోట్లతో ప్లాన్ చేశామని.. కానీ ఆ సంస్థ వెనక్కి తగ్గడంతో వేరే ప్రొడక్షన్ హౌస్ ముందుకు వచ్చిందని.. చివరికి ఆ సంస్థ కూడా వెనక్కి వెళ్లిపోవడంతో బడ్జెట్‌ను తగ్గించుకోవాల్సి వచ్చిందని విఘ్నేష్ వెల్లడించాడు. చివరిగా లలిత్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మించడానికి ముందుకు వచ్చాడని.. మధ్యలో అతను కూడా ఫైనాన్స్ తేవడంలో ఇబ్బందులు ఎదుర్కోవడంతో తన భార్య నయనతార రంగంలోకి దిగిందని.. అంతిమంగా సినిమా బడ్జెట్ రూ.100 కోట్ల లోపుకే తగ్గించామని విఘ్నేష్ వెల్లడించాడు. మూకుత్తి అమ్మన్-2 సినిమాకు గాను తనకు వచ్చిన అడ్వాన్సును నయన్ ఈ సినిమా ప్రొడక్షన్ కోసం ఇచ్చిందని.. రాజీ లేకుండా సినిమాను పూర్తి చేయమని చెప్పడంతో అనుకున్నట్లుగా సినిమా తీయగలిగామని విఘ్నేష్ తెలిపాడు.



# రహదారుల నియమాలు పాటిస్తే ప్రమాదాలను నివారించ వచ్చు

## జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, ఏప్రిల్ 15 : రహదారి నియమాలు పాటిస్తూ వాహనదారులు బాధ్యతతో వాహనాలు నడిపితే రహదారి ప్రమాదాలను సమర్థవంతంగా నివారించవచ్చు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. మనోహరాబాద్ మండలంలోని కాలకల్ లో జరిగిన "అరయ్-ఆలైవ్" కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఐ జీ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావులు పాల్గొన్నారు.డ్రైవర్స్ కు ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కల్పించి,డ్రైవర్లకు పలు కంటి పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఐ జీ చంద్ర శేఖర్ రెడ్డి మాట్లాడుతూ..ట్రాఫిక్ నిబంధనల పట్ల బాధ్యతాయుత ప్రవర్తనను ప్రజలు అలవాటు చేసుకోవాలనీ,తూప్రాన్ కాలకాల్ గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఘనంగా చిల్డ్రన్స్ రోడ్ సేఫ్టీ డే జరపాలని, 4 సంవత్సరాలు పైబడిన వయసు కలిగిన పిల్లలకు సైతం వాహనాలపై తీసుకెళ్ళే సమయంలో వారికి కూడా హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పక ధరించాల్సిన ఆవశ్యకత గురించి తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. మైనర్ లు వాహనాలు నడపకూడదని, డ్రంకెన్ డ్రైవ్, ఓవర్ స్పీడ్ వంటి వాటి గురించి విస్తృత ప్రచారం నిర్వహిస్తూ, ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అన్నారు. స్కూల్ బస్సులు ఫిట్ నెస్ కలిగి ఉండేలా చూడాలన్నారు.జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..ట్రాఫిక్ రూల్స్ పాటించాలని,వాహన చోదకులు హెల్మెట్ తప్పక తీసుకోవాలన్నారు.రోడ్డుపై ప్రయాణించేటపుడు ఎదుటి వారి అజగ్రత్తలను కూడా గమనించి ప్రయాణించాలన్నారు.జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ..రోడ్డు ప్రమాదాలను నివారించాలనీ,ప్రతి సం; దాదాపు 7000 ప్రమాదాలు జరుగుతున్నాయని,జాగ్రత్తలే ప్రమాదాల నివారణకు మార్గమన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ పై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జయా చంద్రారెడ్డి, డీఎస్పీలు,స్థానిక సర్పంచ్, ఉప సర్పంచ్,అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్ కార్యక్రమం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, ఏప్రిల్ 15 : జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం పోతారం పీఎం శ్రీ ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు, తెలంగాణ, హర్యానా సంస్కృతులను ప్రతిబింబించే ఆహార పదార్థాలు, వేషధారణ నృత్యాలు, పండుగలు, చారిత్రక కట్టడాలు, ముఖ్యమైన ప్రముఖుల అంశాలపై ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థుల్లో చిన్నతనం నుండే భిన్నత్వంలో ఏకత్వంపై అవగాహన కల్పించేందుకు, సంప్రదాయాలను గౌరవిస్తూ విద్యార్థులలో ఐక్యత భావాన్ని పెంపొందించేందుకు ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల విద్యాధికారి లోకిని శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ శ్రీమతి ధర్మపురి స్వప్న జలంధర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్ పర్సన్ శ్రీమతి పులి శిరీష హరిప్రసాద్ లు కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటి కార్యక్రమాలు జరగడం అభినందనీయం అని అన్నారు. పిల్లలు చక్కగా తెలంగాణ, హర్యానా సాంస్కృతిక సాంప్రదాయాలు వేషధారణను వివరించడం వారి భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడుతుందని, వేషధారణ చాలా బాగుందని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే చిన్నారులకు ఉచితంగా దుస్తులు అల్పాహారం భోజనాలు పుస్తకాలు అందిస్తుందని ప్రభుత్వ పాఠశాలలో నమోదు పెంచాలని కోరారు. గ్రామ సర్పంచ్ మాట్లాడు తూ ఇలాంటి విభిన్న మైన కార్యక్రమాలు పిల్లల్లో పాఠశాల పట్ల ఇష్టాన్ని పెంచుతాయని తెలిపారు.



పాఠశాలకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. మాజీ ఎంపీటీసీ మాట్లాడుతూ పిల్లలు చక్కటి ప్రదర్శనలు ఇచ్చారని భిన్నత్వంలో ఏకత్వం లాంటి భావన చిన్నప్పటినుండే అలవడుతుందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు అతిథుల చేతుల మీదుగా స్టేషనరీ ఐటమ్స్ బహుమతులుగా అందించడం జరిగింది. ఈ వినూత్న కార్యక్రమం నిర్వహించిన పాఠశాల సిబ్బందిని గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తో పాటు ఏఏపిసి చైర్మన్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్ పర్సన్ శ్రీమతి పులి శిరీష హరిప్రసాద్, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ కిషన్ రావు, ఎస్ఎంసీ మాజీ చైర్ పర్సన్ పులి హరిప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం, సిఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది, గ్రామ పెద్దలు నరేందర్, గ్రామ వీవోఏలు పాల్గొన్నారు.

# జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ కొరత లేదు - ఇంటి వద్దకే సరఫరా : జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సంగారెడ్డి, ఏప్రిల్ 15 : జిల్లాలో ఎల్పీజీ వంట గ్యాస్ కొరత లేదని, ప్రతి ఇంటికీ గ్యాస్ సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా అందించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ఎల్పిజి సరఫరా మానిటరింగ్ కమిటీ సమీక్ష సమావేశాన్ని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి లతో కలిసి నిర్వహించారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ, పోలీస్ శాఖల అధికారులు, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ... జిల్లాలో కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన వంట గ్యాస్‌ను ఇంటి వద్దకే సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో గ్యాస్ సరఫరా పరిస్థితిపై వివరాలు తెలుసుకున్న కలెక్టర్,. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలకు గ్యాస్ కొరత రాకుండా నిరా+ సరఫరా కొనసాగించాలని సూచించారు. గ్యాస్ పంపిణీలో అక్రమాలు జరగకుండా విజిలెన్స్ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి, అక్రమ నిల్వలపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. డిమాండ్‌కు అనుగుణంగా సరిపడా స్టాక్‌ను నిర్వహించడంతో పాటు అదనంగా 15 శాతం నిల్వలను కచ్చితంగా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అలాగే గ్యాస్ ఏజెన్సీలు అవసరమైన స్టాక్‌ను



ముందుగానే సమకూర్చుకుని, వినియోగదారుల నిజమైన బుకింగ్‌లను కచ్చితంగా పరిశీలించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుని ఇంటింటికీ వంట గ్యాస్ సరఫరా జరిగేలా అధికారులు కట్టుదిట్ట మైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఏం సివిల్ సప్లై అంబదాస్ రాజేశ్వర్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి (ఇంచార్జ్) రాజేశ్వర్, రవాణా శాఖ అధికారిణి అరుణ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి జగదీష్, డిఎల్ఏంఓ ఏం.అనిల్ కుమార్, ఎల్పిజి గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు పి.ప్రతాప్ రెడ్డి, జె.మురళీధర్ రెడ్డి, వై.వినోద్ కుమార్, పోలీస్ శాఖ అధికారులు, సివిల్ సప్లై సిబ్బంది పాల్గొన్నారు..

# మహిళా నర్సింగ్ కళాశాల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

## సీపీఎం జిల్లా కార్యదర్శి కె.నర్సమ్మ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, ఏప్రిల్ 15 : మెదక్ నర్సింగ్ కాలేజీలో మెడికల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.నర్సమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెడికల్ నర్సింగ్ కళాశాలలో మెడికల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పై ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే.మంచినీటి, మురుగు నీటి కాలువలు, లివింగ్ రూములు సదుపాయాలు వంటి సమస్యలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలను ప్రిన్సిపాల్ పరిష్కరించకుండా ఉంటే ఉండండి వెళ్తే వెళ్ళండి అని దొరుసుగా మాట్లాడడం కరెక్ట్ కాదని మండిపడ్డారు. పేషెంట్లకు సేవలు అందిస్తూ ఆరోగ్యం సూత్రాలు తెలియజేసే నర్సమ్మ లకే ఆరోగ్య పద్ధతులు పాటించకపోతే వారు ఏ విధంగా సేవలు అందిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలో ఉన్న విద్యార్థులకు అన్యాయం జరుగుతున్న,విద్యార్థులకు సరైన సదుపాయాలు లేకపోయినా అధికారులు ఎందుకు స్పందించడం లేదని ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. నర్సింగ్ మహిళ విద్యార్థిని లందరూ మహిళలు వారి ఆరోగ్య పరిస్థితులను వారికి అందించాల్సిన మెనూ ప్రకారం భోజనాన్ని అందించాల్సిన బాధ్యత సంబంధిత ప్రిన్సిపాల్ గారిది ఏర్పాట్లు, సదుపాయాలు మంచినీటి, సౌకర్యం,మరుగుదొడ్లు 120 మంది మహిళా విద్యార్థులు ఉన్నచోట ఒకటి రెండు మాత్రమే పని చేస్తే ఏ విధంగా వారు తమ అవసరాలను తీర్చుకుంటారని వారు ఏ విధంగా పేషెంట్లకు సేవలు అందించడానికి సకాలంలో వైద్య సేవలకు వెళ్తారని ప్రశ్నించారు.ఇంత జరుగుతున్నప్పటికీ కళాశాలకు బాధ్యత వహిస్తున్న ప్రిన్సిపల్ గారు నిర్లక్ష్య ధోరణితో సమస్యలు బయటపడినప్పటికీ తమ వైఖరి మార్చుకోకుండా దురుసగా మాట్లాడడం కరెక్ట్ కాదన్నారు. మెడికల్ కళాశాల విద్యార్థులకు సరిపడ బాత్రూంలను రిపేరు చేయించాలని,పడుకోవడానికి సదుపాయాలు మంచినీరు, మురుగునీటి సమస్య పరిష్కరించాలని విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఆయిల్ పామ్‌పై అవగాహన క్షేత్ర సందర్శన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 15 : ఉద్యానవన మరియు పట్టు పరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో కురవి గ్రామంలో బుధవారం ఆయిల్ పామ్‌పై అవగాహన, క్షేత్ర సందర్శనను మేక వెంకట్ రెడ్డి ఆయిల్ పామ్ తోటలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మెన్ మహబూబాబాద్ నల్ల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ వరి, ప్రత్తి, మిరప, మొక్క జొన్న పంటలకు బదులుగా రైతులు పంట మార్పిడి ద్వారా లాభదాయకమైన పంటలను సాగు చేయాలని తెలిపారు.మార్కెట్ డిమాండ్ ఉన్న ఆయిల్ పామ్ అన్ని రకాల కూరగాయలు,పండ్లు, మునగ, ఉల్లి, వెల్లుల్లి, పూలు, మల్బరీ మొదలైన పంటలు సాగు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మెన్,మహబూబాబాద్ నల్ల సుధాకర్ రెడ్డి, అభ్యుదయ రైతుల అమృత హస్తాలతో పంట మార్పిడి ద్వారా ఆయిల్ పామ్, మల్బరీ సాగుపై కరపత్రాలు, డైరీలు ఆవిష్కరించరు. రైతులను ఉద్దేశించి జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న మాట్లాడుతూ ప్రభుత్వ రాయితీలు,కూరగాయల పందిళ్ళు, మల్చింగ్, కోల్డ్ రూమ్స్, నిల్వ గిడ్డంగులు, షేడ్ నెట్ హౌస్లు, ఆయిల్ పామ్ రాయితీ, మార్కెటింగ్ వసతులు, మల్బరీ



రాయితీలు పొందాలని తెలిపినారు.రైతులు నీటి భూసార పరీక్షలు చేయించుకోవాలి,ప్రకృతి సేద్యం అవలంభించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన పరిశోదన స్థానం శాస్త్రవేత్తలు ప్రశాంత్, ఎల్.సుహాసిని, వ్యవసాయ అధికారి నరసింహా రావు, ఉద్యాన అధికారులు ఆర్.శాంతి ప్రియ, ఎ.జే.శాంతి ప్రియదర్శిని, వ్యవసాయ విస్తరణ అధికారి రాజేశ్వరి, ఉద్యాన విస్తరణ అధికారి టి. విజయపాల్ రెడ్డి, రమేష్ ఆయిల్ ఫెడ్ విస్తరణ అధికారి కె.రంజిత్, ఆయిల్ ఫెడ్ మానిటరింగ్ అధికారి కె.రంజిత్, బిందు సేద్య ఇంజనీర్ కిషోర్,బిందు సేద్య ప్రతినిధి బి.అశోక్, జి.ప్రసాద్ బాబు, బి.అశోక్, ఆగస్టిన్, అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.



# మెదక్ విద్యుత్ డివిజన్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలతో ఆర్టిజన్ల నిరవధిక సమ్మె

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, ఏప్రిల్ 15 : విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మెదక్ విద్యుత్ డివిజన్ కార్యాలయం ముందు ఎనిమిదవ రోజైన బుధవారం తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టివిఏఈ జెఏసి) పిలుపు మేరకు ఆర్టిజన్లు నల్ల బ్యాడ్జీలతో నిరవధిక సమ్మె నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్టిజన్లకు ఏపిఎస్ఈబి సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలని,2026 పిఆర్సి,మెడికల్ లీవులు,సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు.గ్రేడ్ చేంజ్,పీస్ రేటు కార్మికులకు,అన్ మ్యాన్ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.పోల్ టు పోల్ కార్మికులకు న్యాయం చేయాలన్నారు. వినియోగదారులకు 24గంటలు నిరంతరా యంగా విద్యుత్ అందిస్తున్నా,తాము మాత్రం చాలీ చాలని జీతాలతో పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం,విద్యుత్ యాజమాన్యం కల్పించుకుని వారికి రావాల్సిన న్యాయ పరమైన అన్ని హక్కులను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మహిళా ఆర్టిజన్లు సుమలత, జ్యోతి,ప్రణీత,నాగమణి, జెఏసి నాయకులు జంగం శరత్,పృథ్వీ గౌడ్,ప్రదీప్ గౌడ్, శ్రీశైలం,శ్రీనివాస్,బి.చంద్ర భానప్ప, బి.సంపత్ కుమార్,పాపయ్యాల రమేష్, సంగమేశ్వరరెడ్డి,నాగరాజు, వెంకటచారీ,రాజుగౌడ్, మొగులయ్యా,బుస్ససత్యం గుప్తా,పోలశ్రీనివాస్,రమావత్ హరినాయక్, రమావత్ గోపాల్ నాయక్, రమావత్ పూల్య నాయక్,జైపాల్ రెడ్డి,యూసుఫ్,బాలయ్య, కిషన్, అశోక్, మోహన్, పరశురామ్, నర్సింలు, సుధాకర్,సాయిలు, యాదగిరి, సూర్య రమేష్, శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్, గంగారం, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు. మెదక్ డివిజన్ డివిజన్ కార్యాలయం ముందు కార్మికులు వంటా వార్పు కార్యక్రమం నిర్వహించి తమ తమ నిరసనను వ్యక్తం చేశారు.



# సమతుల్య ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

## మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య అనిల్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, ఏప్రిల్ 15 : మహిళలు, గర్భిణీలు, కిశోర బాలికలు మరియు చిన్నారులు పోషకాలు ఉన్న సమతుల్య ఆహారాన్ని తీసుకున్నప్పుడే భవిష్యత్తులో రోగాలకు దూరంగా ఉండవచ్చుని కోరుట్ల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్, 26,వ వార్డు కౌన్సిలర్ అన్నం లావణ్య అనిల్ పేర్కొన్నారు. 'పోషణ పక్వాడ' కార్యక్రమంలో భాగంగా బుధవారం కోరుట్ల పట్టణంలోని 26,వ వార్డు వినోబా రోడ్ అంగన్వాడి కేంద్రంలో పాలిచ్చే తల్లులకు, మహిళలకు శిశు పోషణ, ఆరోగ్య సంరక్షణపై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోషకాహారం పట్ల క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్య పరచడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో పిల్లల బరువును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ రిజిస్టర్లలో నమోదు చేస్తున్నామని, కిశోర బాలికలకు రక్తహీనత పరీక్షలు నిర్వహించి తగు జాగ్రత్తలు సూచిస్తున్నామని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు, కౌమార దశలోని బాలికలు ప్రభుత్వం అందించే పోషకాహార సప్లిమెంట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు వాణి, శారద, స్థానిక వార్డు మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.





# ప్రియమైన నాన్నా...హెల్మెట్ ధరించండి

- రోడ్డు భద్రత నియమాలు పాటించండి
- విద్యార్థుల భావోద్వేగ పోస్ట్ కార్డ్ లేఖలతో రోడ్డు భద్రతపై చైతన్యం
- వన్ టౌన్ సీఐ ఇంద్ర సేనా రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), ఏప్రిల్ 15 : రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ అరైవ్ -అలైవ్ కార్యక్రమం లో భాగంగా బుధవారం విద్యార్థుల ద్వారా తల్లిదండ్రులకు హెల్మెట్ ధరించే అవసరంపై, ట్రాఫిక్ నిబంధనలపై లేఖలు రాయించే ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహించాడు.ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల భద్రతను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని విద్యార్థులు వారి ప్రియమైన నాన్నకి , రోడుపై చాలా ప్రమాదాలు అవుతాయి. నాన్న హెల్మెట్ ధరించు మాకు తీసుకొనిరా. నాకు ఇంకా అమ్మకు కూడా హెల్మెట్ తీసుకు రా అని లేఖల ద్వారా విద్యార్థులు విజ్ఞప్తి చేశారు.రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, నియమాలు పాటించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.



# భూ సమస్యల పరిష్కార దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష - వెన్నంపల్లి గ్రామంలోని పలు వ్యవసాయ భూములను పరిశీలించిన జిల్లా కలెక్టర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి, ఏప్రిల్ 15 : భూ సమస్యల పరిష్కార దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. బుధవారం కలెక్టర్ శ్రీహర్ష కాల్వ శ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లి గ్రామంలో పలు వ్యవసాయ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ భారతి లోని ఆన్లైన్ పెండింగ్ త్వరితగతిన పూర్తి చేసి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట తహసీల్దార్ రాముడు, సంబంధిత అధికారులు, తదితరులున్నారు.

# చదువు ద్వారానే ఉజ్వల భవిష్యత్తు..

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు (ఏటూరునాగారం), ఏప్రిల్ 16 : చదువు ద్వారా మాత్రమే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. అన్నారు.బుధవారం ఏటూరు నాగారం మండల కేంద్రంలోని ఆకుల వారి గణపురం ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వసతి గృహంలోని గదులను,వంట శాలను, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి విద్యార్థులతో వసతి గృహ నిర్వహణ, అధికారుల తీరును, వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు,పరిశుభ్రత,ఆహార నాణ్యతపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని,మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు.స్టోర్ రూమ్‌ను తనిఖీ చేసి,రికార్డులను పరిశీలించారు.ఆహార పదార్థాల నిల్వ,నాణ్యతపై ప్రశ్నలు అడిగి, సరైన విధంగా నిర్వహణ ఉండాలని తెలిపారు.నూతనంగా నిర్మిస్తున్న తరగతి గదుల నిర్మాణ పనులను అత్యంత నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, పేదరికం నుంచి బయటపడటాని కి విద్య ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు.తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే విద్యను అభ్యసించానని గుర్తు చేశారు. పట్టుదలతో చదివితేనే సమాజంలో గౌరవప్రదమైన స్థానానికి చేరుకోవడమే కాకుండా,మరో పదిమందికి సహాయం చేయగలిగే సామర్థ్యం వస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిడి జనార్ధన్,సంబంధిత శాఖల అధికారులు,పాఠశాల సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

# మండల సభ నిర్వహణ,ఏర్పాట్ల పై వీడియో కాన్ఫరెన్స్

**- యాక్షన్ ప్లాన్ ప్రకారం ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక - ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాల అమలు నివేదిక - మండల, గ్రామ, వార్డు, స్థాయిలలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి - మండల సభలో నివేదిక సమర్పించాలి - జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 15 : ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 16వ తేదీన ఉదయం 9:30 గంటలకు మండల స్థాయిలో మండల సభలు ఘనంగా నిర్వహించాలని,ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి,ప్రజా సంక్షేమ పథకాలు అమలు,తీసుకోవాల్సిన చర్యలు,మండల,పట్టణ,వార్డు,గ్రామస్థాయిలో అభివృద్ధి పనుల పర్యవేక్షణ అవసరం ఉన్న పనుల గుర్తింపు తదితర అంశాలపై ప్రభుత్వం తెలిపిన విధంగా సభలు ఏర్పాటు చేయాలని,ఈ సభలకు గౌరవ ప్రజాప్రతినిధులను, మండల సమైక్య బృందాల సభ్యులను,యువతి,యువకులను ప్రజలందరినీ ఆహ్వానించాలని,వేదిక ప్రాంగణంలో త్రాగునీరు,స్నాక్స్,ఫ్యాన్లు,కూలర్లు తదితర సౌకర్యాలను సిద్ధం చేయాలన్నారు.ప్రభుత్వ పథకాల ప్రదర్శన నిమిత్తం ప్రత్యేక చర్యలు వీడియో,ఆడియో ఏర్పాట్లు చేయాలన్నారు.ప్రత్యేకించి రోడ్డు భద్రత అరైవ్– అలైవ్,రోడ్ సేఫ్టీ హెల్మెట్,సీట్ బెల్ట్, ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు.గత గ్రామసభలలో గుర్తించిన అభివృద్ధి సమస్యల పరిష్కారం ఎంతవరకు జరిగింది అనే అంశన్ని చర్చించాలని,రానున్న రోజుల్లో అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన అంశాలపై తీర్మానాలుఅ చేయడం,యాక్షన్ ప్లాన్ రెడీ చేసి పక్కా ప్రణాళికతో మండల సభలను నిర్వహించాలని ఆదేశించారు.వేసవి నేపథ్యంలో హిట్ వే,త్రాగునీరు సరఫరా చేయుటకు తీసుకుంటున్న యాక్షన్ ప్లాన్ ను ప్రజలకు చదివి




వినిపించాలని, వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలు ఆరోగ్య సూచనలపై సంబంధిత సిబ్బంది కరపత్రాలు, నివేదికల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రైతు భరోసా, రైతు బీమా, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం లబ్ధిదారులు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, గృహజ్యోతి, మహాలక్ష్మి పథకం, కామన్ డైట్ మెనూ, సన్న బియ్యం బోనస్, (10) థీమ్స్, 6 గ్యారంటీలు, నూతనంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితా ప్రదర్శన, సంబంధిత అన్ని విభాగాల సమన్వయంతో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి సభను నిర్వహించాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, జెడ్పి సీఈవో పురుషోత్తం, డిపిఓ హరిప్రసాద్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, మిషన్ భగీరథ ఇంజనీర్, తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 17,18న వరంగల్‌లో డిహెచ్ పిఎస్ మహాసభలు

**- ఖనిలో వాల్ పోస్టర్స్ విడుదల - సభను విజయవంతం చేయాలి**
**- రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుకూరి రాజారత్నం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటి (గోదావరిఖని), ఏప్రిల్ 15 : సిపిఐ అనుబంధ ప్రజాసంఘం దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర రెండో మహాసభలు ఈ నెల 17, 18 న వరంగల్ లో జరుగుతాయని, ఈ మహాసభలను విజయవంతం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుకూరి రాజారత్నం కోరారు. బుధవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర మహాసభల గోడపత్రికలను ఆయన విడుదల చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెలలో 17 18 న వరంగల్ జరిగే రాష్ట్ర మహాసభల్లో మొదటి మహాసభ నుండి రెండో మహాసభ వరకు చేసిన కార్యక్రమాలను చర్చించి, రాబోయే కాలానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు పోరాట కార్యక్రమాలు తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడుసార్లు అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై మైనార్టీల పై అఘాయిత్యాలు జరుగుతున్నాయని, మహిళల పై అత్యాచారాలు మితిమీరి పోతున్నాయని, దళితులకు రావలసిన ఏ ఒక్క హక్కులు కూడా ఇప్పటివరకు అమలు చేసిన పరిస్థితులు లేవని ఆయన ఆరోపించారు. అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత దళితులకు మూడు ఎకరాల భూమి, దళిత బంధు ఇలా ఎన్నో హామీలతో ప్రభుత్వాలు చేపట్టిన దళితులకు మాత్రం అన్యాయాలే




జరిగినాయని ఆయన పేర్కొన్నారు. గతంలో ఎస్సీలకు సబ్ ప్లాన్లు ఉన్నా , ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు సబ్ ప్లాన్ నుంచి నిధులు విడుదల చేసి దళితులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల్లో జరుగుతున్న దళిత వ్యతిరేక విధానాలపై కూడా ఈ యొక్క మహాసభలో చర్చించి పోరాట కార్యక్రమాలు తీసుకోవడానికి నిర్ణయాలు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ మహాసభల విజయవంతానికి ప్రజలందరూ కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ప్రజా సంఘాల నాయకులు పడాల కనకరాజు , రొంటాల లింగయ్య, బొంత రాజు, ఎర్ర గొల్ల చేరాలు, ఆర్ కనకయ్య, గాజుల పునేంద్ర. పుల్లూరి రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేయాలి : జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు (మంగపేట), ఏప్రిల్ 16 : ఏప్రిల్ 27 నుంచి మే 5 వరకు తొమ్మిది రోజుల పాటు జరిగే మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు.బుధవారం మంగపేట మండలం మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిసరాలను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. క్షేత్రస్థాయిలో పరిశీలించి, బ్రహ్మోత్సవాల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి ఉత్సవాల జాతర పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది.అన్ని శాఖల అధికారులు, సమన్వయంతో పనిచేసి భక్తులకు స్వామి వారి దర్శనం సులభతరం చేయాలి అన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా భక్తుల కోసం క్యూ లైన్లలో నిరంతరం మంచినీటి సౌకర్యం కల్పించాలని ఆలయ పరిసరాల్లో స్నానపు ఘాట్ల వద్ద పారిశుద్ధ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఎప్పటికప్పుడు చెత్తను తొల గిస్తూ పరిస రాలను పరి శుభ్రంగా చేయాలని సంబంధిత



అధికారులను ఆదేశించారు.భక్తులకు అందించే ప్రసాదం నాణ్యతగా ఉండాలని,అన్నదాన కార్యక్రమాల వద్ద తోపులాట జరగకుండా క్రమశిక్షణతో కూడిన ఏర్పాట్లు చేయాలని ఆలయ కమిటీకి సూచించారు.ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఈవో వీరస్వామి,డిపిఓ వెంకయ్య, ఆర్డబ్ల్యూఎస్ మాణిక్యరావు, పంచాయతీరాజ్ ఈ ఈ అజయ్ కుమార్,డి ఎం హెచ్ ఓ గోపాలరావు,డి.ఎస్.పి కిషోర్, అగ్నిమాపక సిబ్బంది,ఆలయ పూజారులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.







# ఇంటర్ విద్యార్థినిలను అభినందించిన జిల్లా కలెక్టర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 15 : ఇంటర్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డోర్నకల్ మైనారిటీస్ బాలికల ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థినిలను బుధవారం కలెక్టరేట్ యందు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ విద్యార్థినిలకు మెడల్ మరియు ప్రశంసా పత్రంతో సన్మానించినారు.

ఈ సందర్భంగా ఫలితాల సాధనకు కృషిచేసిన ప్రిన్సిపల్ దాసరి స్వప్నను మరియు అధ్యాపక బృందాన్ని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ ఫర్ ఉమెన్ లో 1000 మార్కులకు గాను ఎస్కే హుమేరా 982, ఎస్.డి. రిజ్వానా 980, ఎం.నవ్య 972,సమీనా పటాన్ 970,ఎస్.కె రిజ్వానా 967,అదేవిధంగా మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు లో ఎస్.కె షరీఫా 979, ఎస్కే సుమయ్య 971 మార్కులను సాధించినారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం లో 500 మార్కులకు గాను మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ ఫర్ ఉమెన్ యందు ఎస్. కే రిజ్వానా 490, ఎస్.డి.సన 489, ఎస్కే ఆశ 484,జెస్సికా 483 అదేవిధంగా మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు లో ఎస్.కె షాకీర 490,ఎస్.కే.సల్మా 490, ఎస్.డి.సభ 488 ,సాగరిక 486,ప్రసన్న 478 మార్కులతో కాలేజ్ టాపర్గా నిలిచి కలెక్టర్ ద్వారా అభినందనలను అందుకున్నారు .ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టోపో, రెవెన్యూ అనిల్ కుమార్,జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి బి. శ్రీనివాసరావు తో పాటుగా,కాలేజీ అకాడమీ కోఆర్డినేటర్ సరిత,డిప్యూటీ వార్డెన్ షహీన్,నజ్మా,ఎం.డి.ఇమాముద్దీన్, ఏం.డి.అఖిల్లుల్ల ,ఎం.ఏ.వాజిద్,ఎన్.కె రజాలి,ఎం.డి.జాఫర్,ఎస్ .డి.అహ్మద్ ,ఎస్.కె మహబూబ్,ఇక్బాల్,సత్తార్ , విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వేడిగాలులలపై అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



నిర్మల్, ఏప్రిల్ 15 : జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. సాధారణ స్థాయికి మించి 1.5డిగ్రీల నుండి 3.5డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశమున్నదని, జిల్లాలో వచ్చే వారం రోజుల పాటు వేడి గాలులు (హీట్‌వేవ్) ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. పట్టణాలు, గ్రామాలు, ట్రాఫిక్ కూడళ్ల వద్ద అవసరమైన ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు, రెడ్‌క్రాస్ వంటి సేవా సంస్థలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. చలివేంద్రాల్లో ప్రజలకు తాగునీటితో పాటు ఓఆర్ఎస్ (రా–రా) ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రజలు తగినంత నీరు తాగుతూ శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవాలని, ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు, అనారోగ్యంతో ఉన్న వారు మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకుండా జాగ్రత్త పడాలని సూచించారు. జిల్లాలో హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్‌ను అత్యవసరంగా సిద్ధం చేసి అమలు చేయాలని, ప్రదేశాల వారీగా వాతావరణ పరిస్థితులను భారత వాతావరణ శాఖ వెబ్‌సైట్ ద్వారా నిరంతరం పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. అలాగే, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు అప్రమత్తంగా ఉండాలని, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, డీహైడ్రేషన్ చికిత్సకు అవసరమైన ఔషధాలను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ప్రజలు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# ఇంటర్ ఫలితాల్లో మెరుగైన ప్రతిభ...

**- జిల్లా కలెక్టర్‌కు అధికారుల అభినందన**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, ఏప్రిల్ 15 : ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాలలో నిర్మల్ జిల్లా విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరచడంతో, పలువురు అధికారులు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవను మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్‌ను కలిసి పూల మొక్కలను అందజేశారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ప్రోత్సాహం అందించినందుకు కలెక్టర్‌కు అధికారులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇంటర్ పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమిష్టి కృషి ఎంతో ముఖ్యమని అన్నారు. ఈ ఫలితాలు అందరి కృషి ఫలితమని, రానున్న రోజుల్లో మరింత కష్టపడి జిల్లాను విద్యారంగంలో ముందువరుసలో నిలపాలని సూచించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి పరుశు రాం, అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



# ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణమే ప్రధాన లక్ష్యం

**- ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వజ్జే వీరయ్య యాదవ్**
**- సూర్యాపేట ప్రెస్ క్లబ్ నూతన పూర్తి స్థాయి కార్యవర్గం ప్రకటన**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సూర్యాపేట, ఏప్రిల్ 18 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జర్నలిస్టులకు సరైన ప్రెస్ క్లబ్ భవనం లేక ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో భవన నిర్మాణమే ప్రధాన అజెండాగా నూతన కమిటీ పని చేస్తుందని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వజ్జే వీరయ్యయాదవ్ స్పష్టం చేసారు. బుధవారం స్థానిక పబ్లిక్‌క్లబ్ ఆడిటోరియంలో జర్నలిస్టు సంఘాలతో నిర్వహించిన సమావేశంలో నూతన పూర్తి స్థాయి కమిటీని ప్రకటించారు. యూనియన్లకు అతీతంగా ప్రెస్ క్లబ్ భవన నిర్మాణం కోసం ముందుకు వచ్చిన జర్నలిస్టులను అభినందిం చారు. ప్రెస్ క్లబ్‌కు స్థలం కేటాయింపు జరిగినప్పటికీ భవన నిర్మాణం జరగకపోవడం బాధాకరమని, దీనివల్ల జర్నలిస్టులకు సరైన గుర్తింపు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. నూతన కమిటీ అందరినీ కలుపుకుని భవన నిర్మాణం కోసం కృషి చేస్తుందని తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారంతో పాటు భవన నిర్మాణానికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నూతన కార్యవర్గంలో గౌరవాధ్యక్షులుగా చలసాని శ్రీనివాసరావు, నాయిని శ్రీనివాసరావు, అధ్యక్షుడిగా వజ్జే వీరయ్య, ప్రధాన కార్యదర్శిగా ఐతగాని రాంబాబు, కోశాధికారిగా తల్లాడ చందన్‌ను ప్రకటించారు. గౌరవ సలహాదారులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులతో కూడిన పూర్తి స్థాయి కమిటీని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు బొజ్జ ఎడ్వర్డ్, గునగంటి సురేష్, బుక్క రాంబాబు, ఉటుకూరి రవిందర్, జర్నలిస్టు సంఘాల నాయకులు మరియు పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.




# సురక్షిత ప్రయాణమే కుటుంబానికి భరోసా...

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, ఏప్రిల్ 16 : సురక్షిత ప్రయాణమే కుటుంబానికి భరోసా ఇస్తుందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా బుధవారం ఏటూరు నాగారం మండల కేంద్రం లోని గిరిజన సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "అరైవ్– అలైవ్ "కార్యక్రమానికి ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ముఖ్యఅతిథిగా హాజర య్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అతివేగం,మద్యం సేవించి వాహనం నడపడం,హెల్మెట్,సీట్ బెల్ట్ ధరించకపోవడం వల్ల కలిగే అనర్థాలతో కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని ప్రతి ఒక్కరూ సురక్షితంగా ప్రయాణం చేసి కుటుంబానికి భరోసా కల్పించాలని పేర్కొన్నారు. వాహనదారులు తప్పనిసరిగా రోడ్ భద్రత నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి కావద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏటూరు నాగారం అదనపు ఎస్పీ మనన్ భట్,పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మీ సేవ కేంద్రాల్లో అవినీతి

## - సర్వీస్ కోసం వచ్చే వారి నుంచి వసూళ్లు - ఫిర్యాదులు రావడంతో ఎసిబి సోదాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్15 : తెలంగాణ వ్యాప్తంగా మీసేవ కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు నిర్వహిస్తోంది. ఖైరతాబాద్, అంబర్ పేట్, అల్వాల్‌లో మీసేవ ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. పౌర సేవ పత్రాల జారీలో దళారుల ద్వారా మీసేవ సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో బుధవారం ఏసీబీ రంగంలోకి దిగింది. సోదాల్లో భాగంగా మీసేవ సిబ్బంది ప్రజలను ఎక్కువగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సోదాలకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మీ సేవల్లో దోపిడి ఎక్కువైపోయిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చార్జీల పేరుతో మీసేవ సిబ్బంది చేస్తోన్న దోపిడీకి అడ్డుఅదుపు లేకుండా పోయిందని జనం ఆరోపిస్తున్నారు. మీ సేవ కేంద్రాల్లో కుల, ఆదాయ, నివాస, బర్త్, డెత్ సర్టిఫికెట్ల కోసం వెళ్తే దోచుకుంటున్నారు. టెక్నాలజీతో పౌర సేవలను మరింత సులభతరం చేస్తున్నామంటూ అన్ని సేవలను మీ సేవ కేంద్రాలకు అప్పగించి అధికారులు మాత్రం చేతులు దులుపుకుంటున్నారు. దీంతో నిర్వాహకులు అందినకాడికి దండుకుంటున్నారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబసభ్యుల ధ్రువీకరణ, ఓబీసీ తదితర సర్టిఫికెట్ల కోసం రూ. 45 చెల్లిస్తే చాలు. కానీ, ఈ ఫీజు ఎక్కడా తీసుకోవడం లేదు. దాదాపు రూ.500 నుంచి రూ.1000 వరకు తీసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. కొందరు అప్లై చేసేప్పుడు కాకుండా తిరిగి సర్టిఫికెట్లు ప్రింట్ తీసుకునే టైంలో అదనంగా కలెక్ట్ చేస్తున్నారని దరఖాస్తుదారులు చెప్తున్నారు. క్యాస్ట్, లోకల్, ఇన్కమ్ సర్టిఫికెట్లు కావాలంటే సెల్ఫ్ డిక్లరేషన్ కోసం అఫిడవిట్ సమర్పించాలనే నిబంధనలు ఉన్నాయి. అయితే, ఇది హైదరాబాద్ జిల్లా మినహా మిగతా జిల్లాల్లో తప్పనిసరి అనే రూలేవు. హైదరాబాద్ జిల్లాలో కూడా ఇదివరకు క్యాస్ట్ సర్టిఫికెట్ తీసుకొని ఉంటే ఆ సర్టిఫికెట్ ఆధారంగా మళ్లీ అప్లై చేసుకోవచ్చని అధికారులు చెప్తున్నారు. కానీ, మీ సేవలో మాత్రం అదేమీ కుదరదని, అఫిడవిట్ కచ్చితంగా కావాల్సిందేనని వందల్లో వసూళ్లు చేస్తున్నారు. మీ సేవ కేంద్రాల్లో తప్పనిసరిగా సర్వీసులకు సంబంధించిన ధరల పట్టిక ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ చాలా చోట్ల స్పష్టమైన సమాచారంతో చార్ట్ ఏర్పాటు చేయడంలేదు.

## పరిగిలో ఇండస్ట్రియల్ కారిడార్ పేరుతో భూసేకరణ

మొదటిపేజీ తరువాయి

చేశారు. అంతకుముందు స్థానిక ఎన్టీఆర్ చౌరస్తాలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ క్రమంలో రైతులు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. దీంతో కొంతమందిని పోలీసులు అరెస్టు చేశారు. తెలంగాణ జాగృతి, ధర్మ సమాజ్ పార్టీలు రైతులకు సంఘీభావం తెలిపాయి.

## మహిళా బిల్లుకు ఓకే

మొదటిపేజీ తరువాయి

ఆరోపించారు. డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా పార్లమెంట్ లో సమిష్టిగా పోరాడుతామని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా కూటమి అనుకూలంగానే ఉందని.. కానీ దానిని తీసుకువచ్చే విధానంపైనే అభ్యంతరాలు ఉన్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పేర్కొన్నారు. రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్‌ను ముడిపెట్టి కేంద్రం రాజకీయ కుతంత్రాలు చేస్తోందని ఆరోపించారు. రాజ్యాంగం లోని అధికారాలన్నింటినీ కార్యనిర్వాహక వర్గం తీసుకుంటోందన్నారు. కేవలం ప్రతిపక్ష పార్టీలను అణచివేయడానికే కేంద్ర ప్రభుత్వం ఇలా చేస్తోందన్నారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా తామంతా పార్లమెంట్‌లో ఐక్యంగా పోరాడుతామని ఖర్గే పేర్కొన్నారు. కనీసం జనగణన కూడా పూర్తి చేయకుండా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. కొత్త జనాభా లెక్కల తర్వాతే డీలిమిటేషన్ చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 ఎన్నికల నుంచి అమలు చేసేందుకు 16వ తేదీ నుంచి 3 రోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో సవరణలను చేపట్టనున్నారు. ఇందులో భాగంగా మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలుగా ఇప్పుడున్న లోక్‌సభ స్థానాల గరిష్ఠ సంఖ్య (550)ని గరిష్ఠంగా 850 వరకూ పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ క్రమంలోనే మహిళా రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి.

## రాహుల్ కేరళ నుంచి ఎందుకు పోటీ చేశారు

మొదటిపేజీ తరువాయి

విపక్షాలపై ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. మహిళల వాటా తగ్గించడానికి ప్రయత్నిస్తున్నారా?, ఎస్సీ, ఎస్టీ వాటా అడ్డుకోవడానికి కుట్ర పన్నుతున్నారా? అంటూ విపక్షాలకు ఆయన ప్రశ్నలు సంధించారు. సీఎం రేవంత్ రెడ్డికి ప్రజాస్వామ్యం అంటే డబ్బే అని వ్యంగ్యంగా అన్నారు. ఢిల్లీకి ఆయన డబ్బుల మూటలు మోశారని విమర్శించారు. నగదు కేంద్రంగా రాజకీయం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. డబ్బున్న వాళ్ళకి ఓటు విలువ ఎక్కువ అనేలా సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్య హాస్యాస్పదంగా ఉందని లక్ష్మణ్ పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌ను మూడు ముక్కలు చేశారని మండిపడ్డారు. జీహెచ్ఎంసీ పరిధిలో150 సీట్లను 300 సీట్లు చేశారని పేర్కొన్నారు. ఏ శాస్త్రీయ పద్ధతిలో గ్రేటర్ హైదరాబాద్‌ను విభజించారంటూ సీఎంను ఆయన సూటిగా ప్రశ్నించారు. డీలిమిటేషన్ బిల్లు వల్ల దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరగకుండా ప్రస్తుతం ఉన్న సీట్ల నిష్పత్తికి అనుగుణంగా అవి పెరుగుతాయని ఎంపీ లక్ష్మణ్ తెలిపారు. 543 సీట్లలో మహిళా రిజర్వేషన్లు పెంచమనడం వెనుక ఎస్సీ, ఎస్టీ మహిళలకు నష్టం చేయాలన్న కుట్ర దాగి ఉందని అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీకి పెరుగుతున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక పోతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. అందుకే డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లుల పట్ల రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటనలు చేస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీల నేతలపై ఆయన విరుచుకు పడ్డారు. జీఎస్డీపీ ప్రకారం డీలిమిటేషన్ చేయాలన్నది కాంగ్రెస్ విధానమా? అనేది స్పష్టం చేయాలని ఆ పార్టీ నేతలను ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఓటు విలువ ధనిక, పేద అనే వ్యత్యాసం లేకుండా అందరికీ సమానంగా ఉంటుందని అభిప్రాయ పడ్డారు. జీడీపీలో మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు ముందు వరుసలో ఉన్నాయని గుర్తు చేశారు. తెలంగాణ వ్యతిరేక ప్రతిపాదన చేస్తున్నారని వెంటనే దీనిని వెనక్కి తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి ఆయన స్పష్టం చేశారు.

## డీలిమిటేషన్ కేవలం రాజకీయ సవరణగా మిగలొద్దు

మొదటిపేజీ తరువాయి

ఈ పునర్విభజన వల్ల రాజకీయంగా అన్యాయం జరగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను ప్రోత్సహించాల్సింది పోయి, వాటి ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన విమర్శించారు.దేశంలోని అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక అయిన పార్లమెంటులో తమ ప్రజల స్వరాన్ని, ప్రతినిధిత్వాన్ని అణచివేయాలని చూస్తే తాము నిశ్శబ్దంగా చూస్తూ ఉండబోమని స్పష్టం చేశారు. దక్షిణ భారతీయుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామని కేటీఆర్ ప్రకటించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని అన్నారు. 'ఢిల్లీ పాలకులు మా మాట వినాలని, బుద్ధి ప్రబలాలని ఆశిస్తున్నాం' అంటూ సోషల్ మీడియా ఎక్స్‌లో కేటీఆర్ పోస్ట్ చేశారు.

## పాటలు తప్ప స్కామ్‌లు తెలియవు

### - మీడియా ముందు మంగ్లీ ఆవేదన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, ఏప్రిల్ 15 : తనపై వస్తున్న ఆరోపణల కారణంగా చాలా నగిలిపోతున్నానని, తనకు పాటలు తప్ప.. స్కామ్‌లు తెలియవని సింగర్ మంగ్లీ అన్నారు. విచారణ చేసుకోవాలని.. తాను తప్పు చేసి ఉంటే ఎలాంటి శిక్షకైనా రెడీగా ఉన్నానని చెప్పారు. బుధవారం మంగ్లీ మీడియాతో మాట్లాడుతూ.. 'పేదరికం నుంచి వచ్చాను. డబ్బు విలువ నాకు తెలుసు. నెల రోజులుగా నా ప్రోగ్రామ్‌లు, రికార్డింగ్స్ వదులుకున్నా. ప్రజల్లోకి తప్పుగా వెళ్తోంది. బాధితులకు నేను అండగా ఉంటా. మధు నాయక్, హిమాకాంత్ రెడ్డి, రామావత్ మధు, సిద్ధు, సుబ్బారావుపై డీజీపీకి ఫిర్యాదు చేశాను' అని అన్నారు. మంగ్లీ తరఫు న్యాయవాది మాట్లాడుతూ.. 'నేరగాళ్లే బాధితుల రూపంలో పోలీస్ స్టేషన్‌కి వస్తున్నారు. అసలు స్కామ్ చేసిన వాళ్లే మీడియా ముందుకు వచ్చి బాధితులుగా మాట్లాడుతున్నారు. సుభాక్షేత్ర బిజినెస్ అనే పేరుతో కంపెనీ ఏర్పాటు చేసి.. దానికి ఎండీగా ఉన్నది మధు. ప్రస్తుతం బాధితుడిగా మీడియాతో మాట్లాడుతున్న హిమాకాంత్ రెడ్డి ఆ కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్నాడు. ఈ స్కామ్‌కి మంగ్లీకి ఎలాంటి సంబంధం లేదు' అని అన్నారు.

## తెలంగాణాలో భగ్గుమంటున్న భానుడు

మొదటిపేజీ తరువాయి

ప్రాంతాల్లో ఇవాళ ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటి నమోదయ్యాయి. రానున్న మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా మరో ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాగల మూడు రోజులు పలు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆయా జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే ఛాన్స్ ఉందని పేర్కొంది.నిజామాబాద్, ఖమ్మం, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని, గురువారం ఉమ్మడి ఆదిలాబాద్‌తోపాటు నాగర్ కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీస్తాయని తెలిపింది. వడగాలులు వీచే జిల్లాలకు వాతావరణ శాఖ యెల్లో అలర్ట్ జారీచేసింది.

## పునర్విభజన జనాభా ప్రకారమే

మొదటిపేజీ తరువాయి

స్పష్టం చేశారు. సీట్ల పెంపు అనేది 2011 జనాభా లెక్కల ఆధారంగానే జరుగుతుంది. ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం ప్రజల్లో గందరగోళం సృష్టించేలా మాట్లాడుతూ రాజకీయం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన 'హైబ్రిడ్ సిస్టమ్' అనే విధానం ప్రపంచంలోనే ఎక్కడా లేదని రాంచందర్‌రావు ఎద్దేవా చేశారు. డీలిమిటేషన్‌కు సంబంధించి రేవంత్ రెడ్డి చెబుతున్న ప్రతిపాదనలు అసంబద్ధంగా ఉన్నాయని, అవేవీ చట్టబద్ధమైనవి కావని ఆయన కొట్టిపారేశారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ఇండియా కూటమి, కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్నాయని ధ్వజమెత్తారు. నియోజకవర్గాల పెంపు విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందన్న ప్రచారంలో వాస్తవం లేదు. సీఎం రేవంత్ రెడ్డి తన బాధ్యతారాహిత్య వ్యాఖ్యలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని రాంచందర్‌రావు అన్నారు. దేశవ్యాప్తంగా డీలిమిటేషన్ ప్రక్రియపై చర్చ జరుగుతున్న వేళ, రాష్ట్ర ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలు కేవలం కేంద్ర ప్రభుత్వంపై బురద చల్లడానికేనని రాంచందర్‌రావు విమర్శించారు. పునర్విభజన ప్రక్రియ చట్టప్రకారం పారదర్శకంగా జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

## సిఎం రేవంత్ తీరుపై బిజెపి మండిపాటు

మొదటిపేజీ తరువాయి

ఆపండి. రాజ్యాంగం లోని ఆర్టికల్ 81ను చదవండి. డీలిమిటేషన్ కేవలం జనాభాపైనే ఆధారపడదు. అవసరమైన ఇతర అంశాలను కూడా డీలిమిటేషన్ కమిషన్ పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. సీట్ల పెంపు కోసం ఏ ఫార్ములాను అనుసరించాలనే నిర్ణయాన్ని ఆ కమిషన్‌కే వదిలారు. అయినా ఎలాంటి కారణం లేకుండా మీరు రాజకీయాలు చేస్తున్నారు.. షేమ్ అని రామచందర్‌రావు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్లతో డీలిమిటేషన్‌కు ముడిపెట్టవద్దని రేవంత్ అన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పెంపుపై అఖిలపక్ష భేటీ నిర్వహించాలని కోరారు. కీలక నిర్ణయాల్లో రాష్ట్రాలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలి. డీలిమిటేషన్‌పై అన్ని రాష్ట్రాలు, రాజకీయపార్టీల ఏకాభిప్రాయం సాధించాలి. నియోజకవర్గాల పెంపులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయొద్దు. జాతీయస్థాయిలో విస్తృత అభిప్రాయ సేకరణ తర్వాతే డీలిమిటేషన్ చేయాలని రేవంత్ విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో రామచందర్‌రావు స్పందిస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇలాంటి అనుమానాలతు, వ్యాఖ్యలతో ఉత్తరాది, దక్షిణాది మధ్య విభేదాలు సృష్టించవద్దని కిషన్ రెడ్డి అన్నారు.

# మార్కెట్ యార్డుల అభివృద్ధికి కట్టుదిట్టమైన చర్యలు

### - యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మంత్రి ఆగ్రహం - మార్కెట్ యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మం - రెండేళ్లలో మొత్తం రూ.568.50 కోట్ల వ్యయం

### - లైసెన్సులు కొనసాగిస్తున్న ట్రేడర్లపై కఠిన చర్యలు

### - మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,ఏప్రిల్15 : తెలంగాణలో వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధి, పారదర్శకతపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ అధికారులతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు. మార్కెట్ యార్డ్‌ల అభివృద్ధి పనుల పురోగతి, రైతులకు అందుతున్న సౌకర్యాలపై ఆయన అధికారులతో చర్చించారు. గత రెండు సంవత్సరాల్లో మొత్తం రూ.568.50 కోట్ల వ్యయంతో 630 అభివృద్ధి పనులు మంజూరు చేసినట్లు మంత్రికి అధికారులు వెల్లడించారు. ఇందులో రూ.128 కోట్లతో 113 పనులు పూర్తయ్యాయని నివేదిక సమర్పించారు. మిగిలిన పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. ప్రతి పనికి టైమ్‌లైన్ నిర్ణయించి వేగంగా ముందుకు తీసుకెళ్లాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. మార్కెట్ యార్డుల్లో 'జీరో బిజినెస్' అంశంపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారం చేయకుండా లైసెన్సులు కొనసాగిస్తున్న ట్రేడర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారి లైసెన్సులను రద్దు చేయాలని ఆదేశించారు. అలాంటి వారికి సహకరించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. అభివృద్ధి పనుల పర్యవేక్షణ కోసం ప్రత్యేక డ్యాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, పంట ఉత్పత్తుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు తుమ్మల. గడ్డిఅన్నారం మార్కెట్‌లో 'స్మార్ట్ మార్కెట్ యార్డ్' అమలు చేయాలని, డిజిటలైజేషన్ ద్వారా జీరో బిజినెస్ సమస్యను తగ్గించాలని నిర్ణయించారు. కోహెడ మార్కెట్ అభివృద్ధి పనులకు త్వరలో టెండర్లు పిలవనున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ ఖర్చు తగ్గింపుపైనా మంత్రి దృష్టి సారించారు. మార్కెట్ యార్డుల్లో సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులను వేగవంతం చేసి, జులై చివరి నాటికి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలని అన్నారు. వ్యవసాయ కొనుగోళ్ల విషయానికి వస్తే.. ఖరీఫ్ సీజన్‌లో పత్తి కొనుగోళ్లు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లకు మిర్చి అధికంగా వస్తోందని పేర్కొన్నారు. మరోవైపు ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. టార్పాలిన్లు, తేమ కొలమానాలు, డ్రైయర్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. మొక్కజొన్న కొనుగోళ్లలోనూ రైతులకు పూర్తి రక్షణ కల్పిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. అలాగే రైతుల ఖాతాలకు నేరుగా చెల్లింపులు చేస్తామని స్పష్టం చేశారు. మొత్తం మీద మార్కెట్ యార్డ్‌లను ఆధునీకరించి, రైతులకు అనుకూలంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల వెల్లడించారు.

## నిజామాబాద్ మార్కెట్లో పసుపు రైతుల దాడి

మొదటిపేజీ తరువాయి

అద్దాలు ధ్వంసం చేశారు. మార్కెట్ లో బహిరంగవేలం ద్వారా జరుగుతున్న కొనుగోళ్లను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. బుధవారం నిజామాబాద్ మార్కెట్ యార్డుకు భారీగా పసుపు అమ్మకానికి వచ్చింది. దాదాపు 50 వేల బస్తాల పసుపును రైతులు మార్కెట్ కు తీసుకొచ్చారు. ఆన్ లైన్ లో క్వింటాల్ పసుపు ధర రూ 16వేలు ఉండగా.. బహిరంగ వేలం ద్వారా క్వింటాల్ పసుపును మూడు వేలు తగ్గించి రూ. 13వేలకు కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ఆఫ్ లైన్ కొనుగోళ్లు నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

# ఎసిబికి చిక్కిన లంచగొండి ఇంజనీర్

### 50వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్,ఏప్రిల్15 : కరీంనగర్ జిల్లాలో అవినీతి మున్సిపల్ అధికారి ఏసీబీ అధికారులకు చిక్కాడు. హుజూరాబాద్ మున్సిపల్ ఆఫీసులో పనిచేస్తున్న అసిస్టెంట్ ఇంజనీర్.. ఓ కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికాడు.జిల్లాలోని హుజూరాబాద్ మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ నుసం సుధాకర్ రెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. పట్టణంలో నిర్మించిన స్ట్రోమ్ డ్రైనేజీకి సంబంధించిన ఫైనల్ బిల్లు కోసం మెజర్‌మెంట్ బుక్‌లో నమోదు చేయాలని అధికారులను సంప్రదించాడు. అయితే ఏఈ సుధాకర్‌రెడ్డి రూ. 50 వేలు లంచం డిమాండ్ చేయగా బుధవారం హుజూరాబాద్ ఆర్టీసీ డిపో చౌరస్తా వద్ద నగదును తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏఈపై కేసు నమోదు చేసి ,అరెస్టు చేశామని, అనంతరం కరీంనగర్ ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టామని వెల్లడించారు. వాటర్ డ్రెయిన్ పనులకు సంబంధించిన బిల్లులు మంజూరు కోసం లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. హుజూరాబాద్ మున్సిపల్ ఆఫీసులో అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సుధాకర్ రెడ్డి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. హుజూరాబాద్ కు చెందిన సంతోష్ కుమార్ అనే కాంట్రాక్టర్ నుంచి రూ 50వేలు లంచం తీసుకుంటుండగా అధికారులు సుధాకర్ రెడ్డిని రెడ్ హ్యాండెడ్ పట్టుకున్నారు. హుజురాబాద్ స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పనులకు సంబంధించిన మెజర్‌మెంట్ బుక్ నమోదు, ఫైనల్ బిల్ ప్రాసెస్ కోసం కాంట్రాక్టర్ సంతోష్ కుమార్ ను ఏఈ సుధాకర్ రెడ్డి రూ.50వేల లంచం డిమాండ్ చేశారు. మున్సిపల్ ఆఫీసులో బాధితుడినుంచి లంచం తీసుకుంటుండగా అరెస్ట్ చేశారు. ప్రత్యేక న్యాయస్థానంలో హాజరు పరచ నున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

## వారసత్వ కట్టడాలను పరిరక్షించాలి

మొదటిపేజీ తరువాయి

సంబంధించిన ప్రతిపాదనలు ఏ స్థాయిలో ఉన్నాయని ఆరా తీశారు. క్లియరెన్స్ స్టేజిలో ఉన్నాయని, ఆయా శాఖల నుంచి అనుమతులు వచ్చిన వెంటనే డీపీఆర్ సిద్ధం చేస్తామని అధికారులు చెప్పారు. అనంతరం కటోరా హౌస్ ను సందర్శించారు. కులీకుతుబ్ షా అర్బన్ డెవలప్మెంట్ ఆటోఆరిటీని సమన్వయం చేసుకుని , డీపీఆర్ ను సిద్ధం చేయాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. కటోరా హౌస్ ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. కటోరా హౌస్ పరిసర ప్రాంతాల్లో ఉన్న వ్యర్థాలను వెనువెంటనే తొలగించాలని అధికారులు ఆదేశించారు. తర్వాత గోల్కొండ కోట సమీపంలోని బస్ స్టాప్ వద్ద ఉన్న ఖాళీ ప్రదేశంలో లాడ్ బజార్ తరహాలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాన్నారు. ఈ ప్రతిపాదనలను నేషనల్ మోనుమెంట్ మిషన్ అథారిటీకి పంపి అనుమతులు పొందాలని సూచించారు. అక్కడి నుంచి ఖజానా బిల్డింగ్ మ్యూజియంకు చేరుకున్నారు. ఎంతో చారిత్రాత్మక విలువైన కళాఖండాలు ఉన్న ఈ మ్యూజియం ను పర్యాటకంగా అభివృద్ధి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ ప్రదేశంలో చేనేత వస్త్రాల ప్రదర్శన ను ఏర్పాటు చేయాలని పురావస్తు , అధికారులను ఆదేశించారు. కేబీ మ్యూజియం వెనక భాగంలో ఉన్న ఆక్రమణలను పోలీస్ శాఖ సహకారంతో వారం రోజుల్లో తొలగించాలని అన్నారు. ÷లంగాణలో అద్భుతమైన చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద, ప్రకృతి రమణీయ ప్రదేశాలు ఉన్నాయని, వాటిని ప్రపంచ పర్యాటకులకు పరిచయం చేసేలా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా వాటిని అభివృద్ధి చేయడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీటీడీసీ ఎండీ గౌతమి, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, ఇతర శాలల అధికారులు పాల్గొన్నారు.

## హనుమాన్ మాల ధరించిన విద్యార్థికి అవమానం

### - హెడ్మాస్టర్ తీరుపై తల్లిదండ్రుల ఆగ్రహం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్ భూపాలపల్లి,ఏప్రిల్15 : హనుమాన్ మాలలో వచ్చిన విద్యార్థిని పాఠశాలలోకి అనుమతించకపోవడంపై తల్లిదండ్రులు మండిపడుతున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. 7వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి హనుమాన్ దీక్ష తీసుకున్నాడు. దీంతో హనుమాన్ మాల ధరించి పాఠశాలకు వెళ్లాడు. అయితే పాఠశాల హెడ్ మాస్టర్ ఆ విద్యార్థిని గేటు వద్దే అడ్డుకున్నారు. మాల ధరించి తరగతి గదిలోకి రాకూడదని చెప్పారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు అక్కడికి చేరుకున్నారు. హెడ్ మాస్టర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ విద్యార్థి తల్లిదండ్రులు, బజరంగదళ్ కార్యకర్తలు.. పాఠశాల ముందు ఆందోళన చేపట్టారు. పాఠశాల ప్రాంగణంలో నినాదాలు చేస్తూ భైఠాయించారు. హిందూ ఆచారాలను అవమానించిన హెడ్ మాస్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మహిళాబిల్లు, పునర్విభజన చట్టం

మొదటిపేజీ తరువాయి

ఇదే విషయమై సామాజిక ఉద్యమకారులు ప్రశ్నించారు. కేంద్రం ఎంపీలకు పంపిణీ చేసిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై వివిధ పక్షాలకు చెందిన నాయకులు పలు అనుమా నాలను వ్యక్తం చేస్తున్నారు. ఈ బిల్లులో మొత్తం లోక్‌సభ స్థానాలను గరిష్ఠంగా 850కి పెంచాలని ప్రతిపాదించినప్పటికీ వాటిని రాష్ట్రాల వారీగా ఏ ప్రాతిపాదికన అమలు చేస్తారన్న దానిపై స్పష్టత ఇవ్వకపో వడాన్ని ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అనధికారికంగా చెప్పినట్లు ఇప్పుడున్న సీట్లను 50శాతం పెంచితే అన్ని రాష్ట్రాల్లోనూ ఆ వాటా ప్రకారం పెరుగుతాయి. అలాకాకుండా ప్రస్తుతం అందుబాటులో ఉన్న తాజా జనాభా లెక్కల ప్రకారం... అంటే 2011 జనాభా లెక్కలను ఆధారంగా చేసుకుని నియోజకవర్గా లను పునర్విభజిస్తే కుటుంబ నియంత్రణ అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంటుందని వాదిస్తున్నారు. ఇది ఆందోళనకరంగా కనిపిస్తోందని దక్షిణాది రాష్ట్రాల ఎంపీలు పలువురు పేర్కొంటున్నారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలంటే నియోజవర్గాల పునర్విభజన చేయకతప్పదన్న అభిప్రాయాన్ని తప్పుపట్టారు. లోక్‌సభ, అసెంబ్లీల్లో ప్రస్తుతం ఉన్న స్థానాల సంఖ్యకు అనుగుణంగానే మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండు చేశారు. ఈ అంశంపై విస్తృతంగా చర్చలు జరపాలని ప్రతి ఒక్కరూ కోరుతున్నారు. ఇందుకు సంబంధించిన బిల్లు ముసాయిదా ప్రతులను ఇంతవరకు ఎంపీలకు ఇవ్వకపోవడాన్ని, ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకపోవడాన్ని ప్రశ్నించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలంటే లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న సీట్లను 543 నుంచి 850 వరకు పెంచాల్సిన అవసరం ఏముందని నిలదీస్తు న్నారు. లోక్‌సభ సీట్లను 850కి పెంచితే అది ప్రపంచంలోనే అతి భారీ చట్ట సభ అవుతుందని అన్నారు. అది సభాకార్యకలాపాల నిర్వహణపై ప్రభావం చూపుతుందని తెలిపారు. గతంలో సభ ఏడాదిలో 150 రోజుల పాటు సభ జరిగేదని ఇప్పుడు 55 రోజుల పాటు కూడా జరగడం లేదని గుర్తు చేశారు. రిజర్వేషన్లలో ఓబీసీలకు ఉప కోటా లేకపోవడాన్ని కొందరు ప్రశ్నించారు. మహిళా రిజర్వే షన్లలో కూడా రిజర్వేషన్ల గురించి అప్పుడే చర్చ మొదలయ్యింది. మొత్తంగా ఈ విషయంలో పార్లమెంటులో చర్చ జరిగితే తప్ప సరైన సమాధానం రాదు. అయితే 2011 జనాభా లెక్కల ప్రకారం అయితే పునర్విభజన పక్కన పెట్టాలని అంటున్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల సమావేశాన్ని విజయవంతం చేయాలి



**- భూపాలపల్లి జేఏసీ కన్వీనర్ పైడిపల్లి రమేష్ పిలుపు**

**- తెలంగాణ ఉద్యమకారుల నూతన కమిటీ ఏర్పాటు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, ఏప్రిల్ 15 : ఈ నెల 18న హైదరాబాద్ తార్నాకలోని మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల మహాసభకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని భూపాలపల్లి జేఏసీ కన్వీనర్ పైడిపల్లి రమేష్ పిలుపునిచ్చారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో బుధవారం లంగాణ ఉద్యమకారుల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి పున్నం రవి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా భూపాలపల్లి జేఏసీ కన్వీనర్ పైడిపల్లి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు రావాల్సిన న్యాయమైన హక్కులు, డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేసి ఉద్యమకారులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఉద్యమకారుల త్యాగాలను గుర్తించి వారికి తగిన గౌరవం, సంక్షేమ పథకాలు అందించాలని పేర్కొన్నారు. అనంతరం సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. రేగొండ మండల కన్వీనర్‌గా పత్తి బుచ్చిరెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా ఏడు నూతుల విజేందర్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారులు దాసరి తిరుపతిరెడ్డి, మైస బిక్షపతి, పట్టెం శంకర్, అయిలి శ్రీధర్ గౌడ్, రూపురెడ్డి లింగారెడ్డి, గండి తిరుపతి, గోగుల అశోక్ రెడ్డి, గుర్రాల సుమన్ రెడ్డి, వెల్దండి అశోక్, ముదురు కోళ్ల సుధాకర్, మాడగాని రామచందర్, మడికంటి ప్రభాకర్, మాచర్ల లింగమూర్తి, కర్ల బిక్షపతి, సామర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




# జర్నలిస్టులు జాతీయస్థాయి సమావేశాలు నిర్వహించడం అభినందనీయం

**- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు**

**- మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, ఏప్రిల్ 15 : హైదరాబాద్ వేదికగా జర్నలిస్టులు జాతీయస్థాయి సమావేశాలు నిర్వహించడం అభినందనీయమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడలో బుధవారం ఈ నెల 23, 24 తేదీలలో హైదరాబాద్ లో నిర్వహించే నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా), ఎన్‌యూజే (ఐ) జాతీయ సమావేశాల వాల్ పోస్టర్ ను మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఎన్‌యూజే(ఐ) అనుబంధ యూనియన్ అయిన తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ (టిఎస్ జెయు) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల జర్నలిస్ట్ ప్రతినిధులు హాజరయ్యేలా, హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించడం అభినందనీయమన్నారు ఈ ప్రతిష్టాత్మక సమావేశాలకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమని పేర్కొన్నారు. జర్నలిస్టుల సమస్యలపై చర్చించేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని ఆకాంక్షిస్తూ, కార్యక్రమ నిర్వాహకులైన టీఎస్‌జేయూ రాష్ట్ర,జిల్లా కమిటీలకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌జేయూ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తడుక సుధాకర్, జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంతోష్, జిల్లా ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్, జిల్లా ఉపాధ్యక్షులు అరిగేల జనార్ధన్, గట్టు రవీందర్, ధన్వాడ సర్పంచ్ చీటూరి మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





# ప్రతి ఒక్కరు రహదారి నిబంధనలపై అవగాహన కలిగి వుండాలి : జిల్లా కలెక్టర్ హరిత

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, ఏప్రిల్ 15 : ప్రతి పౌరుడు రహదారి నిబంధనల పై అవగాహన కలిగి వుండాలని కలెక్టర్ హరిత అన్నారు. బుదవారం జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్ లో జిల్లా విద్యా శాఖ ఆద్వర్యంలో ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమములో భాగంగా ప్రభుత్వ,ప్రైవేటు విద్యా సంస్థల విద్యార్థులతో రహదారి నిబందల పై నిర్వహించిన అవగాహనా సదస్సు కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి లలిత, జిల్లా రవాణా శాఖ అధికారి రాంచందర్ తో కలిసి కలెక్టర్ హరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రహదారి నిబంధనల పట్ల అవగాహన కలిగి వుండాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు తమ తల్లి దండ్రులకు రహదారి నిబంధనల పై వివరించాలన్నారు. తప్పనిసరిగా హెల్మెట్, సీటు బెల్టులు, ధరించి ప్రయాణం చేయాలని చెప్పాలన్నారు. విద్యార్థులు పాఠశాల ప్రదేశంలోని రహదారి దాటే సమయంలో ట్రాఫిక్ నిబందనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రతి పాఠశాలలో రహదారి నిబందనల పై సైన్ బోర్డు వుండేలా చర్యలు తీసుకోవాలని రోడ్డు పై ప్రయాణించినపుడు ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘన గాని ప్రేరేపించడం గాని చేయకూడదన్నారు. మైనర్లు ఎట్టి పరిస్థితుల్లో వాహనం నడపకూడదన్నారు. వాహనాలను వేగంగా నడప కూడదని విద్యార్థులు తమ తల్లి దండ్రులకు వివరించలన్నారు. మద్యం త్రాగి వాహనాలు నడప కూడదని వివరించారు. మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు గురై తల్లి దండ్రులకు కడుపు కోత మిగిలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో రహదారి నిబందనల పై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమములో అసిఫాబాద్ ఏం ఈ ఓ సుబాష్ రవాణా శాఖ , విద్యా శాఖ, అధికారులు ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు , పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా ధాన్యం రాకుండా పటిష్ట భద్రత ఏర్పాట్లు

**- జిల్లా పౌరసరఫరాల అధికారి కిరణ్ కుమార్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




జయశంకర్–భూపాలపల్లి, ఏప్రిల్ 15 : జిల్లాలో రైతులకు మద్దతు ధర అందించేం దుకు ఇతర రాష్ట్రాల నుండి ధాన్యం అక్రమ రవాణాను పూర్తిగా అడ్డుకునే దిశగా కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్ తెలిపారు. బుధవారం కాలేశ్వరం వద్ద ఏర్పాటు చేసిన అంతరాష్ట్ర చెక్‌పోస్టును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ పౌర సరఫరాల శాఖలు సమన్వయంతో 24 గంటలు నిరంతర పహారా నిర్వహిస్తాయని వెల్లడించారు. జిల్లా రైతుల ప్రయోజనాలను కాపాడడం వారికి న్యాయమైన మద్దతు ధర లభించేలా చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల నుండి అక్రమంగా ధాన్యం రాకుండా పటిష్ట నియంత్రణ చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. అంతరాష్ట్ర చెక్‌పోస్టు ద్వారా వాహనాల తనిఖీలు క్రమం తప్పకుండా నిర్వహించబడతాయని, నియమావళిని ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రాములు, ఎస్.ఐ తమాషా రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శ్రీజ, సివిల్ సప్లై ఇన్స్పెక్టర్లు సురేందర్ రెడ్డి, రాజు, గ్రామ పరిపాలన అధికారి శ్యామ్‌లు పాల్గొన్నారు.

# చిన్నారుల విద్యలో భాగమైన పోలీసులకు హృదయపూర్వక కృతజ్ఞతలు

(ప్రజాలక్ష్యం బ్యూరో)

మంచిర్యాల ఏప్రిల్ 15 : మంచిర్యాల పట్టణంలో ఇటీవల ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ చిన్నారుల విద్యకు కొత్త దిశను చూపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎథిక్ అకాడమీ స్కూల్, జన్మభూమి నగర్, మంచిర్యాల విద్యార్థులు, యాజమాన్యం వినూత్నంగా పోలీస్ శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటివరకు ట్రాఫిక్ నియమాలు, సిగ్నల్స్ గురించి పిల్లలు పద్యాలు, కథలు, తరగతి బోధనల ద్వారా మాత్రమే తెలుసుకున్నారు. కానీ ఇప్పుడు అవి నిజజీవితంలో ప్రత్యక్షంగా కనిపించడం వల్ల చిన్నారులకు అవగాహన మరింత బలపడుతోంది. ఈ మార్పును గుర్తిస్తూ, ఇది కేవలం ట్రాఫిక్ నియంత్రణకే కాకుండా చిన్నారుల అభ్యాసానికి కూడా తోడ్పడిందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ఈ సందర్భంగా, చిన్నారులు స్వయంగా మంచిర్యాల డీసీపీ భాస్కర్‌ను కలసి, తమ చేతులతో రూపొందించిన అందమైన చిత్రాలు, కృతజ్ఞతా సందేశాలను అందజేశారు. రంగురంగుల చిత్రాలలో ట్రాఫిక్ సిగ్నల్స్ రూపకల్పనతో పాటు " థాంక్యూ పోలీస్" సందేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే, పాఠశాల యాజమాన్యం తరఫున మాత్రమే కాకుండా మంచిర్యాల జిల్లా పరిధిలోని అన్ని ప్రీ–ప్రైమరీ మరియు ప్రైమరీ విద్యార్థుల తరఫున అధికారిక కృతజ్ఞతా పత్రాన్ని అందజేశారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద Thank You Police for Making the Signals Real అనే బోర్డులు ఏర్పాటు చేసి తమ అభినందనను వ్యక్తం చేశారు. పాఠశాల డైరెక్టర్ చరణ్ రెడ్డి మాట్లాడుతూ, "పిల్లలకు నేర్చుకోవడం అనేది జీవితం తో అనుసంధానం అయినప్పుడు మరింత ప్రభావవంతంగా ఉంటుంది. ఈ సిగ్నల్స్ ద్వారా తరగతుల్లో నేర్చుకున్న విషయం ఇప్పుడు ప్రత్యక్ష అనుభవంగా మారింది. ఇది పిల్లల అభ్యాసానికి గొప్ప తోడ్పాటు" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మి రెడ్డి, ఏఎస్ఐ సలీమ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ వినూత్న కార్యక్రమం ద్వారా సామాజిక అభివృద్ధి మరియు విద్య పరస్పరం ఎలా కలిసిపోతాయో చూపిస్తూ, చిన్నారులలో అవగాహన పెంపొందించడంలో కొత్త మార్గాన్ని చూపించింది.






# మ్యూజియం నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, ఏప్రిల్ 15 : సరస్వతి పుష్కర ఘాట్ వద్ద జరుగుతున్న స్టోన్ క్లాడింగ్ పనులను ఈ నెలాఖరు లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఇరిగేషన్ శాఖ అధికారులకు ఆదేశించారు. బుధవారం కాళేశ్వరంలో ఆయన స్టోన్ క్లాడింగ్, పార్కింగ్ టైల్స్ మ్యూజియం నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల ప్రగతిని సమీక్షిస్తూ, నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూనే వేగాన్ని పెంచాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సరస్వతి పుష్కరాల దృష్ట్యా అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా మ్యూజియం నిర్మాణ పనుల్లో ఆలస్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, పార్కింగ్ సదుపాయాలు ఘాట్ పరిసరాల్లో మౌలిక వసతులు మెరుగుపరిచే పనులను సమర్థవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, ఇరిగేషన్ ఈఈ తిరుపతిరావు, ఆర్ అండ్ బి ఈఈ రమేష్, కాటారం డిఎస్పీ సూర్య నారాయణ, తహసీల్దార్, సత్యనారాయణ స్వామి, ఎంపిడిఓ రవీంద్ర నాథ్, దేవస్థానం ఈఈ మహేష్, సర్పంచ్ మోహన్ రెడ్డి, పిఏసీఎస్ చైర్మన్ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అథ్లెటిక్స్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**- కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత - విజేతలకు మెడల్స్ బహూకరించిన డిప్యూటీ మేయర్ లలితకుమారి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, ఏప్రిల్ 15 : ఇటీవల హన్మకొండలోని జె.ఎన్ స్టేడియంలో నిర్వహించిన 11వ తెలంగాణ రాష్ట్ర సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భద్రాద్రి జిల్లా పాల్వంచ శ్రీనివాస కాలనీ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్లో అథ్లెటిక్స్ కోచ్ పి.నాగేంద్ర ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో మొత్తం 14 పతకాలు సాధించారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభ కు ముఖ్య అతిథిగా హాజరైన కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత మాట్లాడుతూ క్రీడాకారులు క్రమశిక్షణతో కఠినంగా శిక్షణ పొందడం ద్వారా రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజయాలు సాధించగలరని నిరూపించారని అన్నారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి జిల్లా, రాష్ట్ర ఖ్యాతిని మరింత పెంచాలని, అలాగే మంచి ఉద్యోగ అవకాశాలను పొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి మాట్లాడుతూ పతకాలు సాధించిన క్రీడాకారులను మెడల్స్ బహూకరించి అభినందిస్తూ, ఈ గ్రౌండ్లో అథ్లెటిక్స్ ఎక్కువమంది బాలికల శిక్షణ పొందటం హర్షణీయమని అలాగే ఈ గ్రౌండ్ కి కావలసిన అన్ని అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు తన వంతు సహకారం అందిస్తామని తెలిపారు.



జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ సంజీవ రావు మాట్లాడుతూ ఈ స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్లో నిరంతరం అథ్లెటిక్స్ శిక్షణ కొనసాగుతుందని, ముఖ్యంగా తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్ విద్యార్థులు ఎక్కువ పతకాలు సాధించడం ప్రశంసనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కనగల అనంత రాములు , ఈవెంట్ మేనేజర్ రమేష్ అథ్లెటిక్స్ కోచ్ పి. నాగేంద్ర ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రటరీ కె. మహిధర్ , డిగ్రీ కాలేజ్ పీడీ శ్వేత, చావా రవి, పాల్గొన్నారు.

# రహదారి భద్రత... జీవితానికి రక్ష

**- విద్యార్థులే రోడ్డు భద్రత దూతలు - జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కరెక్ట్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ములుగు, ఏప్రిల్ 16 : రహదారి భద్రతపై తెలంగాణ ప్రభుత్వం రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి అరైవ్–అలైవ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన పెంచేలా, ప్రమాదాలను నివారించడానికి జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ఆధ్వర్యంలో బుధవారం బండారుపల్లి లోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో మరియు పస్రాలోని ఎస్ ఎస్ గార్డెన్‌లో మెరిట్ స్కూల్,సెంట్ మేరీస్ హై స్కూల్ విద్యార్థులతో రోడ్డు భద్రత అవ గాహన కార్యక్రమాలు నిర్వహించారు.విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ, తమ ఇంట్లోని పెద్దలకు, పక్కింటి వారికీ మరియు తమ స్థానిక ప్రాంతాల్లోని వ్యక్తులకు రోడ్డు భద్రత నియమాల గురించి తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లా డుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని, వారి కుటుంబ సభ్యులు వారి కోసం ఇంట్లో ఎదురు చూస్తుంటారని పేర్కొన్నారు.అలాగే మద్యం సేవించి వాహనం నడపకూడదని,సీట్ బెల్ట్ ధరించాలని, వాహనం నడుపుతున్నప్పుడు మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సిఐలు సురేష్, దయాకర్, ఎస్సైలు బుట్ట చంద్రశేఖర్, తాజుద్దీన్, ఆంజనేయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# రహదారి భద్రత... జీవితానికి రక్ష

**- విద్యార్థులే రోడ్డు భద్రత దూతలు**

**- జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కరెక్ట్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, ఏప్రిల్ 16 : రహదారి భద్రతపై తెలంగాణ ప్రభుత్వం రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి అరైవ్–అలైవ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన పెంచేలా,ప్రమాదాలను నివారించడానికి జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేక న్ ఆధ్వర్యంలో బుధవారం బండారుపల్లి లోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో మరియు పస్రాలోని ఎస్ ఎస్ గార్డెన్‌లో మెరిట్ స్కూల్,సెంట్ మేరీస్ హై స్కూల్ విద్యార్థులతో రోడ్డు భద్రత అవ గాహన కార్యక్రమాలు నిర్వహించారు.విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ, తమ ఇంట్లోని పెద్దలకు,పక్కింటి వారికీ మరియు తమ స్థానిక ప్రాంతాల్లోని వ్యక్తులకు రోడ్డు భద్రత నియమాల గురించి తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించి సురక్షితంగా ఇంటికి చేరుకోవాలని,వారి కుటుంబ సభ్యులు వారి కోసం ఇంట్లో ఎదురు చూస్తుంటారని పేర్కొన్నారు.అలాగే మద్యం సేవించి వాహనం నడపకూడదని,సీట్ బెల్ట్ ధరించాలని, వాహనం నడుపుతున్నప్పుడు మొబైల్ ఫోన్ ఉపయోగించకూడదని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సిఐలు సురేష్, దయాకర్,ఎస్సైలు బుట్ట చంద్రశేఖర్,తాజుద్దీన్,ఆంజనేయులు,పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మహమ్మద్ జావేద్ మృతి

**- ఖమ్మం నుంచి హైదరాబాద్ కు వెళుతుండగా తిరుమలగిరి హైవేలో రోడ్డు ప్రమాదం**

**- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రులు, కాంగ్రెస్ నాయకులు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఖమ్మం, ఏప్రిల్ 15 : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ నగర అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు మహమ్మద్ జావేద్ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న సమయంలో నల్లగొండ జిల్లా తిరుమలగిరి హైవేలోని పిల్లలమర్రి శివారు ప్రాంతంలో ఆయన ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జావేద్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. జావేద్ మృతి వార్త తెలిసిన వెంటనే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, మాజీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి తదితరులు సంతాపం తెలిపారు. జావేద్ మృతి ముస్లిం మైనారిటీ సమాజానికి, కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పేర్కొంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ ఘటనతో ఉమ్మడి ఖమ్మం జిల్లా శోకసంద్రంలో మునిగిపోయింది. బీఆర్ఎస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కూడా జావేద్ కుటుంబానికి సంతాపం, సానుభూతి తెలిపారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com